1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 4
సంచిక : 9
పుటలు : 52
రు. 20 లు
తెనాలి

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

నవంబరు 2018




## రాజకీయ ఎత్తుగడలు జాతికి నష్టం కలిగించకూడదు

# సన్నిధానంశర్మ 'ప్రమేయ ఝురి' వ్యాససంకలనం ఆవిష్కరణ



వార్తావివరాలు 49 వ పుటలో....

# నూర్‌బాషా రహంతుల్లా 'తెలుగులో పాలన'



శ్రీ నూర్‌బాషా రహం తుల్లా ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో డెప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్నారు. కొద్ది నెలల్లో పదవీ కాలాన్ని పూర్తి చేసుకోనున్నారు. ప్రస్తుతం స్పోర్ట్ అథారిటీలో పనిచేస్తున్నారు. 2000 నుండీ ఆయన నడుస్తున్న చరిత్ర / అమ్మనుడి పాఠకులు. నాటికీ నేటికీ తెలుగు పట్ల ఒకే విధమైన నిబద్ధత నానాటికీ ఇనుమడిస్తున ఆచరణాత్మక దీక్ష...నిరంతర కృషి! బహుశా ప్రభుత్వ ఉద్యోగస్తుల్లో ప్రజలభాషలో పరిపాలన సాగాలని, మాటల్లోనే గాక తన ఉద్యోగ జీవితంలో కూడా పాటించి, ఆదర్శంగా నిలచిన వ్యక్తి శ్రీ నూర్‌భాషా. వివిధ సందర్భాల్లో ఇందుకు సంబంధించిన అనేక అంశాలపై పలు దిన, మాస, వార పత్రికల్లో తాను వ్రాసిన వ్యాసాలనూ, మరికొన్ని రచనలనూ కూర్చి ఆయన వెలువరించినవి మూడు పుస్తకాలు. తొలిగా 'తెలుగు అధికారభాష కావాలంటే' అనే పుస్తకాన్ని విశాఖ పట్నం కలెక్టరేట్‌లో 2004 నవంబరు 1న ఆవిష్కరింపజేశారు. రెండవది 'తెలుగు దేవభాషే' అనే పుస్తకాన్ని 2012 నవంబరు 15న విజయవాడలో ఆవిష్కరించారు. మూడవ పుస్తకం 'తెలుగులో పాలన' ను 2018 అక్టోబరు 6న విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో అదే అంశంపై తాను పూనుకొని నిర్వహించిన సదస్సు సందర్భంగా స్పోర్ట్స్ అథారిటీ ఎం.డి. శ్రీ బంగార్రాజుగారి చేత ఆవిష్కరింపజేశారు. శ్రీ నూర్‌భాషా రహంతుల్లా నిర్వహించిన ఈ సభలో తెలుగుభాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు డా॥ సామల రమేష్‌బాబు, హైదరాబాదు కేంద్ర విశ్వవిద్యాలయ ఆచార్యులు శ్రీ గారపాటి ఉమామహేశ్వరరావు, కృష్ణాజిల్లా రచయితల సంఘం కార్యదర్శి డా॥ జి.వి.పూర్ణచందు, తెలుగు వికీపీడియా ప్రతినిధి శ్రీ పవన్ సంతోష్ పాల్గొని తెలుగులో పాలనకు సంబంధించిన ముఖ్య అంశాలపై ప్రసంగించారు. భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డా॥ దీర్ఘాసి విజయభాస్కర్ కూడా పాల్గొని చక్కని ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ఈ పుస్తకాన్ని విడుదలచేసి అందరి అభినందనల్నీ చూరగొన్నారు రచయిత. దాదాపు రెండు దశాబ్దాలుగా తెలుగు కోసం తెలుగువారు చేస్తున్న ఆందోళన, ఉద్యమం అనుపాకులన్నీ తెలిసిన రహంతుల్లా తొలి నుండీ ప్రభుత్వ ఉద్యోగంలో తన పరిమితుల్లో తాను ఉంటూనే ప్రశంసించదగిన కృషి చేశారు. నూర్‌భాషాగారి ఆవేదనను, ఆలోచనను సూటిగా గ్రహించాలంటే ఈ పుస్తకానికి తాను ముందుగా వ్రాసుకొన్న 'నామాట' ను చదివితే సరిపోతుంది. దాని వివరణే – తక్కిన 130 పేజీలూ. దానికి ముందుగా పలువురు పెద్దలు, అధికారులు వ్రాసిన మాటలున్నాయి. ప్రభుత్వ 'భాషా సాంస్కృతిక శాఖ' వారు ఈ పుస్తకాన్ని కనీసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వలో వివిధ స్థాయిల్లోని ఉద్యోగులను చదువవలసిందిగా వారికి అందజేస్తే మంచిది.

◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి




**నవంబరు 2018**

## రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలో నైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్ చేసి *editorammanudi@gmail.com* కు పంపాలి. కొరియర్ / రిజిస్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. రచన స్వంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ పంపాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించ లేము.

వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.

## లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| సంపాదక హృదయం : | రాజకీయ ఎత్తుగడలు జాతికి నష్టం కలిగించకూడదు | | 7 |
| కంప్యూటర్లు – తెలుగు : | తెలుగు భాషకు ఆధునిక హోదా – 10 | వీవెన్ | 9 |
| ముఖ చిత్ర కథనం : | భాషాకోవెలలో 'బాల'దివ్వెలు | డా॥ సిరి | 11 |
| గిరిజన వాచకం : | గిరిజన సంస్కృతీ వాచకం.... | డా॥ పి. శివరామకృష్ణ 'శక్తి' | 15 |
| వ్యాకరణం : | వాడుక భాష – వ్యాకరణం | కీ.శే.వఝుల వెంకటేశ్వర్లు | 17 |
| నూరేళ్ళ పొత్తపు గుడి : | వేటపాలెం సారస్వత నికేతనం | రావినూతల శ్రీరాములు | 21 |
| సాహిత్యరంగం : | శరత్ నవలలో తెలుగు పాత్ర.... | మధురాంతకం నరేంద్ర | 26 |
| పొరుగు తెలుగు : | కన్నడ తోటలో విరిసిన తెలుగుపాట | రంగనాథ రామచంద్రరావు | 28 |
| వేమన : | శబ్ద గాండీవి వేమన– 4 | కీ.శే.దుర్గానంద్ | 33 |
| పిట్ట చూపు : | ప్రశ్నార్థకంగా మారుతున్న... | చలసాని నరేంద్ర | 41 |
| సవర భాషకు గుడి : | అక్షరం...వారి ఆరాధ్య దైవం | పట్నాయకుని వెంకటేశర రావు | 46 |
| తెలుగు చరిత్రకారులు : | దేవాలయ వాస్తు శాస్త్రంలో... | జి. వెంకటేశ్వరరావు | 47 |
| పుస్తక సమీక్ష : | సర్వోత్తమ జీవితం.... | ఎం.వి.శాస్త్రి | 48 |

**ధారావాహిక :**

| | | |
|---|---|---|
| 1. బౌద్ధం-వైజ్ఞానిక మార్గం -19 ..... | బొర్రా గోవర్ధన్ | 36 |

**భాషోద్యమ కథానికలు :**

| | | |
|---|---|---|
| 1. వెలుగులకై ప్రస్థానం. | పి.వి.ఆర్.శివకుమార్ | 23 |
| 2.రాతిలో తడి | సడ్లపల్లె చిదంబరరెడ్డి | 43 |

**కవితలు :**

| | | |
|---|---|---|
| 1. బెత్తం | సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి | 16 |
| 2. అమ్మనోటి తేనెపట్టు | అభిరామ్ | 40 |



రేఖా చిత్రాలు : **పాపులూరి చిదంబరేశ్వరరావు** వ్యంగ్య చిత్రాలు : **సరసి**

ముఖచిత్రం : **మాడభూషి రంగాచార్య స్మారక సంఘం సౌజన్యంతో** కంప్యూటరీకరణ : **లంకె జనార్దన్**


'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలు కొందరు వాట్సప్ (Watsup) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు ఆమోదించజాలమని తెలుపుతున్నాము. దయచేసి పోస్టులోగాని, లేదా editorammanudi@gmail.com కుగాని పంపించండి.

– సంపాదకుడు


రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి**, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ-520004.

కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com



రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

మాసపత్రిక

నుడి - నాడు - నెనరు


## హెచ్చరిక

'అమ్మనుడి' పత్రిక సిసి-బై-ఎస్ఎ లైసెన్సు (క్రియేటివ్ కామన్స్ - అట్రిబ్యూషన్ షేర్ అలైక్) లో ప్రచురిత మవుతున్నది. దీని ప్రకారం ఈ పత్రికలో ప్రచురించిన వాటిని తిరిగి స్వేచ్ఛగా ఎవరైనా తమ రచనల్లో వినియోగిం చుకొని స్వయంగా గాని, ఇతరుల ద్వారా గాని, సోషల్ మీడియాలో గాని వాటిని ప్రచురించుకోవచ్చు. అయితే, ఆ సందర్భంలో - ఆ తొలి రచయిత పేరును, 'అమ్మనుడి' ఫలానా సంచిక నుండి తీసుకున్నట్లూ తప్పక ఉటంకించాలి. దయచేసి ఈ అంశాన్ని రచయితలు, ప్రచురణ కర్తలు, చదువరులు గమనించ గోరుతున్నాము

## చందా వివరాలు

| | | వ్యక్తులకు | సంస్థలకు | విదేశీయులకు |
|---|---|---|---|---|
| శాశ్వత చందా | : | రూ.5000 | రూ.7500 | -- |
| 5 సం॥ | : | రూ.1000 | రూ.1500 | 150 డాలర్లు |
| 3 సం॥ | : | రూ. 700 | రూ.1000 | 75 డాలర్లు |
| 1 సం॥ | : | రూ. 240 | రూ. 400 | 25 డాలర్లు |

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**AMMA NUDI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **915020010550189**

**IFSC Code : UTIB0000556**

ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో - చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా


**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి' 8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి** గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244 ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com


**చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంప గలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.**

### చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ - పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

**'అమ్మనుడి' ఈ క్రిందిచోట్ల కూడ లభిస్తుంది**

**నవోదయ బుక్ హౌస్,** ఆర్యసమాజ్ భవనం ఎదురుగా, కాచిగుడా. **హైదరాబాదు - 27.** ఫోన్ :040-24652387

**మైత్రీ బుక్‌హౌస్,** జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్‌రోడ్డు (ఏలూరు రోడ్డు) **విజయవాడ - 2.** ఫోన్ : 9866211995

**మణి బుక్‌స్టాల్,** షాప్ నెం.58, సండేమార్కెట్, **నెల్లూరు-1.** ఫోన్:7386223538.

అమ్మభాష తెలుగును కాపాడుకొనే ఉద్యమంలో భాగంగా భాషాప్రాధాన్యతను తెలిపే

## కథానికలకు ఆహ్వానం

ఈ వేగయుగంలో క్లుప్తతకి ప్రాధాన్యమిస్తూ బుల్లెట్లలా పాఠకుల మెదళ్ళని తాకి కదిలింపజేసి ఆలోచనలలో ముంచెత్తేట్టు చేయగల బలమైన సాహిత్యప్రక్రియ కథానిక. కథ వస్తువైతే, దానిని కళాత్మకంగా మలచి చెప్పే ప్రక్రియ కథానిక. దీనిని చదవడానికి పట్టే సమయంకన్నా ఆలోచింపజేసే సమయం ఎక్కువ. అందుకే అమ్మభాష ప్రాధాన్యం అన్ని కోణాలలో అందరి మనసులలో నాటుకునేట్టు చెప్పే కథానికల్ని వరుసగా **అమ్మనుడి**లో ప్రచురిస్తున్నాం.

ప్రభుత్వ పరిపాలనలో, కోర్టు వ్యవహారాల్లో, నిత్యజీవితంలో తెలుగును కోల్పోతున్నందువల్ల జరిగే నష్టాల్ని కథావస్తువులుగా తీసుకోవచ్చు. అన్నిటికీ మించి విద్యారంగంలో తెలుగును సమూలంగా అణచివేస్తున్నందువల్ల తెలుగు పిల్లలకు - మొత్తంగా తెలుగు జాతికి - కలిగే నష్టాల్ని చిత్రిస్తూ కథానికలను వ్రాయవచ్చు. ఈ కోణాల్లో ఆలోచిస్తే రచయితలకు ఎన్నో కథాంశాలు కన్పిస్తాయి. 'అమ్మనుడి'లో ప్రచురిస్తున్న వ్యాసాల నుంచి ఇలాంటి అంశాలను గ్రహించవచ్చు. ఇందుకు రచయితల, రచయిత్రుల సహకారాన్ని కోరుతున్నాము. ప్రచురించే ప్రతి కథానికకు గౌరవ పారితోషికం పంపిస్తున్నాము.

- కథానిక ప్రచురణలో 2నుండి 4 పుటలకు మించకుండా ఉంటే మంచిది. ప్రతినెలా 1 లేక 2 కథానికలను మాత్రం ప్రచురించగలం.


సంపాదకుడు, **అమ్మనుడి,** జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-520 004. ఫోన్ : 9848016136. e-mail : editorammanudi@gmail.com

# వార్తలు అమెరికాలో ఇంగ్లీషేతర 20 భాషల్లో తెలుగు ప్రాముఖ్యం

తెలుగు రాష్ట్రాలలో తెలుగు భాష నిరాదరణకు గురవుతున్నా అమెరికాలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న భాషల్లో ఒకటిగా తెలుగు గుర్తింపు పొందుతున్నది. ఇంగ్లీషేతర 20 భాషలలో తెలుగు ఒకటిగా ఉండటం విశేషం. తెలుగు మాట్లాడుతున్న వారి సంఖ్య 86 శాతం పెరిగినట్లు సెంటర్ ఫర్ ఇమ్మిగ్రేషన్ స్టడీస్ నిర్వహించిన ఒక సర్వే వెల్లడించింది.

2010 నుండి 2017 వరకు గణాంకాలను పరిశీలిస్తే తెలుగు మాట్లాడుతున్న వారి సంఖ్య 4 లక్షలకు చేరింది. ఈ ఏడేళ్ళలో ఈ సంఖ్య రెండింతలు పెరిగినట్లు తేలింది. ఇక భారతీయ భాషలలో-అమెరికాలో తెలుగు మాట్లాడుతున్న వారి సంఖ్య- దక్షిణాది భాషలలో తెలుగు పై స్థానంలో ఉంది. ఆ తర్వాతి స్థానాలలో బెంగాలీ, తమిళ్, అరబిక్, హిందీ ఉండటం గమనార్హం.

హిందీ మాట్లాడే వారి సంఖ్య 42 శాతం, గుజరాతీ మాట్లాడే వారి సంఖ్య 22 శాతం చొప్పున పెరిగింది. 2010లో 87,543 మంది తెలుగు మాట్లాడేవారు అమెరికాలో ఉండగా, ఏడేళ్ళ తర్వాత ఆ సంఖ్య 4,15,414 కు పెరిగింది. అమెరికాలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న తెలుగు ప్రజలు తమ భాషను తమ కుటుంబంలోని రెండవ, మూడవ తరాల వారికి కూడా వ్యాప్తి చేయడం కోసం చేస్తున్న కృషి అందుకు కారణం కావచ్చని భావిస్తున్నారు.

అమెరికాలోని ఐదు పెద్ద నగరాల జనాభాలో దాదాపు సగం మంది, 48.2 శాతం ఇళ్ళల్లో ఇంగ్లీష్ కాకుండా మరో భాష మాట్లాడుతున్నట్లు ఈ సర్వే వెల్లడించింది. ఇళ్ళల్లో విదేశీ భాషను మాట్లాడుతున్న అమెరికన్ల సంఖ్య మొత్తం మీద 6.70 కోట్లకు చేరుకొంది. 1990లో ఈ సంఖ్య 3.50 కోట్లు మంది మాత్రమే ఉండటం గమనార్హం.

తెలుగు భాష మాట్లాడే వారి సంఖ్య పెరగడానికి సాఫ్ట్ వేర్ రంగం విస్తృతమవడం, సాంకేతిక నిపుణుల కొరత ఏర్పడటం ప్రధాన కారణంగా కనిపిస్తున్నది. దానితో ఇతర దేశాల నుండి అమెరికాకు సాంకేతిక నిపుణులు రావలసిన అవసరం ఏర్పడింది. అత్యధికంగా తెలుగు రాష్ట్రాల నుండే సాంకేతిక నిపుణులు ఇప్పుడు లభ్యం అవుతున్నారు. ఇవే ధోరణులు కొనసాగితే రాబోయే రోజులలో తెలుగు నిపుణులు అమెరికాలో విశేషమైన పలుకుబడి గల వర్గంగా గుర్తింపు పొందే అవకాశం ఉంది.

## తెలుగు భాషా శాస్త్రజ్ఞుల వేదిక (TELF) 10 వ జాతీయసదస్సు, 28-29 జనవరి, 2019.

## పత్ర సమర్పణకు ఆహ్వానం

తెలుగు భాషావికాసం కోసం 2005 లో "తెలుగు భాషా శాస్త్రజ్ఞుల వేదిక" ఆవిర్భవించింది. తెలుగు ప్రధాన భాషగా మాట్లాడే ఉభయ రాష్ట్రాలలోనూ, దేశంలోని వివిధ ప్రాంతాలలోనూ, అంతర్జాతీయంగానూ తెలుగు భాషాభివృద్ధికోసం పనిచేస్తున్న వారందరి మధ్య వారధి "తెలుగు భాషాశాస్త్రజ్ఞుల వేదిక". తెలుగు భాషపై శాస్త్రీయ పద్ధతిలో పరిశోధనలు చేసే పరిశోధకుల, ఆచార్యుల కృషిని ప్రకటించేందుకు ప్రతియేటా ఒక జాతీయ సదస్సును నిర్వహించడం 'వేదిక' కార్యక్రమాలలో ఒకటి. ఈ నేపథ్యంలో ఈ కింది అంశాలమీద పరిశోధన పత్రాలను ఆహ్వానిస్తున్నాం.

1. తెలుగు అనువాద ప్రక్రియలు, సమస్యలు, పరిష్కారాలు,2. తెలుగు భాషా ప్రణాళిక, 3. ప్రసారమాధ్యమాలలో తెలుగు వినియోగం,4. నిఘంటువులు, పదపట్టికల తయారీ,5. తెలుగు మాండలికాల పరిశోధన, 6. తెలుగు ఆధునీకరణ,7. తెలుగు సాంకేతిక పరిజ్ఞానం, 8. తెలుగు లిపి,లేఖన సంప్రదాయాలు, 9. తెలుగు, ఇతర భాషల తులనాత్మక అధ్యయనం, 10. తెలుగు భాషాబోధన, 11. అంతర్జాలంలో తెలుగు, 12. ధ్వని, వర్ణ, పదాంశ, వాక్య, అర్థ విజ్ఞానాలు : తెలుగు, 13. తెలుగులో ఆన్‌లైన్ కోర్సుల రూపకల్పన (మూక్స్), 14. ప్రాచీన భాషగా తెలుగు, 15. తెలుగేతర రాష్ట్రాల్లో తెలుగును రెండవభాషగా, మూడవ భాషగా బోధించడం, 16. సైకో న్యూరోలింగ్విస్టిక్స్, పరిశోధన సంబంధిత అంశాలు, 17. సామాజిక మాధ్యమాలలో తెలుగు భాష.

ఈ అంశాలతోపాటు తెలుగు భాషకు సంబంధించిన అంశాలపై పరిశోధన పత్రాలను, తెలుగు లేదా ఆంగ్ల భాషలలో సమర్పించవచ్చు. సంక్షిప్త పత్రాలను ఒక పేజీ మించకుండా పంపాలి. పట్టికలు, రేఖాచిత్రాలు ఉపయుక్తగ్రంథసూచులతో కలిపి ప్రధానపత్రం ఎనిమిది పుటలకు మించకూడదు. టి.ఎ. తదితర వివరాలను తరువాత మీకు తెలియజేస్తాం. సంక్షిప్తులను, పత్రాలను, వేదికలోని సైన్టిఫిక్ కమిటి పరిశీలిస్తుంది. సదస్సులో పత్ర సమర్పణకు, ఆపై ముద్రణకు సైంటిఫిక్ కమిటీదే తుది నిర్ణయం.

పత్రసమర్పకులకు గమనిక: పత్రాలను తెలుగు లేదా ఇంగ్లీషు భాషలలోనే సమర్పించండి. గతంలో సమర్పించిన, లేదా ముద్రించిన పత్రాలను సమర్పించరాదు.

సంయోజకులు: మహమ్మద్ అన్సారీ, హెడ్ మరియుచైర్మన్, బీవోయస్, సెంటర్ ఆఫ్ అడ్వాన్స్డ్ స్టడీస్ ఇన్ లింగ్విస్టిక్స్, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు సెల్.నం. 9440390517.

సమన్వయకర్త: సుశీల్ కుమార్, అసిస్టంట్ ప్రొఫెసర్, సెంటర్ ఆఫ్ అడ్వాన్స్డ్ స్టడీస్ ఇన్ లింగ్విస్టిక్స్, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు. సెల్. నం:929730707.

E.mail: telf10.ouling 2019@gmail.com.

**ప్రొఫెసర్. ఎం.యస్.హయత్, కార్యదర్శి, హైదరాబాదు,** సెల్.నం:9866589785. E.mail: secretarytelf@gmail.com.

సంక్షిప్త పత్ర సమర్పణకు చివరి తేదీ: 06-11-2018

ఎంపిక చేయబడ్డ సంక్షిప్త పత్రాల సమాచారం: 16-11-2018

ప్రధాన పత్ర సమర్పణకు చివరి తేదీ: 10-12-2018

ఎంపిక చేయబడ్డ పత్ర సమర్పకులకు సమాచార తేదీ: 30-12-2018

పత్ర సమర్పకులు సదస్సులో పాల్గొనే విషయంపై తమ నిర్ధారణ తెలియచేసే చివరితేదీ : 10-01-2019.

# ఉద్యమ చైతన్యానికి మారుపేరు
# కీ.శే.పి.(యుటిఎఫ్)వెంకటేశ్వరరావు



కనువెలుగు 2-11-1947
కనుమరుగు 25-10-2018




మచిలీపట్నంలో ఉపాధ్యాయ నేతగా, భాషోద్యమనేతగా, విద్యార్థుల మార్గదర్శిగా, ఆపన్నులను ఆదుకొనే మానవతా మూర్తిగా జీవితాన్నంతా గడిపి, అక్టోబరు 25 రాత్రి కన్నుమూశారు. పూర్తిపేరు పెనుబోతు వెంకటేశ్వరరావు అయినా 'యుటిఎఫ్ వెంకటేశ్వరరావు' గానే గుర్తింపు తెచ్చుకున్నారు. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రస్థాయిలో ఉపాధ్యాయ నేతగా 'యుటిఎఫ్' నాయకుడిగా కీర్తి గడించారు.

నిత్యచైతన్యానికీ, భాషా, విద్యార్థి, ఉపాధ్యాయ ఉద్యమాలకు నేతృత్వం వహించడానికీ ఆయన మారుపేరుగా నిలిచారు. అజాత శత్రువుగా, స్నేహశీలిగా జీవితాన్ని గడిపారు. తెలుగు భాషోద్యమంతో ఆయనకు పూర్తి భాగస్వామ్యం ఉంది. శ్రీకాకుళంలో 2002 నవంబరులో జరిగిన శిబిరంలో పాల్గొనడంతో మొదలై 2012 డిసెంబరు చివరిలో తిరుపతిలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల వరకు ఆయన అన్ని కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అప్పటినుండీ అనారోగ్యంతో బాధపడుతూనే సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాల్లో మచిలీపట్నంలో పాల్గొంటూనే ఉన్నారు.

తెలుగు భాషోద్యమ సమాఖ్య ఏర్పడినప్పటి నుండీ కేంద్ర కమిటీలో ఆయన సభ్యుడుగా ఉన్నారు. 'నడుస్తున్న చరిత్ర' పత్రికకు శాశ్వత చందాదారుగా తాను చేరి, ఇతరులను ప్రోత్సహించి చందా దారులుగా చేర్పించారు. పత్రికను ఎంతో అభిమానించిన ఆయన, 'నడుస్తున్న చరిత్ర' అనే పేరుతోనే ఎన్నో పద్యాలను రచించి, వాటిని మూడు సంపుటాలుగా వెలువరించారు. తెలుగుజాతి ట్రస్టుకు పదివేల రూపాయలు విరాళంగా ఇచ్చారు. పేద విద్యార్థులకు, ఆపన్నులకు గుప్తదానాలు చేసేవారు కూడా. అందరినీ ప్రోత్సహించడం ఆయన నైజం. ఆయన అంతిమ యాత్రలో ఉపాధ్యాయరంగం నుంచి ఆయన మిత్రులు ఎందరో కదలివచ్చి పాల్గొన్నారు. తెలుగు భాషోద్యమ సమాఖ్య కేంద్ర అధ్యక్షుడు డా॥ సామల రమేష్‌బాబు, స్థానికశాఖ కార్యదర్శి శ్రీ అప్పినీడి పోతురాజు, స్థానిక ప్రముఖులు డా॥బి.సారంగపాణి, శ్రీ పెన్నేరు అమరేశ్వరరావు, యుటిఎఫ్ నేతలు శ్రీయుతులు కె.ఎస్.లక్ష్మణరావు, బొడ్డు నాగేశ్వరరావు మున్నగువారు పాల్గొన్నారు. కనుమరుగైన ఆత్మీయుడు వెంకటేశ్వరరావుగారికి సమాఖ్య తరఫున, అమ్మనుడి పత్రిక, తెలుగుజాతి ట్రస్టు తరఫున శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము

– సంపాదకుడు



సంపుటి : 4 సంచిక : 9
అమ్మనుడి
నవంబరు 2018

సంపాదక హృదయం

# రాజకీయ ఎత్తుగడలు జాతికి నష్టం కలిగించకూడదు

దేశ రాజకీయాలను 'తెలుగు' కవ్వంతో చిలకాలని తెలుగుదేశం పార్టీ నిర్ణయించుకొన్నట్లు తాజా వార్తలు వెల్లడి చేస్తున్నాయి. పొరుగునవున్న తమిళనాడు, కర్నాటక, తెలంగాణ, ఒరిస్సా రాష్ట్రాల్లో, అండమాన్ నికోబార్ దీవుల్లో, ఢిల్లీలోనూ తెలుగువారు (అంటే ఆంధ్రా తెలుగువారు అని ఇక్కడ అర్థం చేసుకోవాలి) దాదాపు 4 కోట్ల దాకా ఉన్నారని తె.దే.పా.వారి అంచనా. వారిని ఆధారం చేసుకొని తమిళనాడులో 5, కర్నాటకలో 3లేక 4, ఒరిస్సాలో 2, అండమాన్‌లో 1, ఢిల్లీలో 1 లోక్‌సభ సీట్లలో - 2019 సాధారణ ఎన్నికల్లో పోటీ చేయాలని తెలుగుదేశం పార్టీ కేంద్రనాయకత్వ స్థాయిలో బలమైన ఆలోచన జరుగుతున్నదట. అయితే, ఈ 'తెలుగు' ప్రజలు ఆయా రాష్ట్రాల్లో కొన్ని తావుల్లో చిక్కగా, అనేక తావుల్లో పలుచగా విస్తరించి వుంటారు గనుక ఆయా రాష్ట్రాల్లో బలమైన భాజపాయేతర పార్టీలతో పొత్తు కుదుర్చుకోవాలని, ఆ విధంగా భారతదేశంలో ఒక బలమైన జాతీయ పార్టీగా ఆవిర్భవించి, జాతీయ రాజకీయాల్లో కీలకం కావాలనేది ఆ పార్టీ వ్యూహమట. దేశం మొత్తమ్మీద 40-50 లోక్‌సభ సీట్లు గెలవాలనే లక్ష్యంతో తె.దే.పా. కసరత్తును ఇప్పటికే మొదలు పెట్టిందని వార్తలు గుప్పుమంటున్నాయి. సామాజిక మాధ్యమాల్లో విహరిస్తున్నాయి కూడా.

తమిళనాడు - పేరుకు తమిళ రాష్ట్రమే అయినా, నిజానికి లోతుకు వెళ్లి పరిశీలిస్తే తమిళం మాతృభాషగా వున్నవారు ప్రజల్లో సగానికి లోపే ఉంటారు. 42 శాతానికి పైబడిన తెలుగువారు అక్కడ ఉన్నప్పటికీ, అధికారిక లెక్కల్లో 6-7 శాతానికి మధ్యలో వున్నట్లు చూపుతారు. దీనికి కారణాలు, చరిత్ర ఇక్కడ చర్చించే చోటు, సందర్భమూ కాదుగాని - అక్కడి భాషా సామాజిక ఉద్యమాల, రాజకీయాల ఫలితంగా, భాషా రాష్ట్రాల ఏర్పాటు పర్యవసానంగా - అదంతా తమిళనాడై పోయింది. అంత పెద్ద తెలుగు జనాభా తమిళ భాషా రాజకీయాల వత్తిడిలో కరిగిపోయారు. అక్కడి తెలుగువారిలోంచే వీర తమిళ రాజకీయ నేతలు పుట్టుకొచ్చారు. ద్రావిడ రాజకీయాల్లో ఎదిగినవారు ప్రజా ప్రతినిధులయ్యారు. అక్కడ ఒక భాషాజాతిగా తెలుగువారు తరిగిపోతున్నా ఆంధ్రప్రదేశ్ రాజకీయ నేతలు ఏనాడూ వారిని పట్టించుకొన్న పాపాన పోలేదు. అయితే గత రెండు దశాబ్దాలుగా కొన్ని తావుల్లో తెలుగువారిలో చోటుచేసుకొంటున్న స్వాభిమాన పోకడలు, సొంత భాష పట్ల మక్కువ, రాజకీయ చైతన్యం వల్ల - వారిలో కొందరికి తమ రాజకీయ గుర్తింపుకోసం ఆలోచన మొదలైంది. కొందరు తెలుగుదేశం పార్టీని అక్కడ భుజానికెత్తుకోవాలని ప్రయత్నించారుగాని ఆ ప్రయత్నాలు అంతగా ముందుకు సాగలేదు. ఇప్పుడు తెదేపా కొత్తగా చేస్తున్న ఆలోచనలను స్వాగతించే సామాజిక, ఆర్థిక వర్గాలు చిన్నవిగా అయినా అక్కడ ఉన్నాయి.

తక్కిన రాష్ట్రాల్లో పరిస్థితులు కూడా ఇంచుమించు ఇలాగే వున్నాయి. అయితే-ఇతర రాష్ట్రాల్లోని తెలుగువారిలోంచి మద్దతు రావాలంటే, తెదేపా ఇంతవరకు వారి భాషా సంస్కృతుల కోసం చేసిందేమీ లేదు. తెలుగు రాష్ట్రాల్లో పాలక వర్గాలకు స్పష్టమైన, హేతుబద్ధమైన భాషా విధానమే లేని పరిస్థితుల్లో పొరుగు రాష్ట్రాల్లో అణగారిపోతున్న తెలుగుజాతి జనులకు తె.దే.పా.గాని, తక్కిన పార్టీలుగాని ఏదో వొరగబెడతాయన్న ఆశ అక్కడి వారెవ్వరికీ లేదు. నిజం కూడా అదే. కనుక ఆయా రాష్ట్రాల్లోని ఏ రాజకీయ పక్షాలతో జత కట్టాలనుకొన్నా అది వాస్తవ రూపంలోకి రావడం సులువుగా సాధ్యమయ్యే పని కాదు. పార్టీల మధ్య ఒప్పందాలు కుదిరినా అక్కడి తెలుగు ప్రజలు స్థానిక రాజకీయ పార్టీలను ప్రక్కనబెట్టి, ఏ భరోసాతో

తె.దే.పా.ను అక్కున చేర్చుకొంటారు? తెదేపాతో సర్దుబాటు చేసుకొన్నంత మాత్రాన అక్కడి తెలుగువారందరూ గుండుగుత్తగా తమ పార్టీకే ఓటు వేస్తారని అక్కడి స్థానిక రాజకీయ పార్టీలు నమ్మవు. కర్నాటకలో జెడిఎస్, ఒరిస్సాలో బిజెడి, తమిళనాడులో డిఎంకె స్థానికంగా బలమైన పార్టీలు. వాటితో సీట్ల సర్దుబాటు, సమర్ధన తె.దే.పా. ఆశిస్తున్నట్లు సమాచారం. బలహీనమైన జాతీయ పార్టీతో సర్దుబాటు సాధ్యమేమోగాని, ఒక బలమైన ప్రాంతీయ పార్టీతో మరొక రాష్ట్ర ప్రాంతీయ పార్టీకి జత కలుస్తుందనుకోవడం భ్రమ.

ఈ రాజకీయ ఇచ్చిపుచ్చుకోవడాల ఆలోచనలు – ఇతర రాష్ట్రాలలోని తెలుగువారికి మేలు చేస్తాయో, కీడు చేస్తాయో తె.దే.పా. మరింతగా ఆలోచించాలి. కులాల వారీగా ఇప్పటికే తెలుగు ప్రజలు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ రాజకీయంగా చీలిపోయి వున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అయితే అధికార పక్షమైన తె.దే.పా, ప్రతిపక్షంగా వున్న వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి రావాలనే లక్ష్యంగా పోటీ చేస్తున్న జనసేన – మూడు పార్టీలూ – వారొప్పుకోకపోయినా – మూడు కుల వర్గాల బలమైన మద్దతుతోనే ఉన్నాయన్న సంగతి అందరికీ తెలిసిందే. ఈ కోణంలో చూసినా ఇతర రాష్ట్రాల్లోని తెలుగు ప్రజలందరి మద్దతూ తె.దే.పా.కు లభిస్తుందనుకోలేం. భాషా సాంస్కృతిక అంశాల పరంగా తెదేపా తమకు అండగా నిలుస్తుందనే నమ్మకం వారిలో లేనేలేదన్న సంగతి తెలిసిందే.

తెలంగాణకు పొరుగున ఉన్న మహారాష్ట్ర, చత్తీస్‌ఘర్ వంటి రాష్ట్రాల్లోని తెలుగువారి గురించి తెదేపా ఆలోచించడం లేదని అర్థమవుతున్నది. కారణం అక్కడి వారికి తెలంగాణతో సంబంధ బాంధవ్యాలెక్కువ. కనుక, ఉన్న రెండు రాష్ట్రాల్లోని తెలుగువారందరినీ ఒకటిగా భావించలేని మన రాజకీయ పార్టీలు బయటి రాష్ట్రాల్లోని తెలుగువారందరి శ్రేయస్సును కోరుకుంటాయని ఎవరూ నమ్మజాలరు.

రెండు తెలుగు రాష్ట్రాలుగా వేరుపడిపోయిన తర్వాత తెలుగు భాష అభివృద్ధి, విశ్వవిద్యాలయం, అకాడమీ వంటి ఉమ్మడి అంశాల గురించి గాని, చరిత్ర, సాంస్కృతికతలకు చెందిన అంశాల గురించిగాని, రెండు రాష్ట్రాల నేతలూ కలిసి ఆలోచించిన ఒక్క సందర్భమూ లేదు. కనీసం భాషపట్ల ఏదో పొడిచేస్తాం అని కబుర్లు చెప్పడం తప్ప – రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పాలకులు చేసింది ఏమీ లేదు. ఇది సిగ్గుచేటు.

రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడం కోసమే కేంద్ర పాలకులను వ్యతిరేకిస్తున్నట్లు ఏ ముఖ్యమంత్రి చెప్పినా, దాన్ని నమ్మేటంత అమాయకంగా ప్రజలు లేరు. అన్ని అంశాలనూ వారు నిశితంగా గమనిస్తూనే ఉన్నారని నేతలు తెలుసుకోవాలి.

భాషా ప్రాతిపదికన రాష్ట్రాలు ఏర్పడిన సందర్భం నుండి నేటి వరకూ తెలుగుజాతి చరిత్ర సమస్తం – స్వార్థ పూరిత రాజకీయ నేతలు ఆడుకొంటున్న చదరంగమే. భాషా జాతీయత ప్రాతిపదికన వారెన్నడూ చిత్తశుద్ధితో ఆలోచించనూ లేదు, పని చేయనూ లేదు. అంతా తెలుగు వారమే కనుక కలిసి వుండాలనే సాకుతో స్వార్థ రాజకీయాలతో వ్యవహరించినందువల్లనే రాష్ట్రం రెండు ముక్కలైంది. ఇంకా పాలక వర్గాలకు బుద్ధి రాలేదు. ఇప్పుడిదే విధమైన తెలుగు జాతీయత అనే వ్యూహాన్ని జాతీయ స్థాయిలో ప్రయోగించాలనుకోవడం అవివేకం. ఇక్కడ భారత జాతీయత, భాషా జాతీయత అనే రెండు విశిష్ట భావనలు కూడా మోసగింపబడుతున్నాయి. తెలుగు భావోద్వేగం (సెంటిమెంటు) తో రాజకీయాలను కెలికి, చిలకాలనుకోవడం జాతికి నష్టదాయకం. తెలుగు ప్రజల భావ సమైక్యతకు పురోగతికి వ్యతిరేకం. ఈ రాజకీయ ఎత్తుగడలు ప్రజలను, దేశాన్ని తక్కువ అంచనావేసి చేస్తున్న మోసపూరిత ఆలోచనలు తప్ప, సదుద్దేశ్యంతో కూడినవి కావు.

తెలుగుజాతికోసం అంటే తెలుగు ప్రజల కోసం ఎవరు ఏ రంగంలో పనిచేస్తున్నా అది విశాల ప్రజా ప్రయోజనాల నుద్దేశించినదై వుండాలి. తెలుగు భాషా సంస్కృతులను, ప్రజల సుఖమయ జీవనాన్నీ పురోగతినీ లక్ష్యంగా పెట్టుకొన్న స్పష్టమైన విధానాలననుసరించి వుండాలి. ప్రజాశ్రేయస్సును, జాతి శ్రేయస్సును విస్మరించి, కుత్సిత రాజకీయ స్వార్థంతో చేసే ప్రయత్నాలు విఫలం కాక తప్పదు.

సామల రమేష్‌బాబు

తేదీ : 31-10-2018

వీవెన్
9963029061

# తెలుగు భాషకు ఆధునిక హోదా-10

## అవసరాలు - ఆవిష్కరణలు



భాష పరంగా మనకి కొన్ని అవసరాలు ఉంటాయి. ప్రస్తుతం మనం సమాచార సాంకేతిక యుగంలో, మరీ ముఖ్యంగా డిజిటల్ యుగంలో ఉన్నాం. కంప్యూటర్లను వాడుకునే స్థాయినుండి వాటి మీదే ఆధారపడే స్థాయి వరకూ (అవి లేకుంటే రోజు గడవలేని స్థితి వరకూ) వచ్చాం. కాబట్టి, భాష పరంగా ఇప్పుడు మనకి మునుపటి కంటే వేరైన అవసరాలు ఉండొచ్చు. అవేంటో చూద్దాం. అవసరాల కోసమో (లేదా వాటితో నిమిత్తం లేకుండా కూడా) కొన్ని ఆవిష్కరణలు జరిగి పోతూంటాయి, వినూత్న విశేషాలు వెలుగులోకి వస్తాయి. వాటిని మన భాషాపరమైన అవసరాలకు ఎలా వాడుకోవచ్చో కూడా ఈ వ్యాసంలో పరికిద్దాం.

**1. మాట దిద్దరి (స్పెల్ చెకర్) :** ఈ రోజుల్లో లిఖిత రూపంలో ఉన్న సమాచారం అంతా డిజిటల్ గానే రూపుదిద్దుకుంటున్నది. అంతిమంగా అచ్చులో వినియోగించుకునే సమాచారమైనా డిజిటల్ రూపంలోనే తయారుచేయబడుతుంది. ఇందుకు, వార్తా పత్రికలు మంచి ఉదాహరణ. అక్కడివరకూ ఎందుకు, మీ చేతిలో ఉన్న ఈ అమ్మనుడి పత్రిక కూడా డిజిజల్ రూపంలో సిద్ధమైన తర్వాతే అచ్చు అయి మీకు చేరుతున్నది కదా. లిఖిత రూపంలోని సమాచార తయారీ అంతా డిజిటల్ గానే జరుగుతున్నందున మనకి ఇప్పుడు ఒక మంచి తెలుగు మాట దిద్దరి అవసరం చాలా ఉంది.

మైక్రోసాఫ్ట్ ఆఫీస్, గూగుల్ డాక్స్, లిబ్రెఆఫీస్ వంటి ఉపకరణాలలో ఇప్పటికే తెలుగు మాటదిద్దరి సదుపాయం ఉంది. కానీ, వాటి ఖచ్చితత్వం నిరాశపరిచే స్థాయిలో ఉంది. ఉదాహరణకి, ఈ వ్యాసంలోని సగం కంటే ఎక్కువ పదాలు వాటికి తప్పులుగానే కనిపించాయి. ఒక మోస్తరు వాణిజ్య స్థాయి వాడకానికి ఆ ఖచ్చితత్వం సరిపోదు.

**2. వ్యాకరణ దిద్దరి:** పదాలను సరిచూడగానే సరిపోదు కదా, వాటి క్రమమూ, పొందిక కూడా ముఖ్యమే. కేవలం వ్యాకరణం వరకూ చూస్తే వచనం, లింగం, విభక్తి వంటివి సరిగా ఉన్నాయేమో చూడాలి. యాస లేదా మాండలికం విషయంలో కూడా ఒక వాక్యం ఫలానా యాసలో ఉందని గుర్తించి అందుకు వేరుగా ఉన్న మాటలను ఎత్తి చూపవచ్చు. శైలి విషయంలో ఒక వాక్యం లేదా పేరా ఏ శైలిలో (ఆకడమిక్, వినోదాత్మకం, సంభాషణా పూర్వకం, వ్యంగ్యం వంటి) ఉందో గ్రహించి దానికి విరుద్ధంగా ఉన్న మాటలకు, వాక్యాలకు ప్రత్యామ్నాయాలు సూచించవచ్చు.

ఈ రోజుల్లో లభ్యమవుతున్న అంతులేని డేటా నుండి మనకు కావలసిన సమాచారాన్ని సారాంశంగా అందించడానికి ఇప్పుడు కంప్యూటర్లు మన భాషలో చెప్పడానికి ప్రయత్నిస్తున్నాయి. దీన్ని నాచురల్ లాంగ్వేజ్ జెనరేషన్ (మానవ భాష తయారీ/కూర్పు) అంటున్నారు. అది సహజంగా ఉండటానికి వ్యాకరణం మాత్రమే కాకుండా శైలి, మాండలికం వంటి వాటిని కూడా కూర్చగలిగే, సరిదిద్దగలిగే సామర్థ్యం కంప్యూటర్లకు కావాలి. అలాంటి ఉపకరణాలు మనకు కావాలి.

**3. ఓసీఆర్:** తెలుగుకి సంబంధించినంత వరకూ డిజిటల్ యుగం దాదాపు పదేళ్ళ క్రితం మొదలయిందనుకోవచ్చు. కానీ వందలాది ఏళ్ళుగా మన సాహిత్యం, విజ్ఞానం, సమాచారం అంతా (అందుబాటులో ఉన్నంత వరకు) అచ్చు రూపంలోనో, చేతిరాత రూపంలోనో ఉంది. ఆ విజ్ఞానంలో సమాచారంలో మనకు కావలసిన అంశాలను తేలికగా వెతికి పట్టు కోడానికి, దాన్ని మదింపు వేయడానికి, విశ్లేషించడానికి, క్లుప్తీకరించడానికి ఆ సమాచారం అంతా డిజిటల్ రూపంలో ఉండాలి. అందుకు, తెలుగు అచ్చు అక్షరాలను, చేతిరాతను గుర్తించగలిగే మంచి ఓసీఆర్ (ఆప్టికల్ కారెక్టర్ రికగ్నిషన్) సాంకేతికత చాలా అవసరం. ప్రస్తుతం తెలుగుకు అందుబాటులో ఉన్న ఓసీఆర్ ఉపకరణాలు దాదాపు 80% ఖచ్చితత్వం అందిస్తున్నాయన్నది ఒక అంచనా. ఇది మెరుగైన కొద్దీ సరిచూత, సరిదిద్దడం వంటి వాటిపై మానవ శ్రమ తగ్గుతుంది. ఆ ఆదా అయిన మానవ శ్రమను విశ్లేషణ, వివేచన వంటి మనుషులకై ప్రత్యేకమైన ప్రక్రియలకు వాడుకోవచ్చు.

**4.వాచ్యం నుండి పాఠ్యం:** మనం మాట్లాడిన మాటలను కంప్యూటర్ గ్రహించడం. తద్వారా కంప్యూటరు డిక్టేషన్ పద్ధతిలో టైపు చేసిపెడుతుంది లేదా మన మాటలను ఆదేశాలుగా తీసుకొని మనకు కావలసిన సమాచారాన్ని అందిస్తుంది. ఈ సాంకేతికత రెండు రకాలుగా ఉపయోగపడుతుంది. (అ) వ్రాయలేని వారు అంటే అసలు వ్రాయలేని వారైనా లేదా కేవలం తెలుగు మాట్లాడటం వచ్చి వ్రాయలేని వారైనా, టైపు చెయ్యడం తెలియని వారు గానీ లేదా వ్రాయలేని పరిస్థితులలో లేదా వ్రాయడానికి సరిపడ సమయం లేని సందర్భాలలో వారు మాట్లాడితే కంప్యూటర్ వ్రాసుకోవచ్చు. లేదా ఆ మాటలను ఆదేశాలుగా తీసుకోవచ్చు. (ఆ) వినలేని వారికి, లేదా వినలేని పరిస్థితులలో ఉన్నవారికి ఇతరులు మాట్లాడిన మాటలను అప్పటికప్పుడు పాఠ్యంగా మార్చి తెరపై చూపించ వచ్చు.

ప్రస్తుతం గూగుల్ డాక్స్ లోనూ, ఆండ్రాయిడ్‌లోనూ మనం తెలుగులో మాట్లాడితే కంప్యూటరే టైపుచేసుకోగలిగే వీలుంది. అమెజాన్




అలెక్సా, ఆపిల్ సిరి వంటి తతిమా వాచ్య గుర్తింపు సేవలు మనం తెలుగులో మాట్లాడితే ప్రస్తుతం అర్థం చేసుకోలేవు.

**5. పాఠ్యం నుండి వాచ్యం:** సమాచారాన్ని కంప్యూటర్ చదివి వినిపించడం. ఈ సాంకేతికత ద్వారా మనం అడిగిన సమాచారాన్ని కంప్యూటర్ తెరపై చూపించడం కంటే (లేదా తెరమీద సమాచారాన్ని) మనకి చదివి వినిపిస్తుంది. దీని ద్వారా చూపులేనివారు, చదవడం రాని వారు, చదివే తీరిక లేని వారు, లేదా చదవలేని పరిస్థితులలోనూ సమాచారాన్ని కంప్యూటరు మాట్లాడితే విని తెలుసుకోవచ్చు. తెలుగుకి సంబంధించినంత వరకూ ఈ సాంకేతికత ఇంకా పరిశోధన స్థాయిలోనే ఉంది.

**6. యంత్రానువాదం:** ప్రపంచీకరణ తారాస్థాయిలో ఉన్న ఈ రోజుల్లో ఏ జాతీ స్వంతగా నిరాధారంగా మనగలిగే పరిస్థితి లేదు. అందరూ పరస్పరాధారితమే. అలానే విజ్ఞానం ఏ జాతికీ ప్రత్యేకం కాదు. నేర్చుకోదగ్గది ఏమీ లేని జాతులూ లేవు. ఎవరి ప్రత్యేకత వారిదే. కానీ ఎవరి విజ్ఞానం వారిభాషలోనే ఉంటుంది. లోకంలో వందలాది భాషలు ఉన్నాయి. ఈ సందర్భంలో అందరినీ ఒకే భాష వైపు మళ్ళించేకంటే, ఆ భాషలన్నింటి ప్రత్యేకతనూ, ఉనికినీ నిలుపుతూ భాషల మధ్య సమాచార, భావ ప్రసారానికి వీలుకల్పించే అనువాద ప్రక్రియ చాలా అవసరం. అది యంత్రానువాదం అయితే స్థల కాల పరిమితులనీ అధిగమించవచ్చు. తెలుగులో లేని విజ్ఞానాన్ని, సమాచారాన్ని మనం ఇతర భాషల నుండి దిగుమతి చేసుకోడానికి, మన ప్రత్యేకమైన విజ్ఞానాన్ని ఇతర భాషల వారికి ఎగుమతి చేయడానికి సమర్థవంతమైన యంత్రానువాద ఉపకరణాలు కావాలి. ఇలాంటి ఉపకరణాన్ని టెలిఫోను వ్యవస్థతో అనుసంధానిస్తే, ఒక తెలుగువాడు చైనీయుడితో నేరుగా సంభాషించ వచ్చు. తెలుగువాడు మాట్లాడింది చైనీయుడికి చైనీస్ భాషలోనూ, ఆయన మాట్లాడింది మనవాడికి తెలుగులోనూ వినబడుతుంది. నేటి ప్రపంచీకృత సమాజంలో ఇలాంటి వెసులుబాటు– సౌకర్యం నుండి అవసరంగా మారుతున్నది.

ప్రస్తుతం తెలుగుకి సంబంధించినంత వరకూ ఇంగ్లీషు, హిందీ, మరి కొన్ని భాషలతో యంత్రానువాదం గూగుల్ అనువాద సేవలో లభిస్తున్నది. ఇతర ప్రయత్నాలు పలుచోట్ల పరిశోధన లేదా ప్రయోగ దశల్లోనూ ఉన్నాయి.

పైన చెప్పిన అవసరాలు మనవి. తెలుగు వారివి. మరెక్కడి నుండో సాంకేతికతను దిగుమతి చేసుకుంటే తీరిపోయే అవసరాలు కావవి. ఈ విషయం మీరు పైన చెప్పిన ఏ సాంకేతికతనైనా వాడివుంటే మొదటి నిమిషం లోనే తేటతెల్లమవుతుంది. కంప్యూటరు చేసిన అనువాదం సహజంగా ఉండదు. కంప్యూటరు తెలుగు మాట్లాడితే అది తెలుగులా ఉండదు. ఇందుకు కంప్యూటర్లు ఇంకా మనిషిలా ఆలోచించలేకపోవడం లేదా కనీసం మనుషుల్లా నేర్చుకోలేకపోవడం, నేర్చుకున్న వాటిని వివిధ పరిస్థితులకు అన్వయించుకోలేకపోవడం ప్రధాన కారణం. కృత్రిమ మేధ, యంత్ర శిక్షణ (మెషీన్ లెర్నింగ్) వంటి వాటితో ఆ పరిమితులను అధిగమించే వీలుంది. అయిన ప్పటికీ, మనం–మన తెలుగు వాళ్ళం, మరీ ముఖ్యంగా మన భాషావేత్తలు, మన సాంకేతిక నిపుణులు–కంప్యూటరుకి తెలుగు నేర్పడానికి, ఆయా అంశాల్లో పరిశోధనలకు, ప్రయోగాలకు, ఆవిష్కరణలకు పూనుకోకపోతే తెలుగు భాషకు ఆధునిక హోదా అన్నది "దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని" పరిస్థితే అవుతుంది. ●

**కన్నవారినీ తోడబుట్టినవారినీ తెలుగులో పిలువలేని బ్రతుకెందుకు?!**

ముఖ చిత్ర కథనం

నవంబర్ 14 : బాలల దినోత్సవం సందర్భంగా ప్రత్యేకం

డా॥ సిరి

# భాషాకోవెలలో 'బాల'దివ్వెలు











'తెలుగు' – మన అమ్మ భాష. అమ్మలా చల్లని వెలుగులు పంచే భాష. అటువంటి మన మాతృభాష, అన్యభాషల ప్రభావాల వల్ల, ముఖ్యంగా ఆంగ్లం వల్ల, తన విలువ, వెలుగు కోల్పోతోందని, మన మాతృభాష చుట్టూ అంధకారం అలుముకుంటోందని, ఎందరో భాషా ప్రేమికులు ఆవేదన చెందుతున్నారు. మన భాషను బ్రతికించుకునేందుకు యజ్ఞమే చేస్తున్నారు. అయితే, ఈ యజ్ఞంలో సమిధలవ్వడానికి సిద్ధపడుతున్న వారెంతమందో తెలియదు కానీ, భాషని వెలిగించేందుకు ప్రమిదలయ్యేవారు ఎందరో ఉన్నారు. వారందరిలో, ముందు వరుసలో నిలబడి, తమ చిరుకలాలతో అక్షర దీపికలు వెలిగిస్తున్నవారు, మన ఇరు రాష్ట్రాల 'బడి పిల్లలు'!

అవును, నిజమే, ఆ చిన్నారులే తమ కలాలతో తెలుగు భాషా గగనంలో కాంతులు నింపే ఉషస్సులవుతున్నారు. మన భాషకు ఎనలేని యశస్సుని తీసుకు వస్తున్నారు.

ఈ బాలల దినోత్సవం సందర్భంగా, మన మాతృభాషకు ఎనలేని సేవ చేస్తూ, భాషకు వన్నెని, వెలుగుని తెస్తున్న ఆ చిన్నారులని మనసారా అభినందిద్దాం. వారు వెలిగించిన సాహిత్య దివ్వెల వెలుగుల్లో తెలుగు సౌందర్యాన్ని దర్శిద్దాం...

'అమ్మ' – రెండక్షరాల కమ్మనైన పదం. అమ్మ గురించి చెప్పడానికి, బహుశా ప్రపంచంలో ఉన్న పదాలన్నీ సరిపోవేమో. మరి, అలాంటి అమ్మ గురించి కేవలం రెండు మాటల్లో చెప్పమంటే ఎలా చెప్ప గలుగుతాం. కానీ, పదవ తరగతి చదువుతున్న ఆవునూర్‌కి చెందిన 'బూర్ల సౌమ్య' చెప్పింది, తను వ్రాసిన 'అమ్మ' అనే కవితలో.

అ = అంటే అమృతం /మ = అంటే మమకారం
అమృతం చిలికి మమకారాన్ని పంచేదే 'అమ్మ' అంది.
అంతేకాదు,
అమ్మ మనసు దైవమురా / అమ్మ ప్రేమ రూపమురా
అమ్మ వంటి దేవతరా / అవనిలోన లేదురా – అంది.

ఇది ఎవరూ కాదనలేని సత్యం. "కవితల సింగిడి" అను పుస్తకంలో, ఇటువంటి కవితలెన్నో కొలువై ఉన్నాయి.

ఇంతసేపూ అమ్మ ప్రేమ గురించి చెప్పుకున్నాం. అయితే, ఇంత ప్రేమను పంచే తల్లి కూడా ఒక్కోసారి కాలం ముందు ఓడిపోతుంది. ప్రాణాల్ని పణంగా పెట్టి కన్న బిడ్డను, గత్యంతరం లేక చెత్తబుట్ట పాలు జేస్తుంది. మరి అటువంటి తల్లిని తలుచుకుంటే, ఆ బిడ్డకు ఎంత కోపం రావాలి? కానీ, పిల్లల మనసు స్వచ్ఛమైనది. ఎవరినైనా క్షమించే గుణం వారికుంటుంది. ఎవరినైనా క్షమించ గలిగిన వారు, తల్లిని క్షమించరా – ఆ క్షమాపణను కవితా రూపంలో ప్రవహింపజేసింది, విజయనగరానికి చెందిన 'కూరెళ్ళ శ్రీశ్రేయ' అనే విద్యార్థిని, తన 'ఎంత బాగుంటుందో' అనే కవితా సంపుటిలో.

"ఆడ పిల్లనై బయటకు వచ్చి / నీలా బాధపడకూడదనే కదా అమ్మా / నన్నిలా చెత్తబుట్టలో పడేశావు / నిన్ను నేనర్థం చేసుకున్నానమ్మా!" అని వ్రాసింది.

పిల్లల మనసు ఎంత గొప్పదో చెప్పడానికి, ఇది చాలు.

* * *

'అక్షరం' – నాశనం లేనిది. అక్షరం చేసే మేలు ఇంతని చెప్పడం ఎవరి తరం? అమ్మ విలువ, అక్షరం విలువ తెలిసినవారికి జీవితం విలువ తెలిసినట్లే. అటువంటి అక్షరం విలువని, తన పద్యంతో ఎంతో చక్కగా చెప్పాడు 'సి. హెచ్. వంశీ', తను వ్రాసిన నీతి శతకంలో.

'అక్షరాల మనము లక్షణంబుగ నేర్వ / బ్రతుకు బాటలోన పసిడినిచ్చు / చదువుకున్న మనకు సంస్కారమబ్బును / వినుము వంశిమాట వివరముగను' అంటాడు.

సిద్దిపేట జిల్లా కొండపాక జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు వ్రాసిన పద్యాల్లో, ఇటువంటి ఆణిముత్యాలనేకం. ఈ ఆణిముత్యాల సమాహారమే 'లలిత పల్లవాలు' అనే పుస్తకం.

'ఈ కాలం పిల్లలకి పద్యాలంటే ఏం తెలుస్తాయి' అనుకునే వారికి. వీరు వ్రాసిన శతకాలు, ఒక కనువిప్పు.

అక్షరం విలువనే కాదు, చదువు విలువను కూడా చాలా చక్కగా చెప్పారు ఈ చిన్నారులు. ఇప్పుడో కథ చెప్పుకుందాం. కథ పేరు "వడగళ్ళ వాన". కథేమిటంటే, "ఓ రాజ్యంలో ఓ రాజు ఉండేవాడు. అతనికి చదువురాదు. మహారాణి మాత్రం చదువుకున్నది. ఒక రోజు, రాజు మంత్రితో కలిసి అడవికి వెళ్ళాడు. అప్పుడు ఉన్నట్లుండి వడగళ్ళ వాన కురిసింది. తెల్లని వడగళ్ళను చూసి రాజు వజ్రాలుగా భావించాడు. ఆ

రోజు వడగళ్ళన్నిటినీ పోగు చేశారు. మరుసటిరోజు చూసేసరికి అన్నీ మాయమై నీళ్ళు మిగిలాయి. మంత్రిగారు విషయాన్నంతా రాణిగారికి చెప్పారు.

"మీకు వడగళ్ళకు వజ్రాలకు తేడా తెలీక పోవడానికి కారణం మీకు చదువు రాకపోవడమే" అని రాజుతో అన్నది. తన లోపం తెలుసుకున్న రాజుగారు, తాను చదువుకోవడమే కాక, దేశంలో ప్రజలందరూ చదువుకునేలా ప్రోత్సహించాడు". ఇదీ కథ. ఈ కథను, జహీరాబాద్, ఝరాసంగం, కస్తూర్బా బాలికల పాఠశాలలో ఏడవ (7) తరగతి చదివే 'ఎం. సుస్మిత' అనే విద్యార్థిని వ్రాసింది. ఈ చిన్ని కథలోనే తాను చెప్పాలనుకున్నదంతా చెప్పేసింది. అలాగే, చదువుకోవడం అనేది ఎంత అవసరమో, తను వ్రాసిన "చదువు విలువ" కథలో చక్కగా చెప్పింది. అస్మాన్‌గఢ్, సెయింట్ జోసఫ్ స్కూల్‌లో 9వ తరగతి చదివే 'ఎ. సింధూజ' అనే విద్యార్థిని. ఇటువంటి ఎన్నో కథలు, "జహీరాబాద్ పిల్లల కథలు" మరియు "బాల కథా మంజరి" పుస్తకాల్లో దర్శనమిస్తాయి.

* * *

పిల్లలు దేవుడికి ప్రతిరూపాలంటారు. వారి మనసు ఎప్పుడూ నిష్కల్మషంగా ఉంటుంది. ఆ పసి హృదయాల్లో.... మమతా మానవత్వమే నిండుంటుంది. దానికి నిదర్శనమే, "కోతి - కృతజ్ఞత" అనే కథ. ఈ కథలో, తన ఆకలి తీర్చుకోవడం కోసం, విద్యార్థులు తినగా మిగిలిన అన్నాన్ని తినడానికి వచ్చిన ఒక బుల్లి కోతి పిల్లని, ఒక కొంటె విద్యార్థి గాయపరుస్తాడు. అది చూసిన సాయి అనే మరో విద్యార్థి, "అరేయ్, ఆ కోతి నిన్నేమైనా అందా? మనదైనా, కోతిదైనా, ఒకే బాధ కదరా. రక్తం కారుతూ, ఆ కోతి ఎంత బాధపడుతుందో తెలుసా? పెద్దలు అహింసా మార్గాన్ని పాటించమన్నారు" అని చెప్పి, తన గురువు సాయంతో, ఆ బుల్లి కోతి పిల్లని పశువుల ఆసుపత్రికి తీసుకెళతాడు. అక్కడి కాంపౌండర్, "పిల్లలూ, ఎవరైనా కోతిని ఆసుపత్రికి తీసుకు వస్తారా, కోతికి చికిత్స అవసరమా" అంటే,

'సార్, కోతిని పూర్వం వీధుల్లో ఆడించి డబ్బు సంపాదించేవారు. కోతి అంటే హనుమంతుడంటారు. మనిషి పూర్వ రూపం కోతే కదా. కోతి కూడా మనలాంటి జీవే కదా" అంటాడు. ఇంత మానవత్వాన్ని దాచుకున్న ఈ కథ, కథ కాదు నిజమంటే, నిజంగా ఆ బడిపిల్లలు తమ గురువు సాయంతో, ఒక కోతిని రక్షించారంటే, బహుశా అందరూ ఆశ్చర్యపోతారేమో.

ఈ కథను వ్రాసింది "పాశికంటి సాయినాథ్' అనే విద్యార్థి. మనసుని తాకే ఇలాంటి చక్కని కథలెన్నో, ముస్తాబాద్ బడిపిల్లలు వ్రాసిన 'జాంపండ్లు" అనే కథా సంపుటిలో. ఇంత చక్కని కథలు ఉండబట్టేనేమో, ఆ "జాంపండ్లు" ఎప్పుడు రుచి చూసినా, తియ్యగానే ఉంటాయి.

* * *

పిల్లలకి తల్లిదండ్రుల తరువాత, గురువులే దైవాలు. గురువుల పట్ల విద్యార్థులకి ఉండే గౌరవం, భక్తి, అంతా ఇంతా కాదు. ఆ గౌరవాన్ని తమ అక్షరాల్లో దాచుకున్న విద్యార్థులెందరో.

"చదువులు నేర్పి / మంచి బుద్ధులు చెప్పి / మా తప్పులు సరిదిద్ది / క్రమశిక్షణ నేర్పించి / భావి భారత పౌరులుగా తీర్చిదిద్ది / మాకు మార్గదర్శకులుగా నిలిచే / గురువులకు కోటి వందనం" అంటాడు.

"గురువుకి వందనం" అనే కవితలో, ఆరవ తరగతి చదివే 'పి.తరుణ్ కుమార్' అనే విద్యార్థి.

అనంతపురం జిల్లాలోని రాయదుర్గం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు వ్రాసిన, ఇటువంటి ఎన్నో కవితల సమాహారంగా వచ్చిన 'చినుకుల తోట" అనే పుస్తకం, పిల్లల అద్భుతమైన ఆలోచనలకు నిలువెత్తు ప్రతిబింబం.

అయితే, నిత్యం గురువులనే అనుసరిస్తూ, వారి అడుగుజాడల్లో నడవాలనుకునే పిల్లలు, వారి బాధల్ని, వారి తప్పుల్ని కూడా అంతే క్షుణ్ణంగా గమనిస్తుంటారు.

అలా, బాధలో ఉన్న తమ గురువుకి తమ వంతు సహకారం అందించి, దానినే గురుదక్షిణగా స్వీకరించమని గురువుని బ్రతిమాలిన విద్యార్థుల కథ 'గురుదక్షిణ'. ఈ కథను చదివిన వారెవరికైనా, కళ్ళల్లో కన్నీళ్ళు, పెదవిపై చిరునవ్వు, మనసులో సంతోషం, ఏకకాలంలో కలుగుతాయనడంలో సందేహం లేదు. ఇంత మంచి కథ వ్రాశాడు, కర్నూలు జిల్లా, ఉప్పర్లపల్లె గ్రామానికి చెందిన ఎనిమిదవ తరగతి చదివే విద్యార్థి, "పుల్లా మురళీ ఆకాశ్" . ఆకాశ్, ఇటువంటి పదహారు కథలను వ్రాశాడు. వాటన్నింటిని కలిపి 'ప్రేరణ' అనే పుస్తకం రూపంలోకి తీసుకు వచ్చాడు. పేరుకి తగ్గట్టు, ఇందులోని చాలా కథలు, చదివిన వారికి ప్రేరణ కలిగిస్తాయి.

ఇక, గురువు ఎలా ఉండకూడదనే విషయాన్ని "సోమరి ఉపాధ్యాయుడు - కొయ్య బొమ్మలు" అనే కథలో చక్కగా చెప్పారు. జహీరాబాద్ శాంతినికేతన్ విద్యాలయంలో ఏడవ (7) తరగతి చదివే "టి. మౌనిక" మరియు థైబడ్స్ స్కూల్‌లో రెండవ తరగతి చదివే "కె. ప్రకాష్" అనే విద్యార్థులు. ఈ కథ "జహీరాబాద్ పిల్లల కథలు" పుస్తకంలో దర్శనమిస్తుంది. ఇదే పుస్తకంలో, రెండవ (2) తరగతి చదువుతున్న "కె. ప్రకాశ్" అనే విద్యార్థి వ్రాసిన మరో కథ, "కిట్టు -రాము - పువ్వులు" కూడా చాలా బాగుంటుంది. ఈ పుస్తకంలో కథలు వ్రాసిన పిల్లల్లో చాలా మంది, 2,5,6,7 తరగతులు చదువుతున్నవారే.

* * *

మనం "పిల్లలకి ఏం తెలుసు" అనుకుంటూ ఉంటాం. వారి ఆలోచనాశక్తిని తక్కువ అంచనా వేస్తుంటాం. కానీ పిల్లలు అన్నీ గమనిస్తుంటారు. గమనించి ఊరుకోరు. గమనాల్ని నిర్దేశిస్తారు. ఈ సమాజాన్ని 'మంచి' అనే గమ్యానికి చేర్చడానికి వారి వంతు ప్రయత్నం వారు చేస్తున్నారు.

మన దేశంలో కుల, మత వివక్షత ఉందన్నది పూర్తిగా అసత్యం కాదు. అది చూసి చలించి,

"ఏమైందీ దేశానికి,/ ఒక వైపు కులం! మరో వైపు మతం
ఎవ్వరూ నోరు మెదపరేంటి" అని ప్రశ్నిస్తూనే,
"బహిరంగంగా చెప్పండి / కుల, మత వివక్షతను చూపొద్దని!!
ఈ వివక్షతకు చెల్లించాలి భారీ మూల్యం" అంటాడు, పదవ తరగతి చదివే జె.రాజేష్' తన 'భారీ మూల్యం' అనే కవితలో.

"ముదిగొండ ముత్యాలు" అను కవితా సంకలనంలో ఇటువంటి మంచి ముత్యాలెన్నో.

వివక్ష అనేది ఈ ఒక్క విషయంలోనే కాదు, మరో విషయంలో కూడా వుంది. అవును, మీరు అనుకుంటున్నది నిజమే. ఈ లోకంలో మహిళలు, ఎంతో కొంత వివక్షను ఎదుర్కొంటున్నారనేది ఎవరూ కాదనలేని సత్యం. అయితే, ఆ సత్యాన్ని అసత్యంగా మార్చేందుకు ఈ తరం నడుం బిగిస్తోంది. ఆడ పిల్లపై జరిగే అన్యాయాన్ని ప్రశ్నిస్తోంది.

అక్షర దివిటీలతో, ఆడవాళ్ళ చుట్టూ అలుముకున్న అంధకారాన్ని తరిమివేయడానికి వస్తోంది. ఈ అవనిపై ఆడపిల్లను వెలిగించేందుకు, ఆమెలో వెలుగులు నింపేందుకు అడుగు ముందుకు వేస్తోంది. దానికి సాక్ష్యమే ఈ అక్షరాలు.

"ఆడపిల్ల పొందు అన్యాయ రీతిపై / గొంతు విప్పు నీవు కుమిలిపోకు / ఆడపిల్ల కదిలి అవనిపై వెలగాలి / చిట్టి మనసులోని చిన్నమాట"

ఆడపిల్లను, తనకు జరుగుతున్న అన్యాయంపై గొంతు విప్పమని చెబుతున్న ఈ పద్యం, "చిట్టి మనసులు" అనే సమష్టి శతకం లోనిది. ఈ పుస్తకంలో ఇటువంటి గొప్ప పద్యాలెన్నో. ఈ శతకాన్ని, శ్రీకాకుళం జిల్లా, నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదివే విద్యార్థులు వ్రాశారు.

ఇక మరో పద్యం...

"అమ్మ, అక్క, చెల్లి అర్ధాంగి కావలె / కూతురొద్దనంటు కుట్ర చేస్తే / ఇంతి లేకయున్న ఇలన నరుడులేడు / ఇలనిదానపురపు వెలుగుబాట"

ఈ ఆట వెలది పద్యం, కూతురు వద్దనుకునే వారికి ఒక గట్టి చురక. ఈ పద్యాన్ని, ఖమ్మం జిల్లా, నిదానపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న "షేక్ షమీమున్" అనే విద్యార్థిని వ్రాసింది. "వెలుగుబాట" పేరుతో వచ్చిన ఈ బాలకవుల పద్య సంకలనంలో, ఇలాంటి వెలుగులీనే పద్యాలెన్నో.

* * *

మన సమాజంలో ప్రతీనిత్యం ఏవో ఘటనలు జరుగుతూనే ఉంటాయి. అయితే వాటిని చూసి, పిల్లలు ప్రతిస్పందించే తీరు ఒక్కోసారి ఆశ్చర్యానికి గురి చేస్తూ ఉంటుంది. బాల్య వివాహాలు జరగడం చూసి,

"బ్యాగులు మోయాల్సిన వయసులో / గుండెలపై మంగళ సూత్రాలేంటి? / పుస్తకాలు మోయాల్సిన చేతుల్లో / పిల్లల్ని పెడుతున్నారెందుకు? / పన్నెండేళ్ళు కూడా నిండని / మా పొట్టల్లో పిండం ఏర్పడటం ఏంటి? / ముల్లు గుచ్చుకుంటేనే ఏడ్చే బాలికలకు / ఈ పురిటి నొప్పులు ఏంటి?" అని ప్రశ్నించింది.

"ఏం చేశాం మిమ్మల్ని" అనే కవితలో, నెల్లూరు జిల్లా, దామ నెల్లూరుకి చెందిన తొమ్మిదవ తరగతి...విద్యార్థిని "అర్చన".

చిన్నారి 'ఆసిఫా'కి జరిగిన అన్యాయం గురించి మనకు తెలియంది కాదు. భారతదేశం మొత్తం బాధపడిన సంఘటన అది. ఆ చిన్నారికి జరిగిన అన్యాయం గురించి విని,

"మానవత్వం మాయమైందా ఏమిటి?" అంటూ ఆవేదనను వెలిబుచ్చుతూనే,

"పసిదాన్ని రక్షించలేని / దేవుడికి దండం పెడదామా!
పూజలు చేద్దామా?" అని ప్రశ్నించింది, తను వ్రాసిన "దేవుడు ఉన్నట్టేనా?" అనే కవితలో. "నీటి పూల వాన" గా కురిసిన "అర్చన" కవిత్వం, ఎన్నో వాస్తవ సంఘటనలకు నిలువుటద్దం.

* * *

పుట్టిన ఊరంటే ప్రేమ లేనిదెవరికి! మన ఊరిని తలుచుకుంటే చాలు, ఆనందంతో ఒళ్ళు పులకరిస్తుంది. పట్నంలో బ్రతికే వారికి, ఒక్కసారైనా తమ ఊరికి వెళ్ళి రావాలనిపిస్తుంది. పిల్లలకైతే మరీనూ, అదే భావనను "మా ఊరు వెళ్ళి రావాలి" అనే కవితలో దాచుకున్నాడు విజయనగరం, నెల్లిమర్లకు చెందిన, ఎనిమిదవ తరగతి విద్యార్థి, 'కె.గౌతమ్'. ఆ కవితలో –,

"మా ఊరు వెళ్ళి రావాలి...
....చెట్లకు నా చిన్ననాటి జ్ఞాపకాలు చెప్పి కలిసి రావాలి..."
"...వచ్చేస్తూ వచ్చేస్తూ
నా జ్ఞాపకాలను బుట్టలలో తట్టలలో
వేసుకుని రావాలి
నేను ఎక్కిన చెట్టు చిటారుకొమ్మని
నా కళ్ళల్లో పెట్టుకుని
తీసుకురావాలి" అంటాడు.

ఇటువంటి ఎన్నో భావనలను దాచుకున్నారు ఆ పసివారు "స్వప్న సాధకులు" అనే కవితా సంపుటిలో.

ఇక, చేర్యాలలోని కొత్త దొమ్మాట ప్రాథమికోన్నత పాఠశాలకి చెందిన "చందన", తను వ్రాసిన 'బతుకమ్మ పాట'లో,

"దొమ్మాట మా ఊరు ఉయ్యాలో....
'దో' మాటలుండవు ఉయ్యాలో...
గొప్పనై న ఊరు ఉయ్యాలో...
సోమ సముద్రమన్నది ఉయ్యాలో....
రైతుల కళ్ళల్లో ఉయ్యాలో...
రాజువోలే వెలుగులు ఉయ్యాలో..."అంటూ, తన ఊరి గురించి ఆనందంగా చెబుతుంది.

మరి, ఊరంటే అన్నీ అందాలు, అందమైన జ్ఞాపకాలేనా అంటే – కాదు అంటూ, ఊరిలోని వలస జీవి వెతలను కనులకు కట్టినట్లు చెప్పింది, కొండాపూర్‌కి చెందిన పదవ తరగతి విద్యార్థిని 'యం. అఖిల'.

"కూలి కోసం గల్ఫ్ వెళితే
ఏజెంట్ నిన్ను నిండముంచె ఓ వలస జీవి
కుటుంబ బరువు మోయలేక
ఆత్మహత్యలే చేసుకుంటివా ఓ వలస జీవి" అంటూ,

వలస జీవి కష్టాలను, కన్నీళ్లను, దయనీయ స్థితిని తన కవిత ద్వారా లోకానికి చెప్పింది. కనులను తడి చేసే ఇటువంటి కవితలెన్నో, "కవితల సింగడి" అను బడిపిల్లల కవితా సంకలనంలో.

వలస జీవుల గురించే కాదు, రైతుల గురించీ ఈ పిల్లలకి బాగా తెలుసు. రైతుల పట్ల వారికున్న గౌరవం ఎంతో, వారు వ్రాసిన అక్షరాలే చెబుతాయి.

"పగలు, రేయి యనక పట్టుగా జేయును
నష్టమైన గాని కష్టపడును
రైతుతోనె బ్రతుకు రాజ్యంబు ప్రజలకు
వినుము రేణ మాట విలువ నెరుగు!"

రైతు గొప్పదనాన్ని ఎంత చక్కగా చెప్పిందో కదా, ఈ పద్యం. మరి ఇంత చక్కని పద్యాన్ని చెప్పిందెవరంటే, సిద్ధిపేటకు చెందిన "యస్.రేణ" అనే విద్యార్థిని. ఆమె వ్రాసిన ఆటవెలది పద్యాల్లో రైతుల గురించి ఎంతో గొప్పగా చెప్పింది.

* * *

ఇవే కాదు, సాంఘిక దురాచారాల నిర్మూలనకోసం తమ కలాల గళాల్ని ఎత్తారు ఈ రేపటి పౌరులు.

"వరకట్నం తీసుకోవడం, ఇవ్వడం నేరం" అని "వరకట్న నిర్మూలన" అనే కథలో ఖచ్చితంగా చెప్పింది, కర్నూలు జిల్లా పెరవలికి చెందిన

తొమ్మిదవ తరగతి విద్యార్థిని "టి. దీపిక"."ఆడపిల్ల చదువు" అనే కథ ద్వారా, ఆడపిల్లకు చదువెంత ముఖ్యమో అందరికీ అర్థమయ్యేటట్లు చెప్పింది. ఏడవ తరగతి విద్యార్థిని "పి. రశీద".

పెరవలి ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న బాలికలు వ్రాసిన కథల సంపుటి "జాగృతి" మరియు "సృజన'లో కొలువైన చక్కని కథలివి.

ఈ పిల్లలు ఇక్కడితో ఆగిపోలేదు. సమాజానికి తన చుట్టూ జరుగుతున్న పరిస్థితులను వివరించడానికి కలం కదిలించారు.

బాలలందరికీ చదువుకునే హక్కు వుంది. కానీ, అందరి బాల్యం అందంగా ఉండదు. కొందరి బాల్యం కన్నీటి భరితం. మరి ఏ పసివాడి కళ్ళల్లో కన్నీళ్లు చూశాడో కానీ, ఈ పిల్లవాడు ఈ కవిత వ్రాశాడు.

"చెత్త కాగితాల్లో బాల్యాన్ని ఏరుకుంటున్న వాణ్ణి / బస్సులో సగం సీటు తీసుకునేవాణ్ణి / అరచోటు సీటు కూడా లేనివాణ్ణి / 'ఏ పిల్లగా లెవ్వు' అంటే,/ కళ్ళల్లో నీళ్ళు తిరగగా నిలబడే వాణ్ణి / ఇక నిజం కాదు కదా కలలో కూడా పలకా, బలపం, బడి వస్తే ఒట్టు" అని వ్రాశాడు.

"బాలలం – భారతీయులం" అను కవితలో "గరిపెల్లి నవీన్ కుమార్" అనే విద్యార్థి. అయితే, తను ఈ ఒక్క కవితతోనే ఆగిపోలేదు. తన మనోభావాలని "మొలక" రూపంలో ప్రపంచం ముందుంచాడు.

* * *

సమాజాన్ని ప్రశ్నిస్తూ కూర్చుంటే మార్పు రాదు. 'మరి ఏం చేయాలి?' అంటే, చైతన్య పరచాలి" అంటారు ఈ పిల్లలు. అంతేకాదు, సమాజాన్ని చైతన్య పరిచే దిశగా అడుగులు వేస్తున్నారు. సమాజానికి తన బాధ్యతను గుర్తు చేస్తున్నారు. అందులో భాగంగా ఒకరు ఎన్నికల గురించి చెబితే, మరొకరు సెల్ఫీల వల్ల జరుగుతున్న నష్టం గురించి చెబుతారు. ఓటు నుండి నోటు వరకు, అన్ని విషయాల గురించి నిర్భయంగా మాట్లాడతారు.

"ఓటంటే అవినీతిని గద్దెదించే ఆయుధం / ఓటంటే అధికారపు ఆయువు పట్టు / ఓటంటే మనందరి బంగారు భవిష్యత్తు" అంటూ, ఓటు గొప్పదనాన్ని మూడే మూడు వాక్యాల్లో చెప్పింది, రాజన్న సిరిసిల్లా జిల్లా గర్జనపల్లికి చెందిన ఎనిమిదవ తరగతి విద్యార్థిని "పసుల క్షేమ'. ఇటువంటి సూటైన కవితలెన్నో, "మిణుగురు పూలు" కవితా సంకలనంలో.

ఇక, వరంగల్ జిల్లా రాయినిగూడెం, ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చదివే, 'కుంజ ఉదయ్ కిరణ్" అనే విద్యార్థి,

"మహిళలపై జరిగే అక్రమాలకు బాధ్యులెవ్వరు
కూడు – గూడు – గుడ్డ లేనట్టి స్థితికి కారకులెవ్వరు
పెరిగే తీవ్రవాదానికి – జరిగే రైతు ఆత్మహత్యలకు
కారణమేమిటి – కారకులెవ్వరు – బాధ్యులు ఎవ్వరు!"

అని ప్రశ్నిస్తాడు, "మానవత" అనే కవితలో. "గిరిజన బాలల కవితా కౌముది" అనే కవితా సంకలనంలో కొలువైన చక్కటి కవితల్లో ఇటువంటివనేకం.

* * *

కేవలం కవితలు, కథలు, పద్యాలే కాదు, గేయాలు, పేరడీ పాటలు, లేఖలు, హైకూలు కూడా వ్రాశారీ భాషా వారసులు.

"వసంత కాలం వచ్చేస్తోంది / మనమూ చిగురిస్తాం అను కుంటున్నాయి/ ఎండిన చెట్లు" అని పదవ తరగతి చదివే "ఈ. స్వప్న" అంటే,

"చెరువు ఇసుకలో / నాకు దొరికిన వజ్రం / శంఖం!" అంటాడు, తొమ్మిదవ తరగతి చదివే "కే. భూమన్న".

ఇటువంటి హైకూలెన్నో మెరుస్తాయి "చుక్కలు" అనే పుస్తకంలో. బడిపిల్లలు వ్రాసిన హైకూలతో వచ్చిన మొదటి పుస్తకం బహుశా ఇదే కావొచ్చు.

* * *

ఇలాంటి ఎన్నో రచనా ప్రక్రియల్లో...రచనలు చేస్తూ, భాషకు వన్నె తెస్తున్న ఈ బడిపిల్లలు, రేపటి భాషా వారసులు కాక మరేమిటి? వీరు ప్రేమించింది తెలుగుని, పూజిస్తుంది తెలుగుని, ఇంకా, 'మన భాషకి మంచి రోజులు రాలేదు' అంటే అది అవివేకం కాక మరేమిటి?

వీరు తెలుగుకి ఇంత విలువిచ్చారు కనుకనే, తమ భావాలను ఈ భాషలోనే వ్యక్తపరిచారు. వీరు మాతృభాషను మధురభాష అనుకున్నారు. అందుకే,

"పవిత్రమైన మధుర భాష / తియ్యనైన కోకిల భాష
ఎల్ల వారలను కలిపే భాష / అదే మన తెలుగు భాష" అంటూ

ఆనందంగా పాడుతున్నారు.

యాదాద్రి జిల్లా పాటిమట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న "పెద్దబోయిన శ్రావణి" అనే విద్యార్థిని వ్రాసిన ఈ కవితకు 'పాటిమట్ల పాలపిట్ట'యి రాగం కలిపింది. భాషా కోవెలలో వెలుగుతున్న ఈ బాల దివ్వెలను చూసి అక్షరం ఆనందంగా నవ్వింది.

వీరే కాదు, ఇరు రాష్ట్రాల బడి పిల్లలు వ్రాసిన పుస్తకాలు వందకు పైగా ఉన్నాయి. వారందరినీ పేరు పేరునా అభినందిస్తూ, వారి సృజనకు నమస్కరిస్తున్నాను. ఈ బాల దివ్వెలు పంచే వెలుగులు ఈ ప్రపంచంలోని ప్రతీ మూలకూ చేరాలని, ఈ లోకం ఆ వెలుగుల్ని జాగ్రత్తగా కాయాలని ఆశిస్తూ, ఆకాంక్షిస్తూ, పిల్లలందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్నాను.

ఈ వ్యాసం వ్రాయడానికి నన్ను ప్రేరేపించి, దీనికి సంబంధించిన ప్రతీ వివరాన్ని, శ్రమ అనుకోకుండా, ఆనందంగా అందించి, నాఆలోచన అక్షర రూపం దాల్చడానికి కారణమైన శ్రీ గరిపెల్లి అశోక్‌గారికి నా హృదయ పూర్వక కృతజ్ఞతలు. అడిగిన వెంటనే స్పందించి, నా ఈ రచనకు సంతోషంగా సహకరించిన డా॥ వి.ఆర్.శర్మగారికి ధన్యవాదాలు.

ఈ పసివారిని, పనికట్టుకుని, పదాల పథాల వెంట నడిపించిన
పసిడి చేతులకు,
ఈ బంగారు 'బాల' దివ్వెలను ప్రేమతో వెలిగించిన
దివ్య మూర్తులకు,
చిన్నారి చేతులకి కలాల హలాలనిచ్చి, అక్షరసేద్యం చేయిస్తున్న
జ్ఞానదీప్తులకు,
విద్యార్థుల వికాసంలోనే తమ విజయముందని నమ్మి, వారిని
నడిపిస్తున్న నవ సాందీపనిలకు
వందనం
మీ ప్రోత్సాహమే ఆ చిరుకలాల్లో సిరా ఐ ప్రవహిస్తోంది!
మీ చేయూతే ఆ చిన్నారులని అక్షర బాటన నడిపిస్తోంది!
భాషకి, బాల్యానికి ఎనలేని సేవ చేస్తున్న మీకు
నిండు మనసుతో జోహార్లు!!

(3వ అట్టపై కూడా చూడండి...)

డా॥ పి. శివరామకృష్ణ'శక్తి'
9441427977

# గిరిజన సంస్కృతీ వాచకం-సమాంతర జ్ఞానపరంపర

*చదువులోని ప్రాథమిక దశలోనే శాస్త్రవిజ్ఞానంలోని ప్రాథమిక భవనాలుంటాయి. విద్యార్థి క్లాస్ రూం బయట మాతృభాషలో కలిగే శాస్త్ర విజ్ఞాన అనుభవాలకు, క్లాస్ రూంలో భావనలకు పరాయి భాషలో చెప్పే విజ్ఞాన భావనలకు పొంతన అందక, సమన్వయం కుదరక అతని అవగాహన విస్తృతం కాదు. శాస్త్రం మీదే కాక చదువు మీద కూడా ఆసక్తి సన్నగిల్లుతుంది– ప్రసిద్ధ విద్యావేత్త డి. యస్. కొఠారి. (తెలుగులో శాస్త్రపరిభాష ... తెలుగు అకాడమి )*

'Literacy instruction builds upon the cultural and linguistic back grounds; ways of making meaning and prior knowledge that all children bring to the class room'

చిరకాలంగా ఇదే ధోరణిలో ఉచిత సలహాలివ్వడం జరుగుతున్నది. కానీ మాతృభాషలో శాస్త్ర విజ్ఞాన అనుభవాలలో ఒక వాచకాన్ని తయారు చెయ్యలేదు. గత రెండు దశాబ్దాలుగా ఈ సంప్రదాయ నైపుణ్యాలకు, వారి మనుగడకు అవసరమైన జీవ వైవిధ్య వనరులమీద స్థానికప్రజలకు హక్కులిస్తూ ప్రభుత్వాలు చట్టాలు చేస్తున్నాయి.

శ్రీకాకుళం జిల్లాలో బీల – తంపర (ఊట) భూములలో థర్మల్ ఫాక్టరీ నిర్మాణం తగదని జీవవైవిధ్య చట్టం రక్షించటానికి ఏర్పడిన జాతీయ హరిత ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చింది. జనం లో తరతరాలుగా పాతుకుపోయిన ఈ నుడికారం ఉద్యమాన్ని ప్రజలలోకి తీసుకు పోవడంలో కీలక పాత్ర పోషించింది. పంచాయతుల ద్వారా ఇటువంటి వనరులను గుర్తించనందుకు ట్రిబ్యునల్ తప్పు పట్టింది. అటువంటి గుర్తింపు, ఆ భూసేకరణ ప్రతిపాదనలకు బహిరంగ చర్చ(పబ్లిక్ హియరింగ్) తప్పనిసరి అని స్పష్టం చేసింది.

భూసేకరణ ఆపుచేయడం సరే, అవనరులను 'సుస్థిర అభివృద్ధి' కోసం తరతరాలుగా ఎలావాడుకుంటున్నారో తెలియచేసే నుడికారాన్ని సేకరించి వాటి గుర్తింపును బలోపేతం చేస్తూ పర్యావరణ హితానికి, జానపద విజ్ఞాన వేత్తలు, సామాజిక స్పృహతో పండిపోయిన మేధావులు, రచయితలు ప్రయత్నం చేయాలి. పాశ్చాత్య విజ్ఞానానికి సమాంతరంగా జానపద విజ్ఞానాన్ని నిలబెట్టాలి. లేకపోతే అభివృద్ధికి బదులు సుస్థిర అభివృద్ధి, హరిత విప్లవానికి బదులు సతత హరిత విప్లవం అనే దిద్దుబాటు చర్యలుకూడా పాశ్చాత్యులు నిర్దేశించిన బాటలోనే అమలౌతుంటాయి.

ప్రజలు భూసేకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్నంతగా, జీవవైవిధ్యం గల ఉమ్మడి వనరుల గుర్తింపు కోసం ప్రయత్నించడం లేదు. తగిన వివరాలతో దరఖాస్తునింపి అధికారులకిచ్చి పని అయ్యేదాకా పట్టు పట్టటం లేదు. ఎవడు తిరుగుతాడు! గుర్తింపు ఉంటె మాత్రం ప్రభుత్వం ఏదో తొండి ఆట ఆడి లాక్కోకుండా ఉంటుందా అంటూ ముందరికాళ్ళకు తామే బంధం వేసుకుంటూ గుద్దులాడుకుంటారు. ఇప్పటిదాకా సహజ వనరుల మీద పెత్తనం చలాయించిన అధికారులు, ప్రభుత్వం తమ పట్టు వదులుకోరు. తూ తూ మంత్రంగా ఈ ఇటువంటి చట్టాలను అమలు జరిపి చేతులుదులుపుకుంటారు. ప్రభుత్వం అమలు చేయటం లేదు, రాజ్యస్వభావం ఇంతేనంటూ జానపద విజ్ఞాన వేత్తలుకూడా ఖండనపర్వం రక్తి కట్టిస్తూ చప్పట్లు కొట్టించుకుంటున్నారే కాని, బళ్ళో పాఠాలదగ్గరనుంచి, చట్టాల అమలువరకు తాము నిర్వహించ వలసిన పాత్రగూర్చి సమీక్షించుకోడం లేదు.

బీల తంపరలలాగే అటవీ హక్కులగుర్తింపులో చేవడి బస, మగనాలిమెట్ట వంటి గిరిజన సంస్కృతిలో కీలకమైన వాడుకలను ప్రభుత్వం పట్టాదార్ పాస్ పుస్తకాలమీద ముద్రించింది. అటువంటి పదసంపద సేకరించి సర్క్యులర్లు జారీచేసింది. మన బడులలో చెప్పే పాశ్చాత్య జ్ఞానానికి సమాంతరంగా, గిరిజనుల అటవీ విజ్ఞానాన్ని, జాలరుల సంప్రదాయ సరిహద్దుల పటాలను, వారు రాసుకున్న సాహిత్యాన్ని ప్రచురించి నడుస్తున్న చరిత్ర, అమ్మనుడి పత్రికలు బతుకు తెరువులు పట్టించుకోకుండా భాషను బతికించుకోలేం' అనే పిలుపునిచ్చి యధాశక్తి తోడుపడుతున్నాయి. చట్టాలలోపేర్కొన్న మాత్రాన సరిపోదు, బడిలో కూడ ప్రత్యక్షంగానో పరోక్షంగానో మొత్తం మీద ప్రభుత్వ ముద్ర ఉంటేనేగాని ఉపాధ్యాయుల దృష్టి పెట్టడం సాధ్యం కాదు.

ఆ గిరిజనుల జ్ఞానాన్ని సార్వత్రిక విద్యలో భాగంగా చేసే ప్రయత్నంలో, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలెజి కి అనుబంధంగా ఉన్న సెంటర్ ఫర్ పబ్లిక్ ఇన్నోవేషన్స్, 'శక్తి' తయారు చేసిన ఈ వాచకాన్ని ప్రధానో పాధ్యాయులకు కరదీపికగా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖకు అందచేసింది. ఈ వాచకం మూడవ తరగతి నుండి పదోతరగతి వరకు సామాన్య శాస్త్రం, సాంఘిక శాస్త్రంతో పాటు ఆయా అంశాలను ఎలా కలుపుకుని చెప్పాలో 'ప్రకృతి, సంస్కృతి' జీవ వైవిధ్యం అధ్యాయాన్ని సామాన్య శాస్త్రం, జీవ భౌతిక శాస్త్రాలతో, గిరిజన ఆర్థిక వ్యవస్థ అధ్యాయాన్ని సాంఘిక శాస్త్రంలోని అర్థశాస్త్రంతో, గిరిజన సమాజం, గిరిజనప్రాంతాల చరిత్ర, పౌరశాస్త్రాలతో కలుపుకుంటూ చెప్పాలని వివరించింది, మరిన్ని వివరాలు గిరిజన పెద్దలనడిగి తెలుసు కోవలసినదిగా కోరుతూ, వారిలో ఆట పాటలలో అందెవేసిన వారిని బడికి పిలిచి కథలు చెప్పించడం, నేర్పించడం, వారితో అడవిలో తిరిగి పిట్టలు పురుగులు, చెట్టు పుట్టలు, జంతువులు కాపురంచేసే మట్టలు, డొంకలు, పొదలు, పిల్లలకు చూపించ వలసిందిగా ఇటువంటి కృషి గ్రామాన్ని బడికి దగ్గరచేస్తుందని నొక్కి చెపుతుంది.




ఇందులో 'ఈ పుస్తకం ఎందుకు', 1. గిరిజన ప్రాంతాల్లో ప్రకృతి, సంస్కృతి, జీవ వైవిధ్యం 2. గిరిజన సమాజం 3. గిరిజన ఆర్థిక వ్యవస్థ 4. గిరిజన ప్రాంతాల చరిత్ర పాలన 5. ప్రధానోపాధ్యాయులకు సూచనలు,

గిరిజన సంస్కృతిని గూర్చి ఇంకా తెలుసుకోవాలనుకుంటే అనుబంధం' చదవలసిన పుస్తకాల జాబితా...పేరుపొందిన ఉదాహరణలతో... పాఠ్యక్రమాన్ని విషయసూచిక తెలియ చేస్తుంది.

ప్రతి అధ్యాయం రెండు భాగాలుగా, ఉత్తరాది తూర్పు కనుమలు అంటే అత్యధిక వర్షపాతంపొందే శ్రీకాకుళం నుండి పశ్చిమ గోదావరి వరకు వేణం, లొద్ది, లంక, లోయలు బయళ్ళతో నిండిన మన్యంఅడవి దున్నలకు ఆశ్రయం. పోడు వ్యవసాయం ఇక్కడి తెగలకు ప్రధాన జీవనాధారం. తక్కువ వర్ష పాతంగల రాతినేలలతో నిండిన దక్షిణాది కనుమలు అంటే రాయలసీమలోసరి, సెల, కురవ, కట్టువ, సరవ, బరకలలో గడ్డిమైదానాలలు పులులు, వాటి బారిన పడే శాకాహార జంతువులు, ఆహారం సేకరించుకుంటూ పశువులు కాచుకునే జాతులతో నిండిన నల్లమల ఎర్రమల వెలిగొండ పాలకొండ, శేషాచలంలో విశేషాలను తెలుగు గిరిజనుల నుడికారంలో వివరిస్తుంది. నెలలు పండుగలు ప్రణాళికలు, సంప్రదాయక పంచాయతీ వ్యవస్థ, పర్యాటక చారిత్రక ప్రదేశాలు పట్టికగా, తూర్పుకనుమలు,గ్రామసరిహద్దుల తీరును పటాలు గా ఇస్తుంది.

ప్రసిద్ధ వ్యక్తులు, గిడుగు, విక్రమదేవవర్మ, అల్లూరి సీతారామ రాజు, వెన్నెలకంటి రాఘవయ్య, హైమెండర్ఫ్, స్వామి బాలానంద వగైరా జీవితాలను పరిచయం చేస్తుంది.

జ్ఞానాన్ని గూర్చి శాస్త్రవేత్తలకు, కళాకారులకు ఎవరి అభిప్రాయాలు వారికున్నాయి. వాటిని సమన్వయిస్తూ', జాతిలో తరతరాలుగా వచ్చేది జ్ఞానం, దానిని గుర్తించటం అభిజ్ఞానం. దాన్ని రసాత్మకంగా చెపితే కావ్యం. జానపదుడి, గిరిజనుడి జ్ఞానపంథా ఒక కావ్యం. నేటి మానవశాస్త్రం వలెనే మన సాంఖ్యదర్శనం పకృతి పురుషుల మధ్య వర్ధిల్లే జ్ఞాన స్వరూపాన్ని విస్తృతంగా చర్చించింది...ప్రజలు వేళలు, ఋతువులు చెపుతుంటే శాస్త్రవేత్తలు గడియలు, కార్తెలు గంటలలో తెలియజేస్తారు. ప్రజలు స్థలాల పేర్లు చెపుతుంటే శాస్త్రజ్ఞులు అక్షాంశాలు,రేఖాంశాలు అంటూ అంటూ ఒక ఉహాజనిత పరిభాషలో ప్రపంచానికి తెలియ చేస్తారు. సంస్కృతి కూడా ఆయావనరులకు అధిదేవతలను గుర్తించి భయభక్తులతో నడుచుకుంటుంది. వాటిచుట్టూ కర్మకాండ, సాహిత్యం అల్లుకునే తీరుతెన్నులు సూత్రీకరిస్తే ప్రపంచమంతా ఒక్కతీరుగనే ఉంటాయి... శిలాజం లక్షల ఏండ్ల పరిణామాలను నిక్షిప్తం చేసుకున్నట్లే పురాగాథ చరిత్రను పొదువుకుంటుంది. కర్మకాండ ఆ చరిత్రను అభినయించే దృశ్య రూపకంగా సాంస్కృతిక మానవశాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు...మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే గిరిజన ప్రాంతాలు ఎంతో జీవవైవిధ్యం కలిగి ఉంటాయి.ఇతరవిద్యార్థులతో పోలిస్తే గిరిజన పిల్లలలో పరిసరజ్ఞానం అంటే చెట్లు, జంతువులు, పిట్టలు, భూగోళం, రుతువుల జ్ఞానం, విల్లమ్ములు, వలలు, వాద్యపరికరాలు, సాధనాలను వాడే, ఆట పాటలలో సామర్థ్యం అధికంగానే ఉంటాయి...సంప్రదాయంలో ఇమిడిఉన్న శాస్త్ర విజ్ఞానం తెలుసుకోడంవల్ల మన ఆలోచనల అధ్యయన విధానాల పరిధి విస్తరిస్తుంది. సమాజంలో అందరికీ తెలిసిన కథలు, ఆటపాటలతో నిండిన సంప్రదాయ జ్ఞానాన్ని కలుపుకుంటూ చేసే బోధన ఉత్సాహంగా ఉల్లాసంగా సాగుతుంది. సమాజం పాఠశాలల మధ్య సంబంధాలు బలపడతాయి. గిరిజనులలో న్యూనతభావాన్ని తగ్గించి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది...చట్టాల అమలుకు తగిన చైతన్యం పెరుగుతుంది. గిరిజనులను అధ్యయనం చేసే మానవ శాస్త్ర వేత్తలకు సాహిత్యరూపంలోగల సంప్రదాయ జ్ఞానం పై అవగాహన ఉండదు. భాషాశాస్త్రవేత్తలకు మానవ శాస్త్ర దృష్టి తక్కువ. ఈ ఇరువురికి శాసన కార్య నిర్వాహక వర్గాలతో పరిచయం ఉండదు. ఈ మూడు విభాగాలలో జరుగుతున్న కృషిపట్ల అవగాహన పెంచుకునే అవకాశం గ్రామాలలో పనిచేసే ఉపాధ్యాయులకు ఎక్కువ. ఈ అవగాహనతో వారు ఆయా వర్గాలనుండి వచ్చే విద్యార్థులకు ఆత్మీయులౌతారు. భావిపౌరులను తయారుచేస్తారు" అని ఈ పుస్తకం ఎందుకులో స్పష్టత నిస్తారు.

ప్రభుత్వం చిరుధాన్యాల సాగు. పాలేకర్ పద్ధతిలో సాగు వంటి పాతపద్ధతులను పత్రికల ప్రామాణిక భాషలో ప్రచారం చేస్తుంది. జనం నుడికారంతో మమేకం కాలేని ఈ ప్రచారాలు జనసామాన్యంలోకి వెళ్ళడం లేదు. కాబట్టి జానపద విజ్ఞానవేత్తలు ఇటువంటి వాచకాలు తయారు చేసి వ్యవసాయ రంగంపట్ల ఆసక్తి పెంచాలి. ప్రభుత్వ పథకాలను ప్రజలు సొంతం చేసుకోవటంలో కీలక పాత్ర పోషించాలి.

కవిత

# బెత్తం

నీకు అత్యంత ప్రియమైన బోధనోపకరణం
బెత్తమే అయినపుడు -
బెత్తమే దివ్యౌషధం అయినపుడు -
హోంవర్క్ చేయాలన్నా సమయానికి బడికి రావాలన్నా
చెప్పిన మాట వినాలన్నా పద్యం అప్పజెప్పాలన్నా
చేతిలో బెత్తం ఆడుతుండాలనే
నమ్మకం నీదయినపుడు-
క్లాసంతా నీ మాట కిందకు తెచ్చుకోడానికి
బెత్తం నీ నమ్మిన బంటయినపుడు-
నువ్వునువ్వుగా కాకుండా
ఏదో అవతారమెత్తావు చూసుకో.
బడిని సక్రమంగా నడిపే పనిలో
బెత్తం మీదున్న నమ్మకం నీ మీద నీకు లేదా నేస్తం?
అయ్యో!
ఇన్నేళ్ల నీ ఉపాధ్యాయ జీవితానుభవమంతా
నువ్వు బెత్తంగా మారేందుకు ఉపయోగ పడిందా?
జాగ్రత్త తండ్రీ!
పరిణామ క్రమంలో నువ్వు
ముల్లుగర్ర గానూ, వేటకత్తి గానూ మారిపోగలవు జాగ్రత్త!

సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి
9441287865

కీ.శే. వఝల వెంకటేశ్వర్లు

# వాడుక భాష – వ్యాకరణం

విశాఖపట్టణంలో 1980 ఏప్రిల్ 26, 27లలో జరిగిన 'వాడుక భాష సదస్సు'లో సమర్పించిన పత్రాలను 'అభ్యుదయ' పత్రిక ఒక ప్రత్యేక సంచికగా ప్రచురించింది. అప్పటికి వాడుక భాషోద్యమాన్ని గిడుగురామమూర్తిగారు మొదలుపెట్టి 70 ఏళ్లయినది. ఆ సందర్భంగా ఈ సదస్సు జరిగినట్లు 'అభ్యుదయ' సంపాదకులు పేర్కొన్నారు. ఆ సదస్సు ఆహ్వాన సంఘంలో గౌరవాధ్యక్షులుగా ఎం.ఆర్.అప్పారావు, అధ్యక్షులుగా డా॥ పురిపండా అప్పలస్వామి, ప్రధాన కార్యదర్శిగా డా॥ చందు సుబ్బారావు, ఆరుగురు ఉపాధ్యక్షులు, ముగ్గురు కార్యదర్శులు, పదముగ్గురు సభ్యులుగా వ్యవహరించారు. అందరూ రచయితలుగా, ఆచార్యులుగా విద్యారంగ ప్రముఖులుగా పేరెన్నికగన్నవారే. తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ ఏర్పడబోతున్న సందర్భంగా ఈ వ్యాసాన్ని ప్రచురిస్తున్నాము. –సంపాదకుడు.

మానవుడు తన ఉపయోగం కొరకు తాను కనుగొన్న అద్భుతమైన ఉపకరణం భాష. తనలో తాను భావించుటకై మాత్రమేకాక తన భావాలను అన్యులకు తెలుపుటకై కూడ మానవునకు భాష ఉపకరిస్తుంది. భాష వల్లనే వైవిధ్యం కల బహుళార్థ సార్థకమైన సాహిత్యం ఉత్పన్నమౌతుంది. వాక్య నిర్మాణ విధానంలో ఇమిడి ఉన్న శాస్త్రమే వ్యాకరణం. సంపూర్ణ భావబోధకమైన అఖండ వాక్యమును విశ్లేషించి ఒకొక్క భాగం ఉపయోగం, వేర్వేరు భాగముల పరస్పర సంబంధం, మొదలైన విషయాలను తెలిపే శాస్త్రమే వ్యాకరణం. జీవద్భాష (ప్రజల వాడుకలో ఉన్నది) సర్వదా మారుతునే ఉంటుంది కాబట్టి, మారుతున్న భాషతోపాటు వ్యాకరణం కూడా మారడం సహజం. మృతభాషలు (ఒకప్పుడు వాడుకలో ఉండి, ఇప్పుడు వ్యవహార భ్రష్టమైనవి) గ్రీకు –లాటిను సంస్కృతాలు మారే అవకాశం లేదు కాబట్టి వాటి వ్యాకరణం మారనక్కర లేదు.

వేర్వేరు భాషల సంప్రదాయాలు వేర్వేరుగా ఉన్నప్పుడు వాటి వ్యాకరణాలు కూడా కొంత వరకు భిన్నంగా ఉండక తప్పదు. వాక్య నిర్మాణంలోను, పద స్వరూప స్వభావాలలోను ఇంగ్లీషు – లాటిను భాషలకు చాలా వ్యత్యాసం కలదు. కాని ప్రాచీన వైయాకరణులు లాటిను వ్యాకరణమును మితిమీరి అనుకరించే లాటిను నియమాలను ఇంగ్లీషు మీద బలవంతంగా రుద్ది తమ బుద్ధి చాతుర్యం చేతను, ప్రయత్నబలం చేతను లేని నియమాలను కల్పించి ఇంగ్లీషు వ్యాకరణం తయారు చెయ్యడంలో ఆ భాషకు అపకారం చేశారు. **ఇటీవలి వ్యాకర్తలు లాటిను –ఇంగ్లీషు భేదాలను పూర్తిగా గుర్తించి ఇంగ్లీషు భాషాతత్త్వం అవగాహన చేసుకొని ఆధునిక వ్యాకరణం వ్రాశారు. ఒక భాషకు వ్యాకరణం వ్రాసేటప్పుడు దాని సంప్రదాయం, పదవాక్య ప్రయోగ విధానం, గమనించి తద్భాషా తత్త్వ ప్రదర్శకంగా వ్యాకరణం వ్రాయవలెనే కాని ఇంకొక భాష వ్యాకరణాన్ని ఆ భాషకు అంటగట్టరాదు. అందువల్లనే "ఒక భాష యొక్క వ్యాకరణాళిక మరొక భాషకు అంటగట్టడం ఆ రెండవ భాషయొక్క తత్వాన్ని పూర్తిగా అపార్థం చేసుకొనడమే అవుతుంది"** అని సెన్ అనే పాశ్చాత్య పండితుడు ఒకచోట అన్నాడు. అయితే, ఒక భాషకు వ్యాకరణం వ్రాయడంలో ఇంకొక భాష వ్యాకరణం ఎంత వరకు తోడ్పడుతుందో అంత వరకు దానిని అనుసరించడం దోషం కాదు.

లాటిను, ఇంగ్లీషు భాషల వలెనే సంస్కృతాంధ్రములు అనేక వైషమ్యాలను ప్రదర్శిస్తున్నవి. వాక్య నిర్మాణం, శబ్ద రూప నిష్పత్తి, సమాస రచన, పద క్రమం. లింగ వచన పద్ధతి విభక్తి ప్రణాళిక మొదలైన పెక్కు విషయాలలో తెలుగు సంస్కృతానికి భిన్నంగా ఉంటుంది. సంస్కృత భాషతో తెలుగుకు మొదటి నుంచి ఘనిష్ఠమైన సంబంధంఉన్నప్పటికీ ఆ రెండు భాషలకును జన్యుజనక సంబంధంగాని, సోదర సంబంధం గాని లేదు. అని భాషా శాస్త్రవేత్తలు నిర్ణయించారు. ఈ సిద్ధాంతం నెలకొల్పిన వారిలో ప్రప్రథముడు బిషప్పు కాల్డువెల్ పండితుడు. తదనుయాయులు కోరాడ, వజ్ఝల గంటి ప్రభృతులు, తెలుగు ద్రావిడ భాషా కుటుంబానికి చెందినదనే సిద్ధాంతం నేడు బహు జనామోద యోగ్యమైనది.

తెలుగుభాషకు మొదటి వ్యాకరణం నన్నయ కృత 'ఆంధ్ర శబ్ద చింతామణి'. అనంతర వ్యాకరణాలలో ప్రముఖమైనవి అధర్వణ కారికావళీ (వికృతి వివేకము), కవిశిరోభూషణము (అహోబిల పండితీయము) అనే విపుల వ్యాఖ్యానం – ఇవి సంస్కృతంలో ఉన్నవి. చిన్నయసూరి కృత బాల వ్యాకరణం, బహుజనపల్లి సీతారామాచార్యులు రచించిన ప్రౌఢ వ్యాకరణం మొదలైనవి తెలుగులోనే ఉన్నవి. ఈ వ్యాకరణాలు అన్నీ సంస్కృత వ్యాకరణ ప్రణాళికపై నిర్మించబడినవే. ఇటీవల వచ్చిన వడ్లమూడి గోపాలకృష్ణయ్యగారి 'వ్యావహారిక భాషా వ్యాకరణం' వ్యావహారిక భాషలో 'వ్యావహారిక భాషకై వ్రాసినదే అయినా, కేవలం చిన్నయసూరి ప్రణాళికనే అనుసరించి ఉన్నది. ఈ వ్యాకరణాలు సంస్కృత వ్యాకరణానుసారులై తెలుగు భాషా ప్రకృత స్వరూపమును, శబ్ద తత్త్వమును సరిగా నిరూపించలేకున్నవి. **నేడు విద్యాలయాలలో బోధించబడుతున్న వ్యాకరణం సంస్కృత వ్యాకరణాచ్ఛాయ మాత్రమే కాని, నిజమైన తెలుగు లక్షణం కాదు.**

ఉదాహరణగా ఒక్క నామ విభక్తుల విషయం తీసుకొని విచారించితే తెలుగు వ్యాకరణానికి జరిగిన హాని స్పష్ట పడుతుంది. సంస్కృతంలో ఏడు విభక్తులు కలవు. నామ ప్రాతిపదిక రూపాలు సిద్ధిస్తున్నవి. ప్రాతిపదికకు సమానగత ప్రయోగమే కాని స్వతంత్ర ప్రయోగం లేదు. మన వైయాకరణులు తెలుగులో కూడ ఏడు విభక్తులే ఉండాలి; సంస్కృత విభక్తి ప్రత్యయాలు ఏయే అర్థాలను బోధిస్తున్నవో ఆయా అర్థాలలో తెలుగులో కూడ ప్రత్యయాలే ఉండాలి అని భ్రమించి తెలుగుకు లేని ఒక విభక్తి ప్రణాళిక రూపొందించారు. ఈ అనర్థం తెలుగుకే కాదు, ఇతర ద్రావిడ భాషలకును, ఒడియా హిందీ ప్రభృతి ఉత్తరాది భాషలకును కొంతవరకు సంభవించకపోలేదు. నన్నయాదులు సంస్కృత విభక్తి రూపాలను తెలుగులోనికి అనువదించి, ప్రత్యయాలు కాని పదాలను, విభక్తి ప్రత్యయాలు కాని ఇతర ప్రత్యయాలను, విభక్తి ప్రత్యయాలుగా

పేర్కొన్నారు.

డు,ము,వు,లు – ఇవి ప్రథమా విభక్తి ప్రత్యయాలు కావు అని అనేక ఉపపత్తులు చూపి భాషావేత్తలు రుజువు చేశారు. కూర్చి, గురించి, చేత, తోడ, వలన, పట్టి, కంటె, యొక్క, లో, లోపల, అందు – ఇవి కూడా, విభక్తి ప్రత్యయాలు కావు. పదములే అని నిరూపించారు. క్రింద, మీద, వరకు, వెనుక, వెలుపల, తరువాత, కోసం, వలె, దనుక, దాక, పైని – ఈ పదాలను ఏ గణంలో చేర్చవలెనో, 'చేత' మొదలైన పదాలను కూడ ఆ గణంలోనే చేర్చాలి. వీటిని 'విభక్తి' ప్రతిరూప కావ్యయాలు', లేక 'విభక్త్యర్థాభిధాయకాలు' అని కొందరు వైయాకరణులు పేర్కొన్నారు. వీటికి ఈ వ్యాకరణంలో 'వైభక్తికములు' అనే సంజ్ఞ పెట్టడమైనది.

డు,ము,వు – ఇవి తరుచుగా తత్సమాలలో వచ్చే ప్రత్యయాలు – ఇది బహు వచనంలో వచ్చే ప్రత్యయం. ఉత్తమ – మధ్యమ పురుషములలో వచ్చే అను, అము, అవు, ఆరు – ఇవి నిజమైన ప్రథమా విభక్తి ప్రత్యయాలు. నా వ్యాకరణంలో దీనికి నామవాచక విభక్తి అనే సంజ్ఞ వాడబడినది.

'ల' నిజమైన ద్వితీయా విభక్తి ప్రత్యయం కాదు. దీనిలోని ఆత్వం సంబంధార్థంలో వస్తుంది. దీని మీద వచ్చే 'ను' వర్ణకమే నిజమైన కర్మవాచక విభక్తి ప్రత్యయం. 'న' నిజమైన సప్తమీ విభక్తి ప్రత్యయం కాదు. దీనిలోని 'ఆ' త్వం తృతీయా – సప్తమ్యర్థక కరణ – అధికరణార్థాలలో వచ్చే ప్రత్యయం. కు – కి – ప్రత్యయాలు షష్ఠీ విభక్తి అన్నారు. ఇవి సంప్రదానాది వివిధార్థాలను సూచించే ప్రత్యయాలు. 'ఆ – ఆరా' ప్రభృతులను సంబుద్ధివాచక ప్రత్యయాలుగా మన వైయాకరణులు పేర్కొన లేదు. ఈ విధంగా తెలుగు విభక్తి ప్రణాళిక తెలుగులో శబ్దతత్త్వమును సరిగా నిరూపించలేదు.

'డు–ము–వు–లు' శబ్దగతములే కాని ప్రథమా విభక్తి ప్రత్యయములు కావు అని కోరాడ రామకృష్ణయ్యగారు 'సంధి' అనే గ్రంథంలో ద్రావిడ భాషా తత్వాన్ని అనుసరించి చారిత్రాత్మకంగా నిరూపించారు.

'చక్కగా పరిశీలించినచో నివి (డు–ము–వు–లు) ప్రథమా విభక్తి ప్రత్యయము అనుటయే పొసగునట్లు తోచదు. ఏలయనగా నీ భాషలో సామాన్య ప్రాతిపదికయే ప్రథమా విభక్త్యేకవచన రూపమగుచుండెనే కాని ప్రాచీన భాషలో ప్రథమా విభక్తిని సూచించుటకుగా ప్రత్యేక ప్రత్యయములు లేవు.

* * *

"స్త్రీ లింగ – స్త్రీ సమ – శబ్దములకు ప్రథమైకవచనమున నేవో ప్రత్యయములను కల్పించుటయు, వానికి లోపమును విధించి లోపింపచేయుటయు ననునదంతయు సంస్కృత వ్యాకరణ ఫక్కీ ననుసరించిన యాంధ్ర వైయాకరణ కల్పనా విలసితమే కాని, వాస్తవముగా నీ భాషలో ప్రథమా విభక్తి కాక ప్రత్యయము కలుగుట కాని, లోపించుట కాని రెండును మిథ్యలే.

"ఇట్లు ప్రథమా విభక్తి ప్రత్యయములెంత మాత్రము కావనియు వాని తుదినున్న ఉపకారము ప్రాచీన కాలమున హలంతములై యున్న శబ్దములపై నుచ్చారణ సౌకర్యమునకై చేర్చి కానబడినదే గాని శబ్దగతము కాదనియు స్పష్టము".

చిలుకూరి నారాయణరావుగారు "ఆంధ్రభాషా చరిత్రము" లో "ము – వు–లు" ప్రథమా విభక్తి ప్రత్యయములు కావు అని స్పష్టపరిచినారు.

ద్రావిడ భాషలలోని ప్రథమావిభక్తిని గురించి కాల్డువెల్ పండితుడు తన తులనాత్మక ద్రావిడభాషా వ్యాకరణంలో వ్రాసిన మాటలు భావం.

"ద్రావిడ భాషలలో వలెనే సిథియను భాషలలోను నామములకు భిన్నభిన్న విభక్తి రూపాలు కలవు. కాని నామవాచక (ప్రథమా) విభక్తికి ప్రత్యయాలు లేవు. జపాను ప్రజల భాషలో నామములకు ప్రథమా (కర్తృవాచక) విభక్తి లేదు అని చెప్పబడుతున్నది. ద్రావిడ భాషలలో నామవాచక విభక్త్యేకవచనం ఎట్టి చేర్పులు, మార్పులు లేని నామమే; కాని నామవాచక విభక్తి రూపంలో నామముల ఏర్పాటున వచ్చే ప్రత్యయం అంతర్గతమై ఉంటుంది".

తెలుగు వ్యాకరణంలో సంస్కృతపు ఏడు విభక్తుల ప్రణాళిక ప్రవేశపెట్టడం వల్ల పెక్కు అనర్థాలు వాటిల్లినవి. "సర్వ విభక్తి సంస్కృత తుల్యా" అని నన్నయ్య భ్రమించి సూత్రించడమే మొట్టమొదటి గొప్ప పొరపాటు. దీనివల్ల కలిగే ఆపత్తి తొలగించడం కోసం "అన్యస్యాః క్వచిచ్ఛవేచ్ఛాన్యాః అని సూత్రించవలసి వచ్చినది. తెలుగులో ఆ ప్రత్యయమే కరణ – అధికరణార్థక తృతీయాసప్తమీ విభక్తులలో వస్తుంది. అని గుర్తించలేక పోవడం వల్లను, ఇవి కర్మార్థక ద్వితీయా విభక్తి రూపాలను పోలి ఉండడం వల్లను, షష్ఠీ (సంబంధార్థక) రూపాలకు ద్వితీయా రూప సామ్యం ఉండటం వల్లను, 'ఇతరత్ర చ ద్వితీయా', 'షష్ఠీ భవేద్వితీయాశుల్యా తత్పురుష సంస్థితా నామ్నామ్ : 'కేషాంచి దుదంతానాం' మొదలైన సూత్రాలు వెలసినవి. 'ఔప విభక్తిక నామ్నామత్వం స్యాత్ సప్తమీ తృతీయార్థే' అన్న సూత్రంలో మాత్రం నిజమైన ఆ – ప్రయత్నం విధానం కనిపిస్తున్నది. తక్కిన వికృతక సూత్రాలు, తరువాతి వైయాకరణులు, అథర్వణ చిన్నయాదులు నన్నయ్య సూత్ర పక్కీనే అవలంబించారు.

**నన్నయ చిన్నయాదుల వ్యాకరణాలలోని దోషాలను ఎనభై సంవత్సరాల ఎనభై సంవత్సరాల క్రితమే టి.యమ్.శేషగిరి శాస్త్రిగారు గుర్తించారు. "నన్నయ తన బుద్ధికి తోచినట్లు లక్షణము చెప్పగా తదనుయాయులు కూడ ఆ భ్రంశములతోనే వ్యాకరణములు రచించినారు. తమిళ కన్నడ భాషల వ్యాకరణములలో అట్టి భ్రంశములు లేవు. చారిత్రకముగా మన వైయాకరణుల లక్షణములు దుష్టములు, శబ్ద స్వరూప విరుద్ధములు, కాల్పనికములు, అవాస్తవములు.** అంతేకాక పాణినీయ వ్యాకరణ పరిభాషననుసరించి సూత్ర రచన చేయుటచే అవి దురవగాహముగా ఉన్నవి అని గుర్తించిన శేషగిరి శాస్త్రిగారు సులభ సూత్ర ఫక్కిని చారిత్రకముగా 'ఆంధ్ర శబ్దతత్త్వము' అనే వ్యాకరణం గత శతాబ్దాంతంలోనే వ్రాసి భాషకు మహోపకారం చేశారు. కాల్డువెల్ సిద్ధాంతాలను ఆమోదించిన కోరాడవారు, వజ్ఝలవారు, గంటివారు మొదలైన ఆంధ్ర భాషాతత్త్వ పరిశోధకులు మన వ్యాకరణాలలోని దోషాలను స్పష్టీకరించారు. ముఖ్యంగా నామ విభక్తి ప్రణాళికను సవరించ వలసిన ఆవశ్యకతను సూచించారు. శేషగిరి శాస్త్రిగారు పేర్కొన్న శుద్ధ ప్రత్యయములు అన్ ఇన్, ఉన్ (ద్వితీయ), ఆన్ (తృతీయ), కి.కు (చతుర్థి) ఇ. అ. ఉ. (షష్ఠి) అన్ ఇన్ (సప్తమి) మాత్రమే. పంచమికి శుద్ధ ప్రత్యయాలు లేవు. మిగిలిన కూర్చి – చేత – అందు మొదలైన వాటిని విభక్తి ప్రతి రూపక పదములుగా గుర్తించారు. చిలుకూరివారు కూడ 'యొక్క' ఊత పదమే కాని ప్రత్యయం కాదు; 'నే' సప్తమి కాదు; 'అన్'

ప్రత్యయమే సప్తమి; ము - వు - వర్ణకాలు విభక్తి ప్రత్యయాలు కావు; చేతన్, చేన్' మొదలైనవి ప్రత్యయాలు కావు- అని చెప్పారు. కోరాడ వారు 'డు -ము-వు-లు' శబ్దగతములే కాని విభక్తి ప్రత్యములు కావు అని తేల్చినారు. ముప్పై సంవత్సరాల క్రితం గంటి జోగిసోమయాజిగారు కూడ 'కు ను న ఇ అ' అనునేతచ్చములయినవానిని ప్రత్యయములుగా చెప్పి ఇతరములను స్వతంత్ర శబ్దములుగా గ్రహించి యేడు విభక్తుల క్రమము పొంత పోకుండుట యొక పద్ధతి కాదనజాలము. ఇదియే తెనుగునకు కుదిరిన ప్రణాళిక యనవచ్చును" అని విశదీకరించారు.

ఇంత మంది మేధావులు మహా పండితులు తెలుగు విభక్తి పద్ధతిని నిర్దుష్టంగా నిర్దేశించినా, నేడు మన పాఠశాలలలో, విశ్వ విద్యాలయాలలో ఇప్పటికిని బాల-ప్రౌఢ - వ్యాకరణాలను వాటిని అనుసరించి నేటి పండితులు రచించిన ఇతర వ్యాకరణాలను బోధిస్తున్నారు అంటే అది మన భాష దౌర్భాగ్యం కాక మరేమి? ఉపాధ్యాయులు పాఠశాలల్లో పిల్లల ప్రథమాది విభక్తి ప్రత్యయాలను అదే పద్ధతిలో వల్లెవేయిస్తున్నారు. ఉపాధ్యాయులకే దురవగాహమైన ఈ శబ్దతత్త్వం పసిపిల్లలు గ్రహించేది ఎట్లు?

విశ్వ విద్యాలయాలలో ఆంధ్రశాఖా పీఠాలను అధిష్ఠించి ఉన్న, డాక్టర్లను తయారు చేస్తున్న తెలుగు అధ్యాపకులు కూడ అర్థ రహితమైన, కృతకమైన విభక్తి ప్రణాళికను భేదించలేక పోతున్నారు. భాషా తత్త్వ వేత్తలై అధికారంలో ఉన్న వారు కూడ సంప్రదాయానికి కట్టుపడిపోయి ఏనాడో రావలసిన మార్పు నేటికైనా తీసుకొని రాలేక పోతున్నారు. విద్యా శాఖాధికారులు తయారు చేసిన సిలబసులు కూడా ప్రాచీన వ్యాకర ణానుసారులుగానే ఉన్నవి. సిలబసులకు వ్యాకరణాలే ఆధారం. వ్యాకర ణాలు దోషభూయిష్ఠాలైనప్పుడు సిలబసులు దోషావహాలు కాక తప్పదు. విద్యాశాఖ వారు ఆమోదించిన భాష గ్రాంథికమైనా, వ్యావహారికమైనా వాక్య నిర్మాణ రీతి, విభక్తి ప్రణాళిక, సంధి సమాసాదులు భాషాతత్త్వ విరుద్ధంగ ఉండరాదు కదా. వ్యావహారిక భాష అన్ని విద్యాస్థాయులలోను ఆమోదించబడుతున్న ఈ అదునున మార్గదర్శకమైన ఒక ఆధునిక వ్యాకరణం రూపొందింవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. అట్టి వ్యాకరణ నిర్మాణం నిమిత్తమే ఈ నా ప్రయత్నం! 1

ప్రామాణికమైన తెలుగు భాషకు ఆధునికమైన వ్యాకరణం కాబట్టి దీనికి 'ఆధునిక ప్రామాణికాంధ్ర వ్యాకరణం' అని పేరు పెట్టడమైనది. నేటి శిష్ట వ్యావహారిక భాషనే ప్రామాణిక భాష అంటున్నాము. నేడు పత్రికలలో పత్రికా రచయితలు వాడుతున్న భాష, రేడియో వార్తలలో వినిపిస్తున్న భాష, నేటి రచయితలు కథానికా నాటకాదులలో వ్రాస్తున్న భాష నేటి ఉత్తమ వక్తలు తమ ఉపన్యాసాలలో ఉపయోగిస్తున్న భాష - ఇదే ప్రామాణిక భాష.

ఈ భాషలో గ్రంథాలు రచించిన ప్రసిద్ధ రచయితలు ఎందరో ఉన్నారు. గిడుగు, గురజాడ, చెళ్లపిళ్ళ, శ్రీపాద, విశ్వనాథ, నార్ల, పురిపండా, వడ్లమూడి మొదలైనవారు. ఈ ప్రామాణిక భాషలో చక్కని వచన కవితలు వ్రాస్తున్న కవులు ఎందరో ఉన్నారు. శ్రీశ్రీ, బాలగంగాధర తిలక్, కుందుర్తి, బెజవాడ గోపాలరెడ్డి, ఆరుద్ర - మొదలైనవారు.

బహుళ ప్రచారంలో ఉన్న నేటి ప్రామాణిక రూపాలు భాషకు విశ్వవిద్యాలయాధికారుల ఆమోదముద్ర లభించింది. విద్యాశాఖాధికారులు నేటి ప్రామాణిక భాషలో పాఠ్య గ్రంథాలు ప్రచురిస్తున్నారు. వాటిని విద్యార్థులు చదువుతున్నారు. శిష్ట వ్యావహారిక భాషలో వ్రాయబడ్డ గ్రంథాలు పాఠ్యాలుగా నిర్ణయించడం జరుగుతున్నది. అన్ని విద్యా స్థాయిలలోను, అన్ని రచనా ప్రక్రియలలోను సంభాషణ మాధ్యమమైన భాషకు మిక్కిలి సన్నిహితమైన ఒక ప్రామాణిక భాష నెలకొంటున్నది. అటువంటి భాషకే భాషాతత్త్వ ప్రదర్శకమైన ఈ వ్యాకరణం ఉద్దిష్టమైనది.

"అటు రచనా మాధ్యమంగా, ఇటు సంభాషణ మాధ్యమంగా శిష్టులు ఉపయోగించే భాషా రూపం నిర్దిష్ట దేశకాలాల్లో ప్రామాణికంగా పర్యవసిస్తుంది. సన్నిహిత సాంఘికాది సంబంధాల వల్ల భాషలో వచ్చే ఏకరూపతనే, సామ్యాన్నే ప్రామాణికమని వ్యవహరిస్తాం.

"పండితులను పామరులు అనుకరించడం యథార్థ స్థితి. ఈ అనుకరణ ఫలితంగా నిర్దిష్ట దేశకాలాల్లో వచ్చే భాషా రూప తౌల్యమే ప్రామాణికం.

*యద్యదాచరతి శ్రేష్ఠస్తదేదేతరోత్తజనః*

ప్రజలు మాట్లాడే భాషకు వ్యాకరణం ఎందుకు అని కొందరు పండితులు అంటారు. వారి దృష్టిలో బహుశః శబ్దరూప సాధుత్వాసాధుత్వ నిర్ణయమే వ్యాకరణం అయి ఉంటుంది. మనం మాట్లాడే భాషనే సాధువుగా గ్రహించినట్లయితే ఆ భాషలో వ్రాసే రచనల శబ్ద రూపాలకు ఇక అసాధుతా ప్రసక్తి ఉండదు కదా. అని వారి వాదమేమో. నిజానికి శబ్ద సాధుత్వాసాధుత్వ నిర్ణయం మాత్రమే వ్యాకరణం కాదు. వాక్య నిర్మాణ రీతులు, ఉద్దేశ్య ఆఖ్యాత సంబంధం, భాషా భాగ వర్గీకరణం, పదబంధ - ఉప వాక్యాదుల రచన, లింగ విభక్తి వచన వివేకం, క్రియా - కాల - వాచ్యాది లక్షణం, సమాస నిరూపణం మొదలెట్టిన ఎన్నో విషయాలు వ్యాకరణ పరిధిలోనివి: అవి ఏ భాషకైనా ఆవశ్యకమే అనుట నిర్వి వాదాంశం.

ప్రాచీన గ్రంథమైనా, ఆధునిక శిష్ట వ్యావహారికమైనా శబ్ద రూప పరిమాణం తప్పించితే తెలుగు భాష అంతా ఒక్కటే. వచ్చెను. వచ్చినాడు, వచ్చాడు, వచ్చేడు, వచ్చిండు, ఈ క్రియా రూపాలు అన్నీ సమానార్థకాలే. 'వచ్చెను, వచ్చినాడు' గ్రాంథిక రూపాలు; తక్కినవి వ్యావహారిక రూపాలు, వీటిలో ఒకొక్కటి 'వచ్చు' ధాతువుకు విశుద్ధ భూతకాలరూపం, ఏక వచనం, పులింగం (వాడు) ఉద్దేశ్యమైనప్పుడు, అకర్మకం, కర్తృవాచం - ఇట్లు లక్షణం చెప్పడమే వ్యాకరణం చేసేపని. నా వ్యాకరణంలోని వాక్యాలను గ్రాంథికంగా మార్చితే అది గ్రాంథిక భాషకు కూడా వర్తిస్తుంది.

---

1. ఇక్కడ ఒక్క తెలుగు విభక్తి ప్రణాళిక మాత్రమే చర్చించడమైనది. అదే రీతిగా తెలుగు వ్యాకరణం అనేక ఇతర విషయాలలో సంస్కరించడం అవసరం. 'తెలుగు వ్యాకరణాల తీరు తెన్నులు' అనే గ్రంథం (వ్యాసావళి) లో అవి చర్చించబడ్డవి. ఈ వ్యాకరణంలో యథోచిత స్థానాలలో ఆయా విషయాలు వివరించడమైనది.

1. 'మహతి' (యువభారతి ప్రచురణ)లో శ్రీ బూదరాజు రాధాకృష్ణ భాష - ప్రామాణికత' అనే వ్యాసంలో ఇలా వ్రాశారు. 'జన సాంద్రత, వార్తా సౌకర్యాలు, విద్యాభివృద్ధి, ఆర్థిక రాజకీయ సౌష్ఠవం, భౌగోళిక సాన్నిహిత్యం మొదలైన ప్రధాన కారణాల వల్ల వ్యవహర్తల వాడుకలో నుంచి స్థానిక మాండలికాలు తొలగిపోయి ప్రామాణిక రూపాలు ఏర్పడి భాషలో ఏకత్వం అధికమౌతుంటుంది.

నాటి గ్రాంథిక భాషకై వ్రాయబడ్డ నన్నయ – చిన్నయాది వ్యాకర్తల వ్యాకరణాలలోని భ్రమ – ప్రమాత – అవాస్తవితలు దురవగాహసూత్ర పద్ధతి తొలగించి నేటి తెలుగు భాషకు భాషాతత్త్వ ప్రదర్శకమైన, సమగ్రమైన వ్యాకరణం నిర్మించేందుకే ఈ ప్రయత్నం జరిగింది.

అచ్చంగా మాటాడేటట్టు వ్రాయడం ఆచరణ సాధ్యమూ కాదు. అభిలషణీయమూ కాదు; లిఖిత భాష కథిత భాషకు అవసరమైనంత సన్నిహితంగా ఉండటమే ఉత్తమ రచనా లక్షణం. ఒక లిఖిత సంజ్ఞకు ఒక ఉచ్చారణ ఉండడం ఏ భాషలోను సంభవం కాదు; అలా ఉండేటట్లు చేయడానికి ప్రయత్నించడం నిష్ప్రయోజనం. సంస్కృతంలో, తితని (జల్లెడ) అనే మాటను 'తితవుః' అనే లఘువకారంతో పలుకుతాము. 'అతనిని' (అందుచేతనే) అనే దానిని 'అతయేవ' అని లఘు యకారంతో పలుకుతాము. హిందీలో కూడ వ్రాతకు, పలుకుబడికి కొంత తేడా ఉంటుంది. ఉదా...

| వ్రాత | ఉచ్చారణ | వ్రాత | ఉచ్చారణ |
|---|---|---|---|
| బకరా | బ్క్రా | ఖావో | ఖావా |
| ఝటపేట | ఝట్‌పేట్ | బిలకుల | బిల్‌కుల్ |

ఒడియా భాషలో కూడ ఇట్టి తేడా ఉన్నది

| వ్రాత | పలుకుబడి | వ్రాత | పలుకుబడి |
|---|---|---|---|
| గాఈ | గాయి | మోతే | మొత్తె |
| దేఖి | దేవుచ్చి | మోతేదిఓ | మొద్దియొ |

అదేవిధంగా తెలుగులోను ఉచ్చారణ స్వల్పమైన వర్ణలోపాది

వికారాలు ఉంటాయి. ఉదా :

| పలుకుబడి | అసలుమాటలు | పలుకుబడి | అసలుమాటలు |
|---|---|---|---|
| జింహ | జిహ్వా | ఇతర్లు | ఇతరులు |
| ఒక్కచ్చెప్పండి | ఒక కథ చెప్పండి | భారద్దేశం | భారతదేశం |
| భూమ్మీద | భూమిమీద | నీత్తప్పు | నీది తప్పు |
| వస్తునా | వస్తున్నాను | వెళ్లాల్సొచ్చింది | వెళ్లవలసివచ్చింది |

ఉచ్చారణత, అసావధానత మొదలైన కారణాల వల్ల పలుకుబడిలో ఏర్పడే వర్ణ వికారాలను వ్రాతలో చూపితే మాటల స్వరూపం చెడి అర్థ బోధకు హాని కలుగుతుంది. కథక లిఖిత భాషలకు కొంత భేదం ఉండడం అవాంఛనీయం కాదు. తాటాకు 'కొట్టాడు' పదాలలోని మధ్య అచ్చు ఆ – ఏలకు మధ్యగా ఉంటుంది. 'మేక', 'తేడా', ఇత్యాదులలోని ఏత్వం కూడా అటువంటిదే. తాలవ్య –దంత్య చ– జ ల భేదం ఉచ్చారణలో ఉంటుంది కాని వ్రాతలో కనబడదు. ఇటువంటి భేదాలను సూచించే గుర్తులు క్రొత్తగా కల్పించినా ప్రయోజనం ఉండదు; ఎవరును వాటిని ఉపయోగించరు. చ –జల విషయమే ఇందుకు తార్కాణం. బ్రౌను దొరగారు కల్పించిన చే, జే, అనే దంత్య వర్ణపు గుర్తులను (నిఘంటువులలో తప్ప) ఎవరు వాడుతున్నారు? కొంతమంది పామరుల మాటలు కూడా రచనా యోగ్యాలు కావు, 'తింతన్నాను' (తింటున్నాను) ఆత్తోరు (అత్తవారు), 'ఎల్లాలి' (ఎళ్లాలి) మొదలైనవి. కనుక 'సంస్కారార్థోనియమః అని యమాద్గ్రామ్యం హి యత్త్వపభ్రంశః' అన్న నన్నయ్య నుండి నేటి ప్రామాణిక భాషకు కూడా వర్తిస్తుంది. కేవలం మాటాడేటట్టు వ్రాయడానికి ప్రయత్నించే రచయితలు వ్రాతలో కొంత సంయమనం అలవర్చుకొనడం శ్రేయస్కరం. ఈ దృష్టితోనే నా వ్యాకరణంలోని ప్రసంగాలు, ఉదాహరణలు వ్రాయడం జరిగింది. **ప్రామాణిక భాషలోని రచనా యోగ్యములైన పద రూపాలను నిర్ణయించి పట్టికలు తయారు చేసే నిమిత్తం విశ్వ విద్యాలయాధికారులు, విద్యాశాఖాధికారులు, ప్రసిద్ధ రచయితలు గల ఒక సంఘం ఏర్పడడం వాంఛనీయం. ప్రభుత్వం వారే ఈ పనిని చెయ్యడం విధేయం.**

నా వ్యాకరణంలోని ఆధునికత గురించి కొంత చెప్పవలసి ఉన్నది, భాషణకు 'ఏకకం' వాక్యం[1]. వాక్యంతో ప్రారంభమైన 'వాక్య విజ్ఞానం' అనే మొదటి భాగంలో వాక్య విశ్లేషణం, వాక్యాంశాలు, భాషా భాగాలు, యుగ్మ భాషా భాగాలు, పదబంధ – ఉపవాక్య – జటా లక్షణాలు. సరళ – సంయుక్త – జటిల – ద్వంద్వ వాక్యభేదాలు మొదలైన విషయాలు ఆంధ్రభాషాతత్త్వ ప్రదర్శకంగా వివరించడమైనది. స్థూలంగా వ్యాకరణమంతా ఇందులో ఇమిడి ఉన్నది. చివరి భాగమైన రచనా జ్ఞానం లో వాక్యంలో ఉపవాక్య – జటా భేదాలు, వాక్య పరివర్తనం, స్వముఖ – ముఖాంతర కథనం మొదలైన నూతన విషయాలు కలవు.

భాషాభాగ వర్గీకరణంలో నవ్యత ఉన్నది. మనవైయాకరణులు పద రూపాన్నిబట్టి పేర్కొన్న 'అవ్యయం' అనే సంజ్ఞపద వృత్తాన్ని (వాక్యంలో అది చేసే పనిని) సూచించరు. కాబట్టి వృత్త ప్రధానమైన వింగడింపులో వైభక్తకం, కారకం, సంయోజకం, వ్యంజకం అనే భాషా భాగాలు చెప్పడమైనది. అష్టభాగ పద్ధతి ఇంగ్లీషుకు, హిందీకి సరిపడినట్లే తెలుగు మొదలైన భాషలకు కూడా చక్కగా సరిపడుతుంది.

ఏడు విభక్తుల ప్రణాళిక తొలగించడం ఒక ముఖ్య విశేషం. విభక్తుల అర్థాన్నిబట్టి నామ – కర్మ – సంబంధ – కారక–సంబుద్ధి – వాచక విభక్తులు చెప్పడమైనది. విభక్త్యర్థ విషయకమైన కారక ప్రకరణం తొలగించడమైనది. క్రియల అర్థమును పోషించే పదాలకు (పూర్వ వ్యాకరణాలలోని క్రియా – విశేషాలకు) 'కారకం' అనే పేరు పెట్టడమైనది. క్రియగాను విశేషణంగాను ద్వివిధ వృత్తం నిర్వహించే అసమాపక క్రియలకు 'క్రియా విశేషణం' అనే సంజ్ఞ వర్తింపజేయడమైనది. క్రియా విశేషణం' అనే సంజ్ఞ వర్తింపజేయడమైనది. క్రియా – విశేషణం, క్రియా నామం, క్రియా – కారకం మొదలైన ద్వివిధ వృత్తం కల యుగ్మ భాషా భాగముల లక్షణములు వివరింపబడినవి. అసమాపక క్రియా – ఘటిత సంబంధాలకు 'జట' అనే సంజ్ఞ కల్పించడమైనది. వాక్య – ఉప వాక్య – జటా పదబంధాల వర్గీకరణ – ఉపయోగాదులు భాషాతత్త్వ నిరూపక పద్ధతిని వివరించడం జరిగింది.

'పద విజ్ఞానం' అన్నింటికంటె పెద్దభాగం. దీనిలో వివిధ భాషా భాగాల వర్గీకరణం, వాటి రూప భేదాలు, వాటి ఏర్పాటు, ఉపయోగాలు మొదలైన అంశాలు విపులంగా ప్రసంగించబడినవి. సమాస వర్గీకరణంలో నవ్యత కలదు. ప్రథమాది విభక్తులు లేకపోవుటవల్ల ద్వితీయ తత్పురుషాది

(తరువాయి 22వ పుటలో...)

1. ఇంగ్లీషులోని 'యూనిట్లు' అనే మాట అర్థంలో ఈ 'ఏకకం' అనే పదం వాడబడినది. 'ఏక' మీద క – ప్రత్యయం చేర్చగా ఈ పదం ఏర్పడుతుంది. బర్జియా – హిందీ – ప్రభృతి భాషలలో 'ఏకకం' అనే పదాన్ని ఈ అర్థంలో వాడుతారు.

రావినూతల శ్రీరాములు
8885653924

# నూరేళ్లు పూర్తి చేసికొన్న చరిత్రాత్మక గ్రంథాలయం వేటపాలెం సారస్వత నికేతనం




ఫోటోలు: రావి సీతారామయ్య

మన దేశ స్వాతంత్ర్య సమరంలో ఆంధ్రులు మహోజ్జ్వల పాత్ర నిర్వహించి మహాత్ముల మన్ననలందుకున్నారు.

స్వాతంత్ర్య సమరానికి అనుబంధంగా సాగిన గ్రంథాలయోద్యమంలోను అయ్యంకి వెంకటరమణయ్య గాడిచెర్ల హరిసర్వోత్తమ రావు ప్రభృతులు అంకిత భావంతో పనిచేసి గ్రంథాలయోద్యమంలో కూడా ఆంధ్రదేశాన్ని అగ్రగామిగా నిలిపారు.

చీరాల సమీపంలోని వేటపాలెం యువకులు సమాజ సేవకు పూనుకొని వేటపాలెంలో "హిందూ యువజన సంఘం స్థాపించారు. దాని కార్యాలయ భాగంలో ఒక గ్రంథాలయం నెలకొల్పారు. ఈ సంఘానికి మూల పురుషుడు వేటపాలెం ప్రముఖులు శ్రీ ఊటుకూరి సుబ్బారాయశ్రేష్ఠి 1924 సెప్టెంబరు 1న గ్రంథాలయాన్ని ప్రత్యేకంగా శ్రేష్ఠిగారి తాలూకు పెంకుటింటిని విస్తృత పరచి ఏర్పాటు చేశారు. నాటి నుండి గ్రంథాలయాన్ని 'సారస్వత నికేతనం'గా పిలువ సాగారు. గాంధీజీ ముఖ్య శిష్యుడైన జమాన్‌లాల్ బజాజ్ చేతుల మీదుగా ఇది ప్రారంభింపబడింది. 1927 లో సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టం దీనిని రిజిస్టరు చేశారు.

1929లో ఆంధ్రదేశ పర్యటనకు విచ్చేసిన మహాత్మాగాంధిని సుబ్బరాయశ్రేష్ఠిగారు ఆహ్వానించి గ్రంథాలయ నూతన భవనానికి శంకుస్థాపన చేయించారు. ఆ సందర్భంగా ఆయన తన చేతి కర్ర విరిగిపోగా అక్కడే దిగవిడిచారు. అది గ్రంథాలయ వారసత్వ సంపదగా రూపు దాల్చింది.

భవనం పూర్తి అయిన తరువాత 'ఆంధ్రకేసరి' టంగుటూరి ప్రకాశం పంతులు దానికి ప్రారంభోత్సవం చేశారు. 1935లో బాబూ రాజేంద్రప్రసాద్ తాను సారస్వత నికేతనాన్ని సందర్శించినందుకు చిహ్నంగా ఒక పాలరాతి స్థంభాన్ని ఆవిష్కరించారు. ఈ గ్రంథాలయ దర్శనం తనెంతో సంతోషం కలిగిందని పేర్కొన్నారు.

ప్రతి ఏటా దసరాలో జరిగే నికేతన్ వార్షికోత్సవాలకు పలువురు దేశభక్తులు మహాకవులు పండితులను ఆహ్వానించేవారు.

ఈ ప్రాంతంలో జాతీయ చైతన్యం రగులటానికి ఈ గ్రంథాలయం తోడ్పడిందని చెప్పవచ్చు. 1940 ప్రాంతంలో జరిగిన సంఘటన ఈ విషయాన్ని ధృవ పరుస్తున్నది.

ఆ కాలంలో వీర సావర్కార్ రాసిన "భారత స్వాతంత్ర్య తొలి సమరం" యువకులను మిక్కిలి ఉత్తేజపరచింది. ప్రభుత్వం దీనిని నిషేధించింది. ఆ గ్రంథం సారస్వత నికేతనంలో వుండేది. దానిని జప్తు చేయాలని అప్పటిలో చండ ప్రచండుడుగా పేరుగాంచిన డి.ఎస్.పి. దప్పుల సుబ్బారావు సారస్వత నికేతనాన్ని ఒకనాటి సాయంత్రం తన బృందంతో అకస్మాత్తుగా చుట్టుముట్టాడు. పుస్తకాల అరలన్నిటినీ గాలించాడు. ఎంత గాలించినా నిషేధిత గ్రంథం వారికంట పడలేదు.

ఆ రోజులలో విద్యార్థులుగా వున్న ఇలింద్ర రంగనాయకులు (తర్వాత కాలంలో నర్సరావుపేట కాలేజి ప్రిన్సిపాల్), అడుసుమల్లి పార్థసారధి (శ్రీనివాసరావు పంతులుగారి సోదరుడు) హైస్కూలులో చదువుకొనేవారు. వారికి పోలీసులు గ్రంథాలయానికి వస్తున్నట్లు ముందుగా సమాచారం అందింది. వారు తెలివిగా వీర సావర్కార్ గ్రంథాన్ని గ్రంథాలయంలో సరస్వతీదేవి చిత్రపటం ఉండే గూటిలో భద్రపరిచారు. పోలీసులు దాడి జరిగిననాడు అడుసుమల్లి శ్రీనివాసరావుగారు ఊరిలో లేరు. వారు వచ్చిన తర్వాత విషయం తెలిసికొని విద్యార్థుల సమయ స్ఫూర్తికి అబినందించారు.

వేటపాలెంలోని బండ్ల బాపయ్య హిందూ హైస్కూలు కూడా చాలా ప్రసిద్ధిగాంచింది. ఉద్దండులైన అధ్యాపకులు అక్కడ పని చేసేవారు. నిఘంటువు రచించిన అబ్బరాజు సూర్యనారాయణ "ఆంధ్రాభ్యుదయం" కావ్య రచయిత బండ్ల సుబ్రహ్మణ్య కవి. తెలుగు పండితులు కాగా కర్ణవీర నాగేశ్వరరావు గొప్ప హిందీ పండితులు. తల్లావఝుల కృత్తివాస తీర్థులు 1952 దాకా వుండేవారు. వారి తండ్రి శివశంకర శాస్త్రిగారు వారితో అక్కడే వుండేవారు.

సాహితీ వేత్తల ఉనికితో వేటపాలెం సారస్వత నికేతనం సాంస్కృతీ

కేంద్రంగా భాసిల్లింది. శివ శంకరశాస్త్రి గ్రంథాలయ కార్యదర్శి అడుసుమల్లి శ్రీనివాసరావు పంతులుగారికి మంచి మిత్రులు. శాస్త్రిగారు వేటపాలెం వస్తే పంతులుగారి అతిథిగా వుంటూ సారస్వత నికేతనంలోనే గడిపేవారు. యువ రచయితలు ఆయనను చుట్టూ మూగేవారు. ప్రముఖ భాషావేత్త బూదరాజు రాధాకృష్ణ స్వస్థలం వేటపాలెం, తన పురోగతికి గ్రంథాలయం ఎంతో దోహదం చేసిందని ఆయన తరచు మిత్రులతో చెప్పేవారు.

అడుసుమల్లి శ్రీనివాసరావుగారు హైస్కూలు కరస్పాండెంట్‌గా వున్న కాలంలోనే ట్రైనింగ్ సెక్షన్ ఏర్పడి (1952) అయిదు సంవత్సరాలు నడిచింది. గ్రంథాలయానికి అనుబంధంగా గల ప్రింటింగ్ ప్రెస్సు ట్రైనింగ్ విద్యార్థులకు కావలసిన గ్రంథాలు ముద్రించింది. స్కూలుకి అనుబంధంగా గల శిక్షణా విభాగంలో ప్రసిద్ధ రచయిత శ్రీ మునిమాణిక్యం నరసింహారావుగారు ఉపాధ్యాయునిగా 1954లో వేటపాలెం వచ్చారు.

వావిలాల గోపాలకృష్ణయ్యగారికి సారస్వత నికేతనం అంటే చాలా ఇష్టం. 1952లో వావిలాలవారు గ్రామీణ పత్రికా రచన శిక్షణా శిబిరం గ్రంథాలయంలో నిర్వహించారు. నాటి విద్యార్థులలో కార్మిక నాయకులు శ్రీ ఎ.వి.కె. చైతన్యగారొకరు. 1956లో గ్రంథాలయోద్యమ ప్రముఖులు శరణు రామస్వామి చౌదరి జన్మదినోత్సవం గ్రంథాలయంలో వైభవంగా జరిగింది.

### గ్రంథాలయంలో ప్రత్యేకతలు :

నూరు పుస్తకాలు 2 పత్రికలతో 1918 అక్టోబరు 15న (విజయదశమి) ప్రారంభించబడిన గ్రంథాలయం 1930లో వందల సంఖ్యలో గ్రంథాలను సంతరించుకొని గుంటూరు జిల్లాలో అగ్రగామిగా నిలిచింది.

ఆ కాలంలో గ్రంథాలయంలో గల పుస్తకాలు క్యాటలాగుగా ముద్రింపబడింది. సభ్యత్వ రుసుము రు. 1/- మాత్రమే! ఇతర ప్రాంత పాఠకులకు పోస్టు ద్వారా కూడా పంపేవారు.

తొలి రోజులలో మహిళా పాఠకులకు వృద్ధులకు వారుకోరిన పుస్తకాలను ఇంటివద్దకే అందజేసేవారు.

ఈ శత సంవత్సరం నాటికి సారస్వత నికేతనం గ్రంథ సంచయం లక్షదాటింది. ఇందులో తెలుగు పుస్తకాలు 55 వేలు. ఇంగ్లీషు పుస్తకాలు 25 వేలు మిగిలిన భాషలు – హిందీ, ఉర్దూ, తమిళం – 20 వేలు వున్నాయి.

ప్రతిఏటా దసరాల్లో వార్షికోత్సవాలను వైభవంగా నిర్వహించేవారు. ఆ సందర్భంలో విచ్చేసిన పండితులకు, కవులకు చక్కని ఆతిథ్యం లభించేది. పరిశోధనా విద్యార్థులకు మంచి సౌకర్యాలు కలిగించేవారు. వేటపాలెం లోని ప్రసిద్ధమైన బండ్ల పాపయ్య హిందూ హైస్కూలుకు ఆయనే కరస్పాండెంటుగా వుంటూ అక్కడ మంచి సంస్కృతీ వాతావరణాన్ని నెలకొల్పారు.

శ్రేష్ఠిగారు జాతీయోద్యమంలో శ్రద్ధ వహించారు. చాలాకాలం ఆంధ్రా భారతీతీర్థకు ఆయన కార్యదర్శిగా వ్యవహరించారు. సారస్వత నికేతనం తరఫున పలు కరపత్రాలను, వయోజన విద్యవంటి గ్రంథాలను ప్రచురింప చేశారు. ధన్వంతరీ, వైద్య లహరి మొదలగు గ్రంథాలకు ఆయన కృతిభర్త. ఈయన భార్య కమలాంబిక, శ్రేష్ఠిగారి అనంతరం గ్రంథాలయ నిర్వహణ బాధ్యత వహించారు.

ఆమె మరణానంతరం శ్రీ అడుసుమల్లి శ్రీనివాసరావు సారస్వత నికేతనం బాధ్యతని చేపట్టారు. 1927 నుండి 1981 వరకు – 54 సంవత్సరాలు – గౌరవ కార్యదర్శిగా శ్రీనివాసరావు పంతులుగారు సారస్వత నికేతన్‌ను బహుముఖంగా తీర్చిదిద్దారు. వారికి విద్యార్థి దశ నుండే గ్రంథాలయాల పట్ల ఆసక్తి వుండేది. బాపట్ల గ్రంథాలయం ఆర్థిక వనరులు లేక ఇబ్బంది పడుతుంటే విద్యార్థిగా వున్న శ్రీనివాసరావు రైల్వే ప్లాటుఫారంకు వెళ్లి ప్రయాణీకుల వద్ద సముద్ర స్నానానికి వచ్చే వారి నుండి పైసా వసూలు చేసి గ్రంథాలయాన్ని బ్రతికించారు. 1931 లో వేటపాలెంలో గుంటూరు జిల్లా గ్రంథాలయాన్ని ఆయన పునరుద్ధరించారు. చిరకాలం ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘం కార్యవర్గ సభ్యుడు 1973లో ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ కొత్తగా ఏర్పడినప్పుడు ఆయన తొలి ఛైర్మన్‌గా జిల్లాలో నూతన గ్రంథాలయాల స్థాపనకు కృషి చేశారు. వేటపాలెంలో హైస్కూలు కరస్పాండెంట్‌గా వున్న కాలంలో పెక్కు సాంస్కృతిక కార్యక్రమాలకు దోహదం చేశారు. తొలి ప్రపంచ తెలుగు మహా సభలలో (1975) 'గ్రంథాలయ మహా సారధి' అనే బిరుదు వీరికి ప్రదానం చేయబడింది. వీరు 1901 లో జన్మించి 1981 లో కాలం చేసి పూర్ణ జీవితాన్ని ప్రయోజనవంతంగా గడిపారు.

రాజకీయ నాయకులలో శ్రీ పి.వి.నరసింహారావు, మర్రి చెన్నారెడ్డి కాసు బ్రహ్మానందరెడ్డి కె.ఎల్.రావు ప్రభృతులు ఈ గ్రంథాలయాన్ని దర్శించారు.

ఎవరో కొందరు దాతలు భూరి విరాళాలిచ్చినా ప్రభుత్వం వారిచ్చే స్వల్ప గ్రాంట్‌తో సారస్వత నికేతన్ నిర్వహణకు కష్టతరంగా మారుతున్నది.

శత జయంతి సంవత్సరంలో సారస్వత నికేతనానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకొని చేయూత నిస్తాయని ఆశిద్దాం.

---

( 20 వ పుట తరువాయి...)

సమాన సంజ్ఞలకు స్థానం లేకపోయినది. తెలుగు తద్ధిత కృదంతాల తోపాటు తత్సమ తద్ధిత కృదంతాల ఏర్పాటు సమగ్రంగా వివరించడం జరిగింది.

'అక్షర విజ్ఞానం'లో వర్ణములు, వర్ణోత్పత్తి, అక్షరములు, లేఖన పద్ధతి, స్వరాఘాతం, స్వరస్థాయి మొదలైన విషయాలు విపులంగా వ్రాయడం జరిగింది. 'సంధి విజ్ఞానం'లో విసంధి ప్రాముఖ్యం, సంస్కృతాంధ్ర సంధి నియమాలు వివరించడమైనది.

ఈ వ్యాకరణంలో దురవగాహమైన క్లిష్టమైన సూత్ర పద్ధతి విసర్జించి ఒకొక్క భాషా విశేషం ఒకొక్క ప్రసంగంగా వ్రాయడమైనది. విషయం సుబోధమయ్యేటందుకు ఉదాహరణలు అధిక సంఖ్యలో ఇవ్వడం ఒక విశేషం.

ఈ వ్యాకరణం సమగ్రమని కాని, నిర్దుష్టమనికాని చెప్ప సాహ సించను. దీనిలో అజ్ఞానవశాన ఏదైనా భాషా విశేషాలు విడిచి పెట్టబడి ఉండవచ్చును. అట్టి భాషా విశేషాలను దీనిలో చేర్చడం, లోపాలను తొలగించడం భావి వ్యాకర్తల బాధ్యతలుగా పరిగణిస్తున్నాను.

భాషోద్యమ కథానిక

# వెలుగులకై ప్రస్థానం

పి. వి. ఆర్. శివకుమార్
9594996990

కన్నుపొడుచుకున్నా కానరాని చీకటి. నిశ్చేతనంగా పడి ఉన్నాడు సింగయ్య.

వళ్ళు కదప లేకపోతున్నాడు గానీ, స్పృహ తెలుస్తోంది. ఆలోచన సాగుతోంది, శబ్దాలు వినిపిస్తున్నాయి, ఆకుల గలగలలు, పక్షుల కూజితాలు, దగ్గరలో ఏదన్నా సెలయేరు ఉందేమో, జలజలా జాలువారుతున్న జల పాత శబ్దాలు ప్రకృతిని ఆస్వాదించే మనః స్థితి కాదు సింగయ్యది. తలుచుకున్న కొద్దీ పొంగుకొస్తున్న దుఃఖం! తనపై తనకున్న నమ్మకానికి తగిలినదెబ్బకినిబిడాశ్చర్యం!

'ఇది సాధ్యమా? ఎలా సాధ్యం?'

బలవంతానకాళ్ళూ, చేతులూ కూడ గట్టుకుని లేచి నిలబడే ప్రయత్నం చేసాడు - అయిదు నిమిషాల తరవాత , ఆ ప్రయత్నం లో సఫలీకృతుడయ్యాడు.

అదృష్టం కొద్దీ కాళ్ళూ, చేతులూ సవ్యం గానే ఉన్నాయి. ఎన్ సర్కిల్డ్ ఎయిర్ బెలూన్ అయనని రక్షించింది!

తల త్రిప్పి చుట్టూ చూసాడు - ఇంకా కనుచీకటిగానే ఉంది. ఏమీ కనిపించటం లేదు.

"ఘనీష్!...ద్రవ్యా!..." ఎలుగెత్తి కేకలు పెట్టాడు, జవాబు లేదు.

ఆయనకి బాగా జ్ఞాపకం ఉంది, తాను అచేతన స్థితిలో పడి ఉన్న సమయంలో, అంతటి సుషుప్త్యావస్థలోనూ లీలగా వినిపించాయి ఆర్తనాదాల వంటి పిలుపులు,

"తాతయ్యా! లే తాతయ్యా ! భయమేస్తోంది తాతయ్యా !" మనవడూ, మనవరాలూ పెట్టిన కేకలు.

జవాబివ్వాలని ఉన్నా, కనులు తెరిచే పరిస్థితి కూడా లేదప్పుడు. ఎన్ని గంటలు అలా పడి ఉన్నాడో ఆయనకే తెలియదు.

దూరంగా దహనమైపోతూఅంత్యావస్థలో ఉన్న హెలికాప్టర్ - తిరిగి రానిగతంలా!!

ఇంకా ఆ నివురులోంచే వస్తున్న పొగలు - భవిష్యత్తు మీది ఆశలా !

సింగయ్య హెలికాప్టర్ నడపడంలో సిద్ధ హస్తుడు. పాతికేళ్ల అనుభవం. స్వంత హెలికాప్టర్. ఎటువంటి వాతావరణంలో నైనా పని చేసే ప్రత్యేకమైన గజెట్స్ బిగించిన ఇంజన్.



ఒకప్పుడు, దేశభాషలందు లెస్స అనిపించుకున్న సంపన్న భాషని, ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అని యావత్ప్రపంచంచే పొగడబడిన మాతృభాషని, ఎందుకు, ఏ కారణమూ లేకుండా చంపుకున్నాం? ఇరుగు పొరుగు రాష్ట్రాలన్నీ తమ తమ మాతృభాషల ప్రాచుర్యానికి మరింత నిరంతర కృషి చేస్తూ, ఏ దేశమేగినా, ఎందుకాలిడినా, తమభాషలోనే మాట్లాడుకుంటూ, మెసులుతుంటే, మనకే న్యూనతా భావం ఎందుకు వచ్చింది? ఎక్కడుంది లోపం?

ఎంతటి ముసురులోనైనా, చీకటిలోనైనా, కిలో మీటర్ దూరం దాకా స్పష్టంగా కనిపించే విధంగా అమర్చిన వ్యూ విండోస్. అన్నీ స్వదేశంలో తయారై, విదేశాలు ఎగబడి కొనుక్కుంటున్న ఆక్సేసరీస్.

అటువంటి హెలికాప్టర్ ఎలా ప్రమాదానికి గురయిందో సింగయ్య ఊహక్కూడా అందట్లేదు.

విధి అనేది ఈ కాలం లోనూ ఒక టుందా? మనిషిచేతిలో అంతా లేదా?

ఆలోచనలని వాటి దారికి వదిలేసి, మనవడు, మనవరాలి కోసం వెదకటం ప్రారంభించాడు సింగయ్య. అడవి దారి, ఆకాశం కన బడకుండా పర్వత సదృశ వృక్షావళులు. దారినిండారాళ్ళూ, రప్పలు. ఇవేవీ ఆయనని బాధించట్లేదు, అసలాయనకి అవి బాధ పెడుతున్నాయని కూడా తెలియట్లేదు. ఆయనకి తెలిసిందల్లా ఒక్కటే – మనవడు, మనవరాలు కన బడట్లేదు – ఒక్క గంట షికారుగా తిప్పుకొస్తానని కోడలితో చెప్పి, తీసుకు వచ్చాడు–ఇంతలో ఈ ఉపద్రవం!!

కోడలికి , కొడుక్కి ఏం సమాధానం చెప్పుకోవాలి? అసలు తనకి తనేం జవాబు చెప్పుకోవాలి?

ప్రశ్నలు, దుఃఖమూ కలగాపులగంగా ఆయనని ఆవరించి అతలాకుతలం చేస్తున్నాయి.

నాలుగయిదు గంటలు...ఎలా నడిచాడో తెలియదు. ఏ శక్తిఆవరించిందో తెలియదు.

ఏక దీక్ష..ఏకైక ధ్యేయం ..

“పిల్లలుకంటబడాలి. క్షేమంగా కంటబడాలి. ఏ జంతువూ వారిని గాయపరచకుండా, ఏ పురుగు వారిని ముట్టి, మట్టుబెట్టకుండా, సజీవంగా, సలక్షణంగా నా పిల్లలు నాకు దక్కాలి దేవుడా!”

ఒకటే ప్రార్ధన, ఆకలి లేదు, దప్పిక తెలియదు, తెలిసిందల్లా ఆర్తి ...అంతే!

రాను రాను ఆ అడివి అంతమై పోతూ, సింగయ్యని నిరాశకి గురి చేస్తూ అకస్మాత్తుగా...

“ అరె ! అదేమిటి? ఇక్కడ ఈ కొండ?”

ఆ యనకి ఆ ప్రాంతాలు పరిచితమే గానీ, ఇంత లోతులకి ఎప్పుడూ రాలేదు – ఈకొండని ఎప్పుడూ చూడలేదు.

‘ఏ పరమార్ధంకోసం ఈ కొండని కడుపులో దాచుకుని, కన్నతల్లిలా కాపాడుతోంది ఈ అడవీరాజం?’

తాత్కాలికంగా తన ఆర్తిని మరిచిపోయి, ఆసక్తితో ఆ కొండవైపు నడక సాగించాడు సింగయ్య.

దగ్గరగా వెళ్ళాక తెలిసింది, అదేమంత పెద్ద కొండ కాదు, చిన్న కొండ గుట్ట. రెండు కిలోమీటర్ల కైవారం ఉంటుందేమో...దాని చుట్టూ ఒక సారి తిరిగాడు. ఏమి కనిపించలేదు. ఎందుకో, ఆ కొండగుట్టని దాటి ముందుకి వెళ్ళబుద్ధి కాలేదు సింగయ్యకి. ఘనీష్, ద్రవ్యా ఇక్కడే ఎక్కడో ఉంటారని గట్టిగా అనిపిస్తోంది.

వాళ్ళ పేర్లు పిలుస్తూ, ఆ కొండ చుట్టూ రెండో చుట్టుతిరగటం ప్రారంభించాడు, ఈ సారి శ్రద్ధగా ప్రతి అడుగూ, అంగుళం పరిశీలనగా చూస్తూ...

సగం వృత్తం పూర్తయేసరికి ఆయన శ్రమ ఫలించింది. చెట్ల గుబురు వెనుకగా అనుమానితంగా కొంత ఖాళీ జాగా. పట్టి, పట్టి చూస్తేగానీ కనిపించటం లేదు. ఆ కొమ్మలని తప్పించుకుంటూ లోపలికి దూరిన సింగయ్యకి కనపడింది ఆ గుహ వంటి చీలిక. కొమ్మలు పక్కకి తొలగటం మూలాన కాస్త వెలుగు చొరబడి, లోపలికి దారి తెలుస్తోంది.

మొండి ధైర్యంతో లోపలి నడిచాడు సింగయ్య. రానురాను చీకటి. తడుముకుంటూ ముందుకే, ఆ గుహలోకి అయిదు నిముషాలు నడిచాడేమో,సన్నగా వెలుగు రేకలు–చిన్నగా మాటలు – కనవచ్చాయి, వినవచ్చాయి.

ఉత్సాహంగా ముందుకు, దాదాపుగా పరుగుపెట్టిన సింగయ్య తన కళ్ళనుతానే నమ్మలేక పోయాడు. అక్కడొకశిలాసనం పై మోకాళ్లని తాకుతున్న గడ్డంతో, పున్నమి చంద్రుని ముఖవర్చస్సుతో వెలిగిపోతూ, వాల్మీకిని పోలిన మహర్షి వంటి వృద్ధుడు. అంత కన్నా విశేషం ఆయన ముందు కూర్చుని ఆయన చెబుతున్నది వింటూ ఘనీష్, ద్రవ్య!!

“ఘనీష్, ద్రవ్యా!” పిచ్చెక్కినట్లుగా అరుస్తూ వాళ్ళని సమీపించాడు సింగయ్య. రెండు చేతులతోనూవాళ్ళని దగ్గరకు తీసుకుని గట్టిగా కౌగలించుకున్నాడు.

“తాతయ్యా!” అంటూ వాళ్లిద్దరూ ఆయన్ని చుట్టుకు పోయారు.

కలగాపులగంగా మాట్లాడుతూ ఇద్దరు పోటీలు పడి జరిగినదేమిటో ఆయనకి చెప్పారు.

తాతయ్య స్పృహలేని స్థితిలో ఉండ డంతో, నీళ్లు జల్లితే ఆయనకి తెలివొస్తుందన్న ఊహతో, నీళ్లు వెదుకుతూ బయలుదేరేరు వాళ్ళు. కానీ, ఆ చీకటిలో, ఆ అడవి లో వాళ్ళకి దారి తెలియలేదు. ఒక మలుపులో, వెనుకకి వెళుతున్నామనుకుంటూ, మునుముందుకు వెళ్లి పోయారు.

బ్రాహ్మీ ముహూర్తంలో అనుష్ఠానానికి బయటకు వచ్చిన వృద్ధుడు, దారి తప్పిన పిల్లలని తనతోపాటుగా లోపలికి తీసుకువచ్చాడు. వారికి పళ్ళు తినిపించి, కూర్చోపెట్టుకున్నాడు.

విషయం కనుక్కుని, వారికి ధైర్యం చెప్పే ప్రయత్నంలో పడ్డాడు.

రెండు చేతులతో ఆయన పాదాలు తాకి, కళ్ళకద్దుకున్నాడుసింగయ్య.

“స్వామీ, మీరు నా పాలిట దేవుడే! నా పిల్లలని నాకు దక్కించారు” అన్నాడు ఉద్వేగంగా.

అయన చిరునవ్వు నవ్వారు, “నేను ఏమి చేసాను? ఉషోదయ వేళలో నా ఇంటిని పావనం చేసిన బాల అతిథుల్ని, ఫలాలు పెట్టి, ఆదరించాను. అది మానవ ధర్మం, అంతే కదా !”

ఆ వృద్ధుడు, ఏకాంత రామయ్య, తెలుగు పండితుడు. ఘనీష్, ద్రవ్య మాట్లాడే భాష ఆయనకి అర్థం కావడం లేదు. అయన మాట్లాడే భాష పిల్లలకి తెలియటం లేదు.అందుకే, అయన పిల్లలతో సంభాషణ ఆంగ్లం లో సాగించేడు.

సింగయ్య మాట సైతం ఆయనకు అర్థం కాలేదు. అయితే అది కేవలం ఒకటి , రెండు నిముషాలు మాత్రమే. ఆయన దగ్గరగా నిలబడ్డ సింగయ్యకు ఆయన పక్కనే, చిన్న రాతి దిమ్మ మీద ఉన్న గ్రంథం కంటబడగానే, ఆశ్చర్యంతో కనులు పెద్దవయ్యాయి. అంతకుముందే మనుమడు, మనుమరాలు కంటబడగానే వచ్చినప్పటిలాటి ఉద్వేగం , ఆ గ్రంథాన్ని చూడ గానే కలిగింది, దశాబ్దాల పాటు కనబడ కుండా పోయిన ఆత్మీయులు, ఇహ కనబడ రనుకున్న ప్రాణాలు, అనుకోకుండా, అకస్మా త్తుగా ఎదురుపడితే వచ్చే ఉద్వేగం!

అది ఒక తెలుగు గ్రంథం.

“స్వామీ, తమరు తెలుగువారా?” కన్నీళ్ల పర్యంతమైపోతూ అడిగాడు సింగయ్య.

ఈసారి ఆశ్చర్యపోవటం ఏకాంత రామయ్య వంతైంది.

“ మీరు...మీకు తెలుగు...”

సిగ్గుతో చితికిపోతూ జవాబిచ్చాడు సింగయ్య, "అవును స్వామి! మేము ఒకప్పటి తెలుగు రాష్ట్రాలవాళ్ళం".

"మీ పిల్లలు మాట్లాడే భాష ఏది? అది నాకు అర్థం కాక, ఆంగ్లంలో సంభాషించాను".

"తెలుగు క్రమక్రమంగా అంతరించే క్రమంలో, 'సంకరీ 'అన్న భాష రూపొందింది స్వామీ. ఇప్పుడు మాకు లిపి లేదు, వర్ణమాల లేదు. ఆంగ్ల లిపినే మేము వాడుకుంటున్నాము. ఆంగ్లం, హిందీ, తమిళ, కన్నడ భాషల కలయిక ఇప్పుడు మా భాష. అదే సంకరీ భాష.

అందుకే, మీకు మా భాష అర్థం కాలేదు. తెలుగు భాష ఇప్పుడు ప్రపంచంలో ఎవరికీ అర్థం కాదు, నా తరం అంతరించటమే తరువాయి, మిగిలున్నమనసుల్లోంచి కూడా ఈ భాష అంతరించటానికి."

ఏకాంత రామయ్యకి చెప్తుంటే, సింగయ్యకళ్ళనిండా నీళ్లు, గొంతునిండాపూడుకున్న దుఃఖ ఛాయలు.

ఘనిష్క్, ద్రవ్య కి ఏమీ అర్థం కాలేదు. తాతయ్య ఎందుకు ఆలా ఏడుస్తున్నాడో తెలియటం లేదు. అలాగే చూస్తుండిపోయారు, బిక్కుబిక్కుమంటూ.

"స్వామీ, తమరిలా–" రెండు నిముషాల తరవాత, తమాయించుకుని అడిగాడు సింగయ్య.

భావోద్వేగాలకతీతంగా నవ్వాడు ఏకాంత రామయ్య.

"అంతా నేను భయపడినట్లే జరిగిందన్న మాట"

"అంటే?" అయోమయంగా చూసాడు సింగయ్య.

"భాషకి అంత్యకాలం సమీపించటం, బాలతరానికి తెలుగు అవసరం లేదనే వాదం ఆరంభం కావటం, అది క్రమశః అమలులోకి రావటం, ఓనమాలు బలవంతంగా బయటకు నెట్టబడి, ఆంగ్ల అక్షరాలతో, ఆంగ్ల గీతాలతో తెలుగు బాలల చదువు మొదలు కావటం, యువత తాము నేర్చిన తెలుగు మరచి, ఆంగ్ల,లేదా ఇతర భాషలలోనే సంభాషించుకోవటం, రాను రాను తెలుగు అనాగరిక భాష అన్న భావన రూపు దిద్దుకోవటం, తెలుగు లో మాట్లాడే వారు అవహేళనకు గురి కావడం, తెలుగు సాహిత్యం, పత్రికలు మూతబడిపోవటం, తెలుగు ప్రచురణలు మృగ్యం కావటం...చివరికి సభ్య(మనుకున్న)సమాజం నుంచి తెలుగు రాసేవారు, మాట్లాడే వారు వెలికి గురి కావటం– అన్నీ నేను చూసాను.

నా మాతృభాషకు సమాధి కట్టబడటం భరించలేక పోయాను.

ఊరొదిలి, రాష్ట్రం వదిలి, దూరంగా ఈ అడవుల్లోకి వచ్చేసాను. అప్పుడు నా వయసు డెబ్భయ్యేళ్ళు. కుటుంబిక బంధాలు , బాధ్యతలు తీరి పోయిన పరిస్థితి.

నా దగ్గర ఉన్న, ఇంకా అవశేషావస్థలో ఉన్న గ్రంథాలయాల నుంచి సేకరించ గలిగిన గ్రంథాలన్నీ తీసుకుని నా మాతృభాషామ తల్లిని నాతోనే తెచుకుంటున్నానన్న తృప్తితో, వచ్చేసాను.

ఈ కొండలో ఏ నాటి బౌద్ధ మహానుభావులు మలచి వదిలారో,ఈ గుహ నాకు ఆశ్రయమిచ్చింది.

ఈ చుట్టూ కనబడుతున్న అలమరాలు, నేను, నెమ్మది, నెమ్మదిగా తొలుచుకున్నవే.

నా గ్రంథాలన్నీ, పదిలంగా భద్రపరచడం కోసం, వీటిని మలచుకున్నాను."

అప్పుడు చూసాడుసింగయ్య, గుహలో నాలుగు వైపులా.

చూడటానికి కుటీరం లా ఉన్న ఆ గుహ దాదాపు పదిహేను మీటర్ల పొడుగు, ఇరవై మీటర్ల వెడల్పుతో ఉంది. ఆ గుహలో చుట్టూతా అలమరాలు, రాతిలో చెక్కినవే ఉన్నాయి.

వాటినిండా తెలుగు పుస్తకాలు!

పురుగు పట్టకుండా ఆ పుస్తక శ్రేణుల మధ్య మధ్యలో వేపాకులు, వేప మండలు!

అయన చెప్పినదీ, ఆ చూసినదీ ఆయననిదిమ్మెరపోయేలాచేసాయి.

"స్వామీ, మీరొక్కరేవంటరిగా, యిలా, ఇన్నేళ్లుగా? మీ భోజనం, ఇతర అవసరాలు?"

మళ్ళా అదే నవ్వు ఏకాంత రామయ్యలో.

"అవునునాయనా ! అయిదు దశాబ్దాలు గడిచి ఉంటాయి . ఇంకెన్నాళ్లు బ్రహ్మ దేవుడు ఆయుష్షు పోస్తే అన్నేళ్లు గడుస్తాయి.

తినటానికి చుట్టుపక్కల ప్రకృతి ప్రసాదించిన ఫలాలున్నాయి. కంద మూలాలున్నాయి.

నీకొక విషయం చెప్తాను. నేను దేశంలో ఉండగా, సమాజ జీవనం గడుపుతుండగా, ఉన్న రక్తపోటు , మధుమేహం, కీళ్ల నొప్పులు, అన్నీ ఇక్కడ జీవించటం ప్రారంభించిన ఒకటి, రెండేళ్లలో పూర్తిగా అంతరించిపోయాయి. నేను తినే కంద మూలాలలో ఏ మూలికలు నన్ను బాగుపరచాయో నాకు తెలియదు. తెలియనవసరం కూడా నాకు లేదు.

ప్రకృతి వొడిలో యోగ వ్యాయామాలు, భగవత్ప్రార్థన, మిగతా సమయమంతా హాయిగా ఈ గ్రంథ పఠనం...ఇంకేం కావాలి చెప్పు? ఒక చీకు లేదు, ఒక చింత లేదు.నా తల్లిని నాతో తెచ్చుకున్నాను, నాకా తల్లే సత్కాలక్షేపం."

సింగయ్య మనసు అతలా కుతలం అవుతున్నట్లయింది.

తమ తర్వాతి తరాలన్నీ తల్లిలేని అనాథలైనట్లేగా?

ఒకప్పుడు, దేశభాషలందు లెస్స అనిపించుకున్న సంపన్న భాషని, ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అనియావత్ప్రపంచం చే పొగడబడిన మాతృభాషని, ఎందుకు, ఏ కారణమూ లేకుండా చంపుకున్నాం? ఇరుగు పొరుగు రాష్ట్రాలన్నీ తమ తమ మాతృభాషల ప్రాచుర్యానికి మరింత నిరంతర కృషి చేస్తూ, ఏ దేశ మేగినా, ఎందుకాలిడినా, తమభాషలోనే మాట్లాడుకుంటూ, మెసులుతుంటే, మనకీ న్యూనతా భావం ఎందుకు వచ్చింది? ఎక్కడుంది లోపం?

పది నిముషాల సేపు మౌనంగా, ఆ పురాతన పుస్తక భాండాగారం లో కలయ దిరుగుతూ ఆలోచించాడు సింగయ్య.

తమ రాష్ట్రం, తన ప్రజలు, తమ ప్రస్తుత సంకరీ భాషకి స్వస్తి పలకాలనీ, తిరిగి తమ మాతృభాష తెలుగుకి జీవం పోయాలనీ, అందుకు తను తనువుచాలించేలోగా శ్రీకారం చుట్టాలనీ అతని మనసులో బలమైన బీజం పడింది.

వెనుతిరిగివచ్చి, ఏకాంతరామయ్య ముందు పీటం వేసుకుకూర్చున్నాడు. తన మనసులో మాట చెప్పాడు.

"అది మహా యజ్ఞం. నీ ఒక్కడి సంకల్పం వల్ల ఏమవుతుందినాయనా? కాదు"

విచారంగా అన్నాడాయన.

"మర్రి చెట్టు మహా వృక్షం కావటానికి ఆరంభం లో అది అతి చిన్న విత్తనమే కదా

**(తరువాయి 35 వ పుటలో...)**

మధురాంతకం నరేంద్ర
9866243659

# శరత్ నవలలో తెలుగుపాత్ర



**దేశీ ప్రచురణలు, బొందలపాటి శివరామకృష్ణ, చక్రపాణిగార్ల పుణ్యమా అని శరత్ చంద్ర చటోపాధ్యాయ అనే పూర్తి పేరున్న శరత్‌బాబు దాదాపుగా తెలుగు రచయితగా మారిపోయాడు. శరత్‌బాబు రచనలన్నీ తెలుగులోకి అనువాదం అవడంతోబాటూ, బెంగాలీ తరువాత తెలుగులోనే ఆయన నవలలు యెక్కువగా సినిమాలుగా రూపొందాయి. యెక్కువగా ప్రాచుర్యంలోకి రావడం గూడా సాహిత్య ప్రమాణాల అంచనాకు యిబ్బందిగా మారడం అరుదుగా జరుగుతూ వుంటుంది. సరైన అనువాదాలు లేకపోవడం చేత కొందరు రచయితలకు ప్రపంచస్థాయి పరిగణన రాకుండా పోతుంది. శరత్‌బాబు రచనలు యీ రెండు యిబ్బందులకూ గురయ్యాయి. బాగా ప్రాచుర్యంలోకి వచ్చిన ఆయన 'దేవదాసు'నవల సినిమాగా యెక్కువ ప్రచారంలోకి రావడం, అది ప్రేమ కథగా రూపొందడం శరత్‌బాబు రచనల మూల తత్త్వాన్ని తెలుసుకోనివ్వకుండా అడ్డు తగిలింది. 'దేవదాసు'లో శరత్‌బాబు బూర్జువా వ్యవస్థ పతనాన్ని చిత్రించాడు. ఆ పార్శ్వం సినిమాలో కనబడదు. నవలా కారుడిగా శరత్‌బాబుతో పోల్చడానికి వొక టాల్‌స్టాయ్ మాత్రమే సరిపోతాడు. టాల్‌స్టాయ్‌తో పోల్చినపుడు శరత్‌బాబుకున్న సృజనాత్మక వైశాల్యం యెంత గొప్పదో, పెద్దదో నిరూపితమవుతుంది.**

శరత్‌బాబు గొప్పతనం ఆయన ప్రసిద్ధ నవలలైన శ్రీకాంత్, చరిత్రహీనులు, శేష ప్రశ్న, గృహ దహనం వంటి వాటిలో మాత్రమే గాకుండా మిగిలిన అన్ని రచనల్లోనూ స్పష్టంగా కనబడుతుంది. ఆయన నవల 'పథేర్ దబి' స్వాతంత్రోద్యమాన్ని గురించిన రచన. 1926లో రాసిన యీ నవలలో శరత్‌బాబు "సవ్యసాచి" అనే మహత్తరమైన స్వాతంత్ర సమరయోధుడ్ని ముఖ్యపాత్రగా రూపొందించాడు. "పథేర్‌దబీ" అనేది (రుజుమార్గం లేదా దారిహక్కు అని అర్థం) భారతదేశానికి స్వాతంత్ర్యం తేవడమే గమ్యంగా యేర్పడిన రహస్య సంస్థ. దాని నాయకుడైన సవ్యసాచి, బాగా చదువుకున్నవాడు... అసాధారణమైన భుజ బలమూ, ధైర్యమూ, తెలివీ తేటలూ వున్నవాడు. వేగంగా పరిగెత్తే నదిని దాటడమూ, హిమాలయాలలో నడుస్తూనే ప్రయాణం చేయగలగడమూ అతనికి పెద్ద పనులు కావు. భారతదేశంలో వుండే కులాల తేడాలంటే అతనికి గిట్టదు. శరత్‌బాబు ఈ నవలలో సమకాలీన భారతదేశంలోని అంటరానితనమూ, సంప్రదాయాలూ, ఆర్థిక అసమానతలూ, స్త్రీల ప్రతిపత్తీ మొదలైన అన్ని విషయాలనూ విమర్శకు పెడతాడు.

యీ నవలను తెలుగులోకి అనువదించిన బొందలపాటి శివరామకృష్ణగారీ తెలుగు అనువాదానికి 'దారిహక్కు' అని గాకుండా 'భారతి' అని పేరు పెట్టారు. భారతి, అపూర్వ బాబుల ప్రణయ వృత్తాంతంతో యీ నవల ప్రారంభం గావడమూ, సవ్యసాచి చాలా పేజీల తర్వాత నవలలోకి ప్రవేశించడమూ అందుకు కారణంగావచ్చు. నవల అపూర్వబాబు రంగూను ప్రయాణంతో ప్రారంభం గావడమూ, తరువాత అతడికి రంగూనులో యెదురైన అనుభవాలూ, క్రమంగా భారతి పరిచయం గావడమూ, యిలా యీ నవలలో మొదట అపూర్వ బాబే ముఖ్యపాత్రగా పరిచయమవుతాడు. చివరి సగంలో అపూర్వబాబు ప్రసక్తి బాగా తగ్గిపోయి, సవ్యసాచీ, అతడి రహస్యోద్యమమూ, స్వాతంత్ర్యోద్యమానికుండే అనేక పార్శ్వాలూ, వాటికి సంబంధించిన చర్చలూ ప్రాముఖ్యత పొందాయి. నవలలోని యీ మార్పు సాధారణ పాఠకులకు యిబ్బందిని కలిగిస్తుంది. నవలాశిల్పంలో అభినివేశమున్న శరత్‌బాబు యిలా రాయడానికి అటువంటి వస్తువును స్వీకరించే నవలలపైన వుండే సెన్సారు ప్రమాదాలే కారణంగావచ్చు. యీ నవల తొలి ముద్రణలో వచ్చిన అయిదువేల ప్రతులూ వారంలో అమ్ముడైపోయాయట. వెంటనే అప్పటి బ్రిటీషు ప్రభుత్వం యీ నవలను నిషేధించింది. అప్పుడు దేశభక్తి తత్పరులైన బెంగాలీ ప్రజలు ఆ నవలను చేతితో రాసుకుని ఆ ప్రతుల్ని దాచుకున్నారట! యీ పుస్తకం పాఠకులను బ్రిటీషు ప్రభుత్వ వ్యతిరేకులుగా మారుస్తోందని కొందరు విమర్శకులు చెప్పినప్పుడు, తానీ నవలను అందుకే రాశానని శరత్‌బాబు విస్పష్టంగా ప్రకటించాడు.

మొదట్లో బ్రిటీషు పాలనకు భయపడి, తమ రహస్య వుద్యమానికి యిబ్బందులు తెచ్చిపెట్టిన అపూర్వబాబు, భారతి ప్రభావంతో క్రమంగా మార్పు చెందుతూ, చివరికి పూర్తిగా వుద్యమంలో మమేకమవడానికి సిద్ధపడతాడు. మొదట్లో రంగూన్లో బోధా కంపెనీలో వుద్యోగంలో చేరినపుడు అతడ్ని విశేషంగా అక్కడి అకౌంటెంటు ఆకర్షిస్తాడు. అతడిపేరు కత్తుల రాందాసు. అతను అపూర్వ బాబుకంటే రెండు మూడేళ్ళు పెద్దవాడు. వొడ్డూ, పొడవూ, బలిష్టమైన శరీరం, పచ్చని పసిమిరంగు, చాలా అందమైనవాడు. పైజమా, లాంగ్ కోటు, తలపాగా ధరించినవాడు. గంధంబొట్టు పెట్టుకున్నవాడు. తెలుగు బ్రాహ్మణుడు. భారతీయులతో యింగ్లీషులో మాట్లాడడం కంటే హిందీలో మాట్లాడడమే అతడికిష్టం. అతను రంగూన్‌లో గాకుండా సుమారు పదిమైళ్ళ దూరంలో వో గ్రామంలో భార్యా కూతుర్లతో వుంటున్నాడు. యింటి చుట్టూ వుండే ఖాళీ స్థలంలో కూర గాయలు పండించుకుంటాడు. అపూర్వబాబులా గాకుండా రామదాసు మంచి ధైర్యవంతుడు. అపూర్వబాబును యిబ్బంది పెట్టిన క్రిష్టియన్ భారతితో "నా పేరు కత్తుల రామదాసు. ఆంధ్ర బ్రాహ్మణుడను. కత్తులు అంటే అర్థమేమిటో మీ బాబును అడిగి తెలుసుకో!" అని గదమాయిస్తాడు. రామదాసు భార్యకూడా సౌజన్యశీలి. "మీ అమ్మగారు గానీ, మరింకెవరైనా ఆత్మీయులుగానీ వచ్చి, మీ ఇంటి వ్యవస్థ నిర్వహించే వరకూ, ఈ చెల్లెలు పంపించే కాస్త మిఠాయీ మీరూ రోజూ తినక తప్పదు" అంటుంది అపూర్వ బాబుతో.

రామదాసు గూడా విప్లవ సంఘంలో సభ్యుడైనాడని తెలిసినప్పుడు అపూర్వబాబు ఆశ్చర్యపోయాడు. "యీ పనులన్నీ అత్యంత ప్రమాద భరితాలు. మీకు తెలుసు గదా! రామ్‌దాస్‌బాబూ! మీకు వివాహమయ్యింది. భార్యా పిల్లలూ! కాపురం నిర్వహించుకోవాలాయె" అంటాడు. వెంటనే రామదాసు "గృహస్థులకు దేశసేవ చేసే అధికారం లేదా? జన్మభూమి మీదేనా? మాది కాదా?" అని నిలదీస్తాడు. పైగా "హిందూ సంఘంలో వివాహం చేసుకోవటం వొకధర్మం. అంతకన్నా మించిన ధర్మం మాతృభూమిని సేవించటం. ఒక ధర్మం మరొక ధర్మానికి ఆటంకమవుతుందని నాకు యేనాడైనా తెలిసివచ్చి వుంటే అసలు పెళ్ళి చేసుకోకుండానే వుండే వాడిని. అంటాడు రామదాసు.

విప్లవ సంఘం ఫైర్ మైదానంలో సమావేశం యేర్పాటు చేసి, అక్కడ ప్రసంగించే పనిని అపూర్వ బాబుకు అప్పగిస్తుంది. తీరా సమయానికి పోలీసులు బలగంతో బాటూ వచ్చి అటకాయించడంతో భయంతో అపూర్వ బాబు నోరు పెగలదు. అప్పుడు రామదాసు మిత్రుడికి బదులుగా తానే వుపన్యాసాన్ని అందుకుంటాడు.

"సోదరులారా! మీకు నేను చాలా విషయాలు చెప్పవలసి వుంది. కానీ యీ పోలీసులు మానోళ్లు కట్టేశారు. ఈ వేట కుక్కలను మీ మీదికి, మా మీదికి వుసి గొల్పింది మీ ఫ్యాక్టరీ యజమానులే. మేము మీ కష్టాలను, అవస్థలను, మీకు తెలియజెప్పడం వారికి సుతరామూ యిష్టం లేదు. వాళ్ళ దృష్టికి మీరు తమయంత్రాలను నడపవలసిన, బరువులు మోయ వలసిన పశువులుగా కనిపిస్తారు. కానీ మీరు కూడా వాళ్ళ వలెనే మనుషులే. వారిలాగే హాయిగా కడుపు నిండా తిని, ఆనందం అనుభవించగల భగవంతుడిచ్చిన ఆ జన్మ సిద్ధమైన హక్కు వుంది. వుందన్న సంగతి మీకు తెలియకుండా వారు తమ శాయశక్తులా దుర్మార్గం వుపయోగించ ప్రయత్నిస్తారు. కనుక ఒక్కసారి మెలకువ తెచ్చుకోవాలి. అలా చేస్తే మీకు యెన్నో దుఃఖాలు వుండవచ్చు. మీరు బీదవాళ్ళే కావచ్చు. మీ సామాన్య మానవ సత్యాలను మీరు అనుభవించకుండా యెవరూ అడ్డగించలేరు" యిలా సాగిపోతుంది అతడి ఉపన్యాసం.

రామదాసు ధోరణిని అర్థం చేసుకోలేని పోలీసులు చీకాకుగా "యింక అయిదు నిముషాలే వుంది. చప్పున ముగించండి" అని హెచ్చరిస్తారు.

"యింకా అయిదు నిముషాల్లే! పైన వొక్క సెకండు గూడా లేదు. ధనస్వాముల మోసపు వలలో చిక్కుకున్న నా సోదరులారా! ఒక్కటే మనవి చేస్తున్నాను. మీరు యెన్నడూ మమ్మల్ని సందేహించకండి. యేదో చదువుకున్న వాళ్ళమనీ, ఘరానా కుటుంబీకులమనీ, కార్ఖానాల్లో కూలీ పని చేసి ఎరగనివారమనీ, మమ్మల్ని అనుమానించి, మీరు కష్టాలు కొని తెచ్చుకోకండి. మిమ్మల్ని గాఢ నిద్రనించీ లేపటానికి ఈ దేశంలో ప్రప్రథమంగా శంఖారావం చేసింది మేమే! ఈ విషయం మీకు తెలిసినా, తెలియక పోయినా ఒక్కటి మాత్రం బాగా గుర్తుంచుకోండి. విప్లవ సమితి మినహా నిజంగా మీ శ్రేయస్సు కోరే సంస్థ దేశంలో మరేదీ లేదు".

కార్మికులకు యీ విషయాల్ని మరింతగా విశదీకరించిన రామదాసు మీ సాధారణ హక్కుల నుంచీ మీరు వంచితులైనారు. అదే మీ కష్టాలన్నిటికీ అసలైన కారణం. వాళ్ళు చెపుతూన్న అబద్ధాన్ని మీరిక నిర్భయంగా ధిక్కరించండి..." అని యెలుగెత్తి చెప్పాడు.

పోలీసులు "ఆపు. అవేం మాటలు? శాంతికి భంగం" అని అరిచారు.

అపూర్వ బాబు రామదాసు చొక్కా పట్టుకుని లాగుతూ "యిక వూరుకో రామదాస్! నా అన్నవాళ్ళు లేని యీ విదేశంలో, నీ భార్యా, పిల్లలూ... ఇక ఆపు" అని గొల్లుమన్నాడు.

రామదాసు యివేవీ పట్టించుకోకుండా "వాళ్ళు వట్టి అన్యాయ పరులు. వాళ్ళు వట్టి పిరికిపందలు. ముమ్మాటికీ మీకు నిజం తెలియనీయరు. కానీ సత్యాన్ని గొంతు పిసికి హత్య చేయలేం... అన్న సంగతి వాళ్ళెరుగరు. సత్యము శాశ్వతమూ, అమరమూ..." అని చెప్పుకు పోతూనే వున్నాడు.

"రాజద్రోహం. రాజద్రోహం." అని అరుస్తూ తెల్ల పోలీసులు గుర్రాలు పైన వచ్చి, దూకుడుగా రామదాసును వేదిక పైన్నుంచి కిందికి లాగి, పోలీస్టేషనుకు లాక్కెళ్ళిపోసాగారు. సోదరులారా! మళ్ళీ మీకు నేను కనిపించనేమో, కానీ మీది కూడా వుత్తమమైన మానవ జన్మ. మీ ఆత్మ గౌరవాన్ని యజమానుల పాదాల వద్ద పణం పెట్టకండి. యీ అత్యా చారాన్నీ అవమానాల్నీ సహించకండి" అనే రామదాసు గొంతు మాత్రం దూరం నుంచీ వినిపిస్తూనే వుంది.

పోలీసులకు భయపడి అపూర్వబాబు సవ్యసాచి చిరునామాను వాళ్ళకు చెప్పి తప్పించుకో జూస్తాడు. కానీ రామదాసు ధైర్యంగా విప్లవ మార్గంలోకి దూసుకెళ్ళిపోతాడు. బోధా కంపెనీ రామదాసును వుద్యోగంలోంచీ తీసేస్తుంది. రామదాసు పూర్తిగా విప్లవ సంఘ కార్యకలాపాల్లోకి దిగిపోతాడు. చివరకు పోలీసులకు పట్టుబడతాడు. గాయాలు తగిలి, నెత్తురోడుకుంటూ ఆస్పత్రి పాలవుతాడు. అతని భార్య పిల్లలతో బాటూ వో బ్రాహ్మణుడి యింట్లో తలదాచుకుంటుంది.

పరిపాలకుల కారాగారంలో రామదాసు చనిపోవడమే తటస్థించితే పరలోకం నుంచీ అతడు తన భార్యా బిడ్డలు బిచ్చమెత్తుకుంటూ వుండడం చూసి కన్నీళ్ళు తప్పకుండా విడుస్తాడు... తన దేశీయులకు విరుద్ధంగా భగవంతుడి ముందు నిందారోపణ యేమీ చేయడు..." అంటాడు డాక్టరు సవ్యసాచి.

దేశ స్వాతంత్ర్యం కోసం హింసా మార్గంలో పోరాడ్డం హేతు బద్ధంగా లేదనీ, కొందరు దుర్మార్గులైన తెల్లదొరలకారణంగా మొత్తం క్రైస్తవ మతాన్నంతా ద్వేషించడం తప్పనీ, తూర్పు పడమరలు రెండూ స్నేహంగా దగ్గరవడమే ముఖ్యమనీ డాక్టరు సవ్యసాచితో వాదిస్తుంది భారతి. క్రమంగా మారి ధైర్యాన్ని తెచ్చుకోగలిగిన అపూర్వబాబు భారతదేశం వంటి దేశంలో కార్మికులకోసం కంటే కర్షకుల కోసం పోరాడ్డమే ముఖ్యమని గ్రహిస్తాడు. వాళ్ళిద్దరి వాదనల్ని వొప్పుకుంటూనే సవ్యసాచి "దేశ స్వాతంత్రమన్నదొక్కటే తన గమ్యమనీ, దానికోసం తన ప్రాణాల నయినా యెప్పుడైనా యివ్వడానికి సిద్ధమే"నని తేల్చి చెబుతాడు.

1926లో రాసిన యీ నవల యింకా స్వాతంత్ర్య పోరాటం సాగుతూ వుండగానే ముగుస్తుంది. సామాజిక బాధ్యతల నేపథ్యంలో వ్యక్తిగత సంబంధాలు యెలా వున్నాయో, వుండాలో చూపెట్టడంలోనే శరత్‌బాబు దార్శనికత బోధపడుతుంది.

భారతదేశ స్వాతంత్ర్యోద్యమాన్ని చిత్రించిన యీ మహత్తరమైన నవలలో కత్తుల రామదాసు అనే తెలుగు పాత్ర అపురూపంగా వెలిగిపోతూ, పాఠకుల్ని వెన్నాడుతూనే వుంటుంది.

పొరుగు తెలుగు

# కన్నడ తోటలో విరిసిన తెలుగుపాట!



'సంచారి' హాళె దరోజి ఈరమ్మ

నేటి కర్ణాటక రాష్ట్రంలో వున్న తెలుగు ప్రాంతం బళ్ళారి జిల్లా – సండూరు తాలూకా హాళెదరోజి (పాత దరోజి) గ్రామానికి చెందిన బుర్రకథ ఈరమ్మ 2014లో మరణించింది. అప్పటికామెకు 84 ఏళ్లు. అక్షరాలు దిద్దుకోనందున ఆమెను నిరక్షరాస్యురాలిగా లెక్కించాలి. సంతకం చేయడం మాత్రమే ఆమె నేర్చుకొంది. అయితే కేవలం తన జ్ఞాపకశక్తితో నాలుగు లక్షల పంక్తులు గల 12 జానపద కావ్యాలను తన నాలుకపై నాట్యమాడిస్తుంది. ఏరంగంలోనైనా ఎంతో కృషిచేసి ప్రఖ్యాతులైనవారికి ఇచ్చే 'నాడోజ' ప్రశస్తి (డి.లిట్ తో సమానం) ని హంపీలోని కన్నడ విశ్వవిద్యాలయం ఎప్పుడో ఆమెకు ఇచ్చి గౌరవించింది.

కర్ణాటకలో బుర్రకథను ప్రదర్శించే అనేక బృందాలున్నాయి. వారంతా తెలుగులోనే ప్రదర్శిస్తారు. ఈరమ్మ తెలుగు సంచార కులానికు చెందిన వ్యక్తి. ఇంట్లో తెలుగులోనే మాట్లాడు కుంటారు. అయినా ఈమె కావ్యగానం కన్నడలోనే. తెలుగు, బడుగ, హిందీ భాషల్లోనూ కథలు చెప్పగలరట. ఎన్నో పురస్కారాలను అందుకొంది. బుడగజంగాలనే సంచార కుల సముదాయానికి చెందిన ఈరమ్మ పేదరికంతోనే పుట్టి పెరిగింది. జీవితమంతా వ్యధా పూరితం. అయినా బుర్రకథ కళాకారిణిగా ఉన్నత స్థానానికి ఎదిగింది. ఈమె ఆత్మకథని కన్నడంలో అక్షరబద్ధం చేసిన డా॥నింగప్ప ముదేనూరు రచనను శ్రీ రంగనాథ రామచంద్రరావు – ప్రత్యేకంగా 'అమ్మనుడి' కోసం తెలుగులోకి అనువదించి ఇచ్చారు. కొద్ది నెలలపాటు వరుసగా ఈ కథనాన్ని ప్రచురిస్తాము. – సంపాదకుడు

# బుర్రకథ ఈరమ్మ–సంచారి ఆత్మకథ

**కన్నడ మూలం**
డా. నింగప్ప ముదేనూరు

**అనువాదం**
రంగనాథ రామచంద్రరావు

## ముందుమాట




ఆదిమ జాతులలో వేటగాళ్ళయిన కొన్ని జన సమూహాలు కాలక్రమంలో ఎన్నో మార్పులకులోనై పదిపన్నెండవ నూరేడు (శతాబ్దం) వచ్చేసరికి బుడగ జంగములుగా కనిపించి ఉండాలి. అది శైవమతం ప్రభావ వంతంగా ఉన్న కాలం. అప్పటి మతం మరియు ప్రభుత్వాలు రెండింటివల్ల ప్రభావితమైన వీరులు ఎందరో ఉన్నారు. చాలావరకు ఆ కాలంలో రూపొందిన సాహిత్యం, కళలన్నీ 'వీరచరిత్ర'ల్లాగే కనిపిస్తాయి. ఇది కర్ణాటకాంధ్రలో మాత్రమే కాదు. దేశంలోని కాశ్మీరం మొదలు దక్షిణంలోని అనేక ప్రాంతాలవరకూ ఈ శైవం ప్రభావం ఉంది.

కర్ణాటకలోని హాళె దరోజి గ్రామంలో ఉంటున్న బుర్రకథ ఈరమ్మ కన్నడలో గానం చేసిన్న మహాకావ్యాలకు మూలం తెలుగు కావ్యాలు. ఈ మహాకావ్యాలు తెలుగు మూలంలోని వీరపరంపరల్లోనే కనిపించటం వల్ల వారికి చెందిన వీరగాథల ముఖ్యమైన విషయాలను ఇక్కడ తెలుసుకోవలసి ఉంది. ఈ విధంగా తెలుగు జానపదగాయకులు కన్నడ జానపదగాయకులుగా–భాషాపరంగానూ, సాంస్కృతికంగానూ కనిపించటం–ఈరమ్మ, ఈరమ్మ తల్లితండ్రులు, అవ్వా–తాతల వల్ల తెలుస్తోంది. ఈరమ్మ తండ్రి, తాత, అవ్వ, తల్లి ఇప్పుడు లేకపోయినప్పటికీ వారి జ్ఞాపకాలతోనే ఈరమ్మ మహాకావ్యాలగనిగా ఎదిగింది. కన్నడలో ఇలా ఎదగటానికి కారణమైన ఆంధ్రలోని సాహిత్య, సాంస్కృతిక పరిసరాలను ఇక్కడ అర్థం చేసుకోవాలి. ఆ మూలకంగా నిజమైన సంచారులకు దేశంలోని సమస్త సరిహద్దులకు గోడలు లేకుండా ఉంచడం సంస్కృతి పరంగా ఆరోగ్యకరం. ఇలాంటప్పుడు మన ప్రాంతం, దేశం, ప్రపంచం తన రాజకీయ సరిహద్దులను అధిగమించవలసి ఉంది. మనం అధ్యయనం చేసేటటువంటి ఈ విధమైన సముదాయాలు సరిహద్దులను మనస్సులోకి తెచ్చుకోక, సరిహద్దులు లేని బతుకునే ఇక్కడ చూపిస్తూ వచ్చాయి.

ఆంధ్ర ద్వారా కన్నడనాడులో కనిపించిన ఈ బుడగ జంగాల సముదాయం తన బతుకు తెరువుకోసం బహురూపిపైన కళలను వృత్తిగా అలవరుచుకుంది. ఈ కారణంగా వారిని ప్రజలు వేషగార్లు, కథలు చెప్పేవాళ్ళు (బుర్రకథ మొదలైనవి), గంగమ్మవాళ్ళు, బాలసంతులు, వేషగారపట్టి (వ్యవసాయం చేసేవాళ్ళు), వాయిద్యాలు వాయించేవాళ్ళు, వ్యాపారం చేసేవాళ్ళు అని- ఇలా వాళ్ళ బహురూపాలకు తగినట్టు పిలిచే అలవాటు చేసుకోవటం సహజంగానే ఉంది.

ఆంధ్రలోని వీర ప్రధానమైన సాహిత్య కాలంలో ఈ జంగమలు వీరప్రధానమైన కథనాలను గానం చేస్తూ వచ్చారు.

ఈ కథా ప్రధానమైన పాటలకు సహకారంగా ఉపయోగించే గుమ్మెట (గుమట)లను తెలుగునాడులోని పలు ప్రాంతాలలో గుమ్మెతలు, బుడిగెలు, బుర్రలు, డక్కీలు, డక్కిలు అని పిలుస్తారు. ముఖ్యంగా తెలంగాణలో గుమ్మెటను 'బుడిగె' అంటారు. బుడిగెలను ఉపయోగించే జనాన్ని బుడిగె జంగాలు లేదా బుడగ జంగాలు అంటారు. వీళ్ళే కన్నడ ప్రాంతాల్లో కూడా బుడగ జంగాలుగానే పిలువబడుతున్నారు. కాలగమనంలో బుడగ జంగములుగా అనుబంధ జాతి పట్టికలో కనిపిస్తున్నారు.

**బుర్రకథకు సంబంధించిన విషయాలు**

తెలుగులో అధికంగా ప్రజాభిమానం పొందిన కళా ప్రక్రియ ఇది. కన్నడ ప్రాంతంలో యక్షగానం, బయలాటలు మాదిరిగానే బుర్రకథ అక్కడి ప్రజల ఇంటి మాట అయిపోయింది. తెలుగు ప్రభావం ఎక్కువగా ఉన్న కర్ణాటకలోని బళ్ళారి, రాయచూరు, చిత్రదుర్గ, కోలారు, తుమకూరు జిల్లాలలో ఈ బుర్రకథ చెప్పే వారు ఎక్కువగా కనిపిస్తారు. వీళ్ళు తెలుగు, కన్నడ, బుడగ, హిందీ భాషలలో కథలు చెబుతారు. ఈ జనాంగానికి బుర్రకథే ప్రధానమైన వృత్తి. ప్రజలకు ప్రాంతీయ వీరుల పరిచయం, రాజుల చరిత్రను, సంస్కృతులను పరిచయం చేయడం వీరి ఉద్దేశ్యం. అంతే కాకుండా రైతులు, తదితర శ్రామికవర్గ జీవుల మనస్సును సంతోష పరచడమూ, వారి పండుగలు, పబ్బాలు, పెళ్ళి, వడుగు, సంస్కార కార్యాలలో పాల్గొనడమూ వీరి కాయకం.

ఆరంభంలో ఈ కళ కూడా మత ప్రచారానికే ఉపయోగించి వుండొచ్చు. ఈ మధ్యన మన ఎన్నో జానపద కళలు రాజకీయ ఎన్నికల ప్రచారానికి ఉపయోగపడినట్టు ధార్మిక కార్యకలాపాలకూ ఇవి ఉపయోగపడ్డాయి. క్రైస్తవమత ప్రచారకులు తెలంగాణకు వచ్చినపుడు ఈ కళ పట్ల ప్రజల అభిమానాన్ని గుర్తించి తమ మతప్రచారానికి స్థానికమైన ఈ కళనే వాడుకున్నట్టు తెలుస్తోంది. ఈ మతంలోని గొప్పవ్యక్తుల జీవితకథలను 'బుర్రకథల' రూపంలో రాయించి ప్రదర్శించారని తెలుస్తోంది. శ్రీ గోరా ప్రేమయ్యగారి 'సాధు సుందర సింగ్', 'యోహాను శిరచ్ఛేదనము' కథలు ఈ అభిప్రాయాన్ని బలపరుస్తున్నాయి.

సామాన్యంగా బుర్రకథలో ముగ్గురు వ్యక్తులు పాల్గొంటారు. వాళ్ళు మగవాళ్ళుకానీ ఆడవాళ్ళుకానీ ఎవరైనా కావచ్చు.

ఈరమ్మ బుర్రకథా ప్రదర్శనలోనూ అశ్వి పార్వతమ్మ, అశ్వి శివమ్మ అనే నేపథ్య గాయకురాళ్లు ఉండేవారు. వీళ్ళ కథాగానానికి తగినట్టు నేపథ్య వాయిద్యాలను (గుమ్మటె, గగ్గరి, దుమకి) వాయించేవారు. ప్రధాన గాయకురాలైన ఈరమ్మలాంటి గాయకురాలు లేదా గాయకుడు తంబురతోపాటు, వేలికి గగ్గరిని యిరికించుకుని ఏక కాలంలో 'గగ్గరి', తంబూరాలను మీటుతూ కథ చెబుతారు. ఇక్కడ కథ చెప్పడమంటే కథనాన్ని గద్య-పద్యాలుగా పాడుతారని అర్థం చేసుకోవాలి. ఇది బుర్రకథ పరంపరలోని ప్రత్యేకతను తెలియజేస్తుంది. ఇక్కడ పాటతోపాటు అప్పుడప్పుడు అభినయమూ నర్తనమూ కలిసివుంటాయి. కథనగీతాలకు తగిన విధంగా ప్రత్యేకమైన లయను అది విరజిమ్ముతుంది.

కథ చెప్పేవారు మగవాళ్ళయితే పంచె, అంగీ, పాగా ధరించి కాళ్ళకు గజ్జెలు కట్టుకుని అందరికన్నా ముందుగా నిలబడివుంటాడు. ఇతడి కుడిఎడమల్లో సహాయకులు సాధారణ దుస్తులను ధరించి కాళ్ళకు గజ్జెలు కట్టుకుని బుర్ర వాయిద్యాలను వాయిస్తూ కథకుడితోపాటు కథానర్తనంలో భాగం వహిస్తారు. 'తందాన తానా' మొదలైన పల్లవిలతో తాళానికి తగినట్టు వాయిద్య, నర్తనలు ఇక్కడ సాగుతాయి. కథ చెప్పేవారు ఆడవాళ్ళయితే జుట్టు ముడివేసుకుని, చేతిలో తంబూరను పట్టుకుని కాళ్ళకు గజ్జెలు కట్టుకుని కథ చెబుతూ నర్తిస్తారు. సహకళాకారులు కూడా కథలోని లయకు తగినట్టు నర్తిస్తారు.

ఈరమ్మ మొదట్లో బుర్రకథ చెబుతూ లయబద్ధముగా అడుగులు వేసేది. అయితే రానురానూ ఆమె దేహాన్ని వృద్ధాప్యం కమ్ముకోవటం వల్ల కూర్చునే వాయిద్యాల సహకారంతో కథలను ప్రారంభిస్తుంది. ఆమె చెప్పే కథలు ఒక్కో క్కసారి నిరాటంకంగా రెండు పగళ్ళు, రెండు రాత్రిళ్ళు సాగేవి. ఆ కారణంగా నిద్రచెడి, దేహం అలసినా ప్రజల సంతోషాన్ని గుర్తుకు తెచ్చుకుని పాడటమే నిత్య కాయకమైపోయింది.

ప్రతి ఒక్క బుర్రకథ ప్రారంభంలో కథకులు వరుసగా నిలబడి తమ కులదేవతలను, చుట్టుపక్కలున్న గ్రామాల దేవతలను, కథలో వచ్చే ముఖ్యమైన నాయకుడిని, భూమాతను స్మరించి తమ కథలను ప్రారంభిస్తారు. ఈ ప్రార్థన తమకూ, కథ ఆశయానికీ, ఊరిలో వర్షానికీ, పంటలకు, ప్రజల యోగక్షేమాలకూ అన్వయించడం జరుగుతుంది. తరువాతే ప్రధాన కథకుడు లేదా కథకురాలు తాను చెప్పబోతున్న కథ గొప్పదనాన్ని గానంతో వివరిస్తారు.

'బుర్రకథ' శైలి ఒక విధంగా 'హరికథ'ను గుర్తు చేసినా 'హరికథ'లో కనిపించే పురాణంల్లోని క్లిష్టతలు, అలౌకికమైన విషయాలు, నాటకీయ సన్నివేశాలు ఇక్కడ అంతగా కనిపించవు. ఇక్కడి పాత్రలు సంపూర్ణమైన చైతన్యంతో మానవ రూపంలో మాట్లాడుతాయి. జరిగిపోయిన సంఘటనలు భౌగోళిక వివరాలై స్థానిక చరిత్ర యొక్క మౌఖిక ఇతిహాసంగా రూపొందుతాయి..

మనలోని చాలామంది మౌఖిక కథకులు కింది సముదాయంవారే కావటం వల్ల వాళ్ళను ఊరిలోని అన్ని వర్గాల ప్రజలు పండుగలు-పబ్బాలు, పెళ్ళి-వడుగు వంటి సంబరాలకు తాంబూలం ఇచ్చి ఆహ్వానిస్తారు. ఈ కళా ప్రదర్శన జరిగిన తరువాత వారికి నిర్ణయించబడిన సంభావన (ఇనాము), ధాన్యం-గింజలు, ఆవు-దూడలను ఇచ్చి తృప్తి చెందుతారు.

ఇదే 'వీరగాథ' పరంపర ఆంధ్రలో మొదటి నుంచీ అభివృద్ధి చెందుతూ వచ్చింది. సాంస్కృతికంగా తలకిందులైన ఈ సంచార సముదాయాలు కర్ణాటకకు ఆంధ్రనుంచే వలస రావటం ఈరమ్మ వంశీకుల నుంచే చూడవచ్చు. కర్ణాటకలోని అనేక జిల్లాలలోకి వలస వచ్చిన ఈ విధమైన సంచార సముదాయాలు చాలా ఉన్నాయి. అంతేకాకుండా ఈ విధమైన పరంపరను అవి కాపాడుకుంటూ వచ్చాయి. ఇలాంటి పరంపరలను అర్థం చేసుకునేటప్పుడు మనం తప్పనిసరిగా వాటి మూలాలలోకి వెళ్లాలి. బుర్రకథ నేపథ్యంలో ఆంధ్రలోని సాహిత్య,

సాంస్కృతిక సందర్భాల ముఖ్యమైన ఎదుగుదలను ఇక్కడ నమోదు చేయాలి.

శైవమతం ప్రభావంతో సాహిత్యరచన సాగుతున్న ఆంధ్రలో 'వీరగాథ'లదే పెద్దశాఖ. ఈ శైవ కథలు ఎక్కువగా 'ద్విపద'లలోనే కనిపిస్తాయి. కథన గీతాలు కూడా ఇవే వరుసలో అభివృద్ధి చెందాయి. జానపద వీరగాథలకు ద్విపదలు తగిన ఛందస్సు అని వీళ్ళు గుర్తించారు. ప్రాచీనమనిపించిన 'పల్నాటి చరిత్ర' దీనికొక ఉదాహరణ మాత్రమే. పన్నెండవ శతాబ్ద కాలంలో కృష్ణాగోదావరి మధ్యనున్న ప్రదేశంలో శైవవైష్ణవుల మధ్యన ఘర్షణ ఏర్పడింది. ఇది పల్నాడు యుద్ధానికి కారణమైంది. ఈ పల్నాడునే కేంద్రంగా చేసుకుని ప్రజలు మతసంబంధమైన 'పల్నాడు చరిత్ర' అనే జానపద కావ్యాన్ని అల్లుకోవడానికి కారణమైంది. ఇది ఆంధ్ర జానపదుల్లో దొరికిన మొదటి కావ్యమై వుండొచ్చని విద్వాంసులు ఊహిస్తున్నారు.

అయితే శ్రీనాథుడి కాలంలో కొన్ని వీరచరిత్రలు ఉన్నాయనటానికి 'కదిరి బాలన చరిత్రె' ను ఉదాహరిస్తారు. మొదట జైనులై ఉన్న కాకతీయ రాజులు అటుతరువాత వీరశైవులు అయ్యారు. వీరశైవంతోపాటు పెరిగిన ఆస్తికతతో అన్ని రకాల ఆస్తికతలూ తలెత్తటంవల్ల మాహూరమ్మన కథె, మాతెయ పురాణ, గౌతమ పురాణ, ఆలదమరగళ కథె, కాకతమ్మన కథె, రేణుకా యుద్ధ, అంకమ్మన కథె, గంగమ్మన కథె, మాతంగి కథె, మొదలైనవి కనిపిస్తున్నాయి. వీటిల్లో కొన్ని కథలు ఓరుగల్లు ప్రశంసలను కలిగివున్నాయి. బుర్రకథా దరోజి ఈరమ్మ గానం చేసిన 'కుమార రామ' మరియు 'కృష్ణ గొల్లర' కావ్యాలలోనూ ఓరుగల్లు ప్రస్తావన వస్తుంది. ఓరుగల్లు కాకతీయుల రాజధాని కావటమేకాకుండా అది ఈ విధమైన మతాల సాంస్కృతిక కేంద్రమూ అయివుండేదని ఈ కథన కావ్యాల వల్ల తెలుస్తుంది. ఇదే సమయంలో దక్షిణంలోని గణపతిదేవుని సమకాలీనుడైన నలమసిద్ధకు, కాటమరాజుకు మధ్య పాలేరు నది ఒడ్డున పంచలింగాల దగ్గర యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో మనుమసిద్ధి చనిపోయాడు. కాటమరాజు విజయం సాధించాడు. విజయం సాధించిన కాటమరాజు కథకూడా జానపద వీరగాథగా అభివృద్ధి చెందింది.

ఈ విధమైన మతసంబంధమైన కాలావధిలో వచ్చిన తెలుగులోని వీరగాథలు రానురానూ వీరగాథా వాఙ్మయపు కల్పనలుగా కనిపించటాన్ని టి.వి.వెంకటాచలశాస్త్రిగారు తమ 'సాహిత్య మంథన' అనే గ్రంథంలో వివరించారు. ఈ వివరణ జానపద మహాకావ్యాలను, ముఖ్యంగా రచన, వస్తువును దృష్టిలో పెట్టుకుని చూసేలా ప్రేరేపిస్తుంది. క్రీ.శ. 13వ శతాబ్దం తరువాత ఆనెగొందిని పరిపాలించిన కంపిలి రాజు కుమారుడిని, 'కుమార రామ' అని మన చరిత్ర, జానపద సాహిత్యాలు పేర్కొంటూ వచ్చాయి. ఇది కల్పితమైన పేరు. అతని నిజమైన పేరు 'కుమార నాథ'..

వాళ్ళు ఇచ్చే ముఖ్యమైన వివరాలు ఇలా ఉన్నాయి...

"... ఇన్ని కథలు వచ్చే సమయానికి ఈ వీర కథావాఙ్మయం కల్పనలను కూడా అల్లడం నేర్చుకుంది. క్రీ.శ. 1300 తరువాత ఆనెగొందిని పాలించిన కంపిలిరాజు కుమారుడు కుమారనాథుడు. అతను గొప్ప శౌర్యవంతుడు. తండ్రితో కలిసి ఢిల్లీ సుల్తానుతో జరిగిన యుద్ధంలో హతుడవుతాడు. ఇతని కథకు కల్పనలు తోడై అది 'కుమార రామ' కథగా మారింది. దీని ఛందస్సు అప్పటి వరకు వాడుతున్న ద్విపద కాదు. ఈ కథ ప్రారంభంలోనే ఇది కల్పిత కథ అని తెలుస్తుంది. గారడీ కథలు జానపద కథల్లో ప్రవేశించటం ఇదే కాలంలోనే. కాకతీయుల తరువాత తెలుగునాడును పాలించిన ఒడ్డె రాజులతో వారి కథా ప్రభావమేదైనా ఈ గాథలలో కనిపించివుండవచ్చునేమో? క్రీ.శ. 12వ శతాబ్దం గడిచిన తరువాత బహుశా అహోబిలం, కదిరి, మంగళగిరిలలో నరసింహస్వాముల ప్రతిష్ఠ జరిగివుండాలి. అహోబిల నరసింహుడి కథే బహుశా 'వరాహావతార' అనే పేరిట "తకిట తకిట తక కిటతక కిటతక" అనే గతిలో సాగే రచనగా రూపుదాల్చింది. దీని రచన 'తుపాకి' వచ్చిన ఈ మధ్య కాలానిదే అయినప్పటికీ వస్తువు మాత్రం శైవ వైష్ణవ మతాలు సామరస్యంగా ఉన్న కాలానిదే. బంగారు తిమ్మరాజు కథ పెనుగొండ రాజుల కాలపు బొబ్బిలి కథా ధాటిలో ఉన్నది. చిన్నమ్మ కథ అనే తందాన కథ కూడా శైవ వైష్ణవ సమన్వయమైన విజయనగర కాలానికి చెందింది. చెంగల్వరాజు దీని కర్త. బొబ్బిలి కథ కూడా ఇదే వరుసలోనిది. దీని అనుసరించి వచ్చినదే జంగం సుబ్బయ్యదేవ రాసిన 'కాంభోజరాజ కథ'. పులికంటి వీరయ్య 'లక్ష్మమ్మ కథ' తందాన పదాల ధాటిలో ఉంది. శ్రుతిముఖంగా విస్తారమైన ఈ కథనాలు 1890-1910 మధ్య కాలంలో ప్రసిద్ధి చెందేటంతగా ఎక్కువగా అచ్చయ్యాయి"

ఈ విధమైన వీరగాథల పరంపర ఒకటి ఆంధ్రదేశంలో లిఖిత రూపంలోనే అధికంగా కనిపించింది. అది పురాణాలు మరియు చరిత్రల ప్రభావాల వల్ల రూపు దిద్దుకున్నాయనే విషయం ఇక్కడ తేటతెల్లమవుతూ ఉంది. ఆంధ్ర జానపద సాహిత్యం కూడా లిఖిత పురాణం, చరిత్ర మరియు సమకాలీన జీవితాన్ని చిత్రించి, ప్రచారం చేసే సంచార గాయక వర్గాన్ని రూపొందించింది. లేదా బుడగ జంగములవంటి ఆదిమ కులాలు నిరంతరం సంచారులు కావటం వల్ల ఈ విధమైన చరిత్రలను తన సముదాయపు మౌఖిక శాసనాలన్నట్టు విస్తరింటానికి కారణమైంది. ఇలాంటి వృత్తిపరులకు ఒక కాలంలో రాజుల, ప్రజల గౌరవమర్యాదలు దక్కివుండాలి.

ఈ విధమైన వీరవంశాల గొప్పదనాలను సముదాయాలు ఎంతో జాగ్రత్తగా, గోప్యంగా కాపాడుకుంటూ వచ్చాయి. అందులో యుద్ధాలు, ఆచరణలు, మహత్తులు, మాంత్రికతల వెనుక జిడ్డుపట్టిన వర్గసమాజపు కల్పనలను బ్రద్దలుకొట్టే శక్తిని అప్పుడప్పుడు అది ప్రదర్శిస్తుంటుంది. శిష్ట మహాకావ్యాలు లౌకికమైన విషయాలను అలౌకికం చేసి, స్వర్గనరకాలను ఆశ్రయిస్తే, జానపదులు సృష్టించే మహాకావ్యాలు అలౌకిక కల్పనలను బ్రద్దలుకొట్టి వాటిని సామాజికరించుకుని లౌకికం (వాస్తవం) చేస్తాయి. లౌకికం చేసుకోవటమంటే తనదిగా చేసుకోవటమనే అర్థం. ఉదాహరణకు జుంజప్ప కావ్యంలోని సిత్తయ్యకు శివపార్వతులు కనిపించే విధానం, దాన్ని కథకులు కనిపింపజేసే తీరు సాంస్కృతికంగా సాటిలేనిది. ఇక్కడ శివపార్వతులు భోజనం చేసి తాంబూలం సేవిస్తూ ఉల్లాసంగా కూర్చున్నారనే కల్పన మన జానపదుల జీవితంలోని సహజమైన అభివ్యక్తి. శివపార్వతులను మానవ జీవితానికి తెచ్చుకునే తీరు జానపదుల లోకదృష్టిని తెలియజేస్తుంది. ఇలాంటి లోకదృష్టిని మహాకావ్యాల ద్వారా చిత్రించే జానపద గురు సంప్రదాయంలోని సంచార గాయకులు ప్రాంతమంతటా ఉన్నారు.

ఈ విధమైన లోకసంచార గాయకులను ఆంధ్రప్రదేశ్‌లో సంచార గాయకులనీ, భిక్షుక వర్గమనీ పిలుస్తారు. వీరు నిరంతరం సంచార గాయకులు కావటం వల్ల అధికంగా కథన గీతాలనే ఆలపిస్తారు. ఈ విధమైన కథాత్మకమైన ఆదిజానపద గీతాలను తెలుగులో 'పల్లెపాటలు' అంటారు.

పల్నాటి వీరుల కథలు, కాటమరాజు కథలు, బొబ్బిలి నాగిరెడ్డి కథ, దేసింగు రాజు కథ, బాలనాగమ్మ కథ, ఆదోని లక్ష్మమ్మ కథ మొదలైనవి వీరగాథలకు చక్కటి ఉదాహరణలు. మన ఈ హళె(పాత)దరోజి ఈరమ్మ గానం చేసే కథనకావ్యాలు పైన పేర్కొన్నవే.

ఈ వీరగాథలను దేశంలోనే కాక మొత్తం ప్రపంచమంతటా గానం చేసే జానపద భిక్షుక వర్గమొకటి (భిక్షుక- ఇక్కడ గౌరవ సూచకంగా వాడాను. అది దైవ సూచకమైన పదంగా భావించాను) నిరంతరం సంచరిస్తూ ఉంటుంది. మనం వీరిని జానపద వృత్తి గాయకులని (డా. జీశంప), జానపద గురువర్గమనీ (ఎస్.ఎస్. హీరేమఠ) సాంస్కృతిక ప్రచారకులనీ (మొగల్లి గణేశ్) పిలుస్తారు. తెలుగులో వీరిని 'గాథాకారులు' అంటారు. పాశ్చాత్య జగత్తులో బ్యాలెడ్స్ పాడే ఇలాంటివారిని Minstrets అంటారు. Minstrets అంటే ఫ్రాన్స్‌లో Jongleurs, ఐర్లాండ్‌లో Bards, స్కాండినేవియాలో Skalds, జర్మనీలో Minne Singers, స్పెయిన్‌లో Troubandours అని పిలుస్తారు. ఆరేబియాలో గాథాకారులను 'చారణులు' అంటారు. దేశదేశాలలో సంచరించే కారణంగా వీరికి ఆయా ప్రాదేశిక పేర్లు వచ్చివుండొచ్చు.

వీరగాథలకు పుట్టిల్లు అని పేరుపొందిన రాజస్థాన్‌లో వీళ్ళను 'బోపా', 'మిరోసి'లని అంటారు. వీళ్ళు 'రావణహస్త' అనే వాయిద్య సహకారంతో వీరగాథలను గానం చేస్తారు. మధ్యప్రదేశ్‌లో రావత్ వర్ణస్థులు ఇటాంటి వీరగాథలను గానం చేస్తే, ఉత్తరంలో హరబోలీలు ఈ కథనగేయాలను పాడుతారు. తెలుగులో 'జంగములు' అనే ఒక సముదాయమూ దేశసంచారం చేసే ఈ వీరగాథకులనే గుర్తుచేస్తుంది. కర్ణాటకలో 'లావణికారులు' అనే జానపద గాయకులు ఉన్నట్టే తెలుగులో 'జంగములు' అనే గాయకులు ఉన్నారు. వీరికి ఇంతకు ముందు తెలియజేసినట్టు బుడగ (బుర్ర) అనే వాయిద్యాన్ని వాయించడం వల్ల బుర్రకథా గాయకులని పేరు వచ్చింది. వీరికి బుడగ జంగాల లేదా అడవి గాయకులు అనే మూలనామం ఉండేది. కాలక్రమంలో బుడగ జంగమగా మారటం వీరు అధికంగా శైవారాధనలో కనిపించడం వల్ల కావచ్చు. శైవపురాణాలు, రామాయణం, మహాభారతం కథనాలను పునర్ అభినయించే జంగాలులలోని ఒక వర్గం వేషగారుల వృత్తిని చేపట్టినపుడు వారిపై ఊరి జంగమల, పల్లె సంస్కృతి ప్రభావం పడివుండాలి. సహజంగానే భిక్ష, దానం, ధర్మాలను వీరు ఆశ్రయించిన కారణంగా 'జంగమ' రూపంగా కనిపించివుండొచ్చు.

సూక్ష్మంగా గమనించినపుడు తెలుగులో శక్తి కథలను, పల్నాటి వీరచరిత్రలను, కాటమరాజు, దేసింగ్‌రాజు, నాగిరెడ్డి కథలను జంగములు ఆలపించరు. వీటిని పాడేవాళ్ళు 'బుడగ జంగాలు' లేదా 'బుడగ జంగములు' మాత్రమే.

'జంగమ' అనగానే మనకు భారతదేశంలోని పల్లెలలోని వర్గ, వర్ణ, కులాల సంకీర్ణ స్థితి గుర్తుకురావచ్చు. ఈ మధ్యన బుడ్గ జంగాలు పల్లెల్లో మారుతున్న ఆధునిక పద్ధతికి, పట్టణ విద్యా సందర్భాలకూ సర్దుకుపోతున్న కారణంగా వారిని అనుబంధ జాతివారిగా గుర్తించడం జరిగింది. ఇది బుడగ జంగాలు అడవి నుంచి ఊరుకు విస్తరించిన సముదాయపు జీవన దశను తెలియజేస్తుంది.

భూస్వామ్య రాజ్య వ్యవస్థలో రాజు శౌర్యం, సాహసం, పరాక్రమం, గౌరవాలను స్తుతించడానికి 'వందిమాగధులు', 'భట్టులు', 'కవిపండితులు' ఉన్నట్లు; వీళ్ళు రాజులను స్తుతిస్తూ చేసిన రచనలను గానం చేసే ఒక గాయక వర్గమే నిర్మాణమైంది. ఈ వర్గం రాజుగారి లిఖిత స్తుతులను నేర్చుకుని, వాటిని కంఠస్థం చేసి సామ్రాజ్యమంతటా విస్తరింపజేసే ఒక ఆజ్ఞను పొంది వుండాలి. లేదా రాజాస్థానాలలో ఆశ్రయం పొందినవారే వీటిని మరొక రీతిలో అభివృద్ధిపరిచివుండాలి. బహుశా ఇలాంటి వీరచరిత్రలే మన జానపదుల నోట కాలాంతరంలో వీరగాథలుగా, చారిత్రాత్మక లావణులుగా అభివృద్ధి చెందివుండాలి.

ఇది రాజులు, రాజ్యాలు ఉన్న కాలానికి సంబంధించినది. భారతంలో ప్రజాప్రభుత్వపు రాజకీయ వ్యవస్థ తలెత్తిన తరువాత ఈ గాయకులు/ కథనకారులు రాజాస్థానాలను వదిలి పరంపర యొక్క కొనసాగింపుగా పూర్వపు రాజకులాల చరిత్రను (సాంస్కృతిక వీరుల చరిత్రను) గానం చేయటం మొదలుపెట్టారు. ఇప్పటి మన వర్ణ వ్యవస్థలో ప్రతి ఒక జన సముదాయానికీ, వారి కులాల మూల దేవతలకూ ఒక్కొక్క ఆరాధనా కులదైవ పంథాలున్నాయి. అందులో కులదేవతల భక్తుల, సేవకులైన నిష్ఠావంతుల వర్గమొకటి 'గురుభక్తులు' లేదా 'గురుపరంపర' అన్నట్టు అభివృద్ధి చెందింది. మైలారు యొక్క గ్వారప్ప-గ్వారమ్మలు(గురప్పలు-గుర్రమ్మలు), జుంజప్ప గెణెకారులు (గాయకులు), మాదేశ్వరుని కంసాళెలు ( పెద్దపెద్ద తాళాలు వాయిస్తూ గానం చేసేవాళ్ళు), మంటెస్వామియొక్క నీలగారులు (వృత్తిగాయకులు), ఎల్లమ్మ యొక్క జోగమ్మలు, జోగప్పలు, తిరుపతి తిమ్మప్ప యొక్క దాసయ్యలు-ఇలా బలమైన జానపద గురువర్గమే ఈ ప్రాంతమంతటా వ్యాపించివుంది. ఇది రాజు, మహారాజుల కన్నా ఆయా కులనాయకుల దేవతల పరంపర, సంస్కృతి యొక్క పూర్వాపరాలను తెలియజేస్తుంది.

ఇదే విధంగా తెలుగులో బ్రాహ్మణులకు 'విప్రవినోదులు' (సూర్యవంశ క్షత్రియులు), క్షత్రియులకు 'భట్రాజులు', వైశ్యులకు 'వీరముష్టులు', యాదవులకు 'కొమ్ములవారు'(మాదిగలు), రెడ్లకు 'పిచ్చగుంట్లు', కమ్మకులం వారికి 'భట్రాజులు', వలమబలిజ కులంవారికి 'మాలదాసరులు', కంసలివాళ్ళకు 'పనసవారు', నేతకారులకు 'మిత్ర అయ్యవారలు' (మిత్తరి దాసరులు), మాలలకు మాష్టీలు, మాదిగలకు 'డక్కలవారు' మొదలైన ఉపకులాలవారు ఉన్నారు. ఇలా కులవృత్తి యొక్క సామాజిక స్థితిగతులను ధర్మ ప్రచారకుల్లా ప్రచారం చేయడానికి ఈ ఉపకులాల వారున్నారు. బహుశా ఇదే నేపథ్యంలో బుడగ జంగాలలో కనిపించే వేషగాళ్ళ ఒక వర్గాన్ని చూడవచ్చు. వీళ్ళు పద్దెనిమిది కులాల మంచి చెడులను తమ వేషభూషణాల ద్వారా బయటపెడతారు. మరొక వర్గం వారు గంగమ్మ గౌరమ్మలుగా, బాలసంతులుగా, కథలు చెప్పేవాళ్ళుగా, భూములు(వ్యవసాయం) చేసుకునేవారిగా (వీళ్ళను వేషగారులపట్టి అంటారు), వ్యాపారం చేస్తున్నవారిలా కనిపిస్తే, వాళ్ళల్లో ఒక ప్రధాన వర్గం వేషగారుల్లాగే ఉండిపోయారు.

ఈరమ్మ బంధువులు ఈ విధమైన వృత్తికాయకాన్ని చేసుకుంటూ వచ్చినవాళ్ళు. ఈరమ్మ అన్న సణ్ణ రామణ్ణ 'వేషగార (వేషధారి)రామణ్ణ'గా ఈ ప్రాంతంలో చిరపరిచితుడు. హళె దరోజిలోనే ఆకస్మాత్తుగా కనిపించే ఈ వ్యక్తిని పలకరించి చూడండి. 'మేము ముప్పయి రెండు రకాల వేషాలు వేస్తాం. అందులో పద్దెనిమిది కులాల ఆచార వ్యవహారాల పద్ధతులనంతా ఆయా కులాలవారికి అర్థమయ్యేలా, వాళ్ళ మనస్సులో నాటుకునేలా నటించి, ఆడి, పాడి, నవ్వించి చూపిస్తాం.' అంటాడు. ప్రతి కులంలోని యోగ్యమైన విషయాలను వేషం వేసుకుని చూపించటమే తమ వృత్తి అనే సత్యాన్ని అతను చెప్పటం మరవలేదు. ఎవరు గొప్పవాళ్ళో, ఎవరు

అల్పులో దీనివల్ల తెలియాలన్నదే ఈ వేషంలోని మర్మం అంటాడు. ఇతడి వేషాన్ని, అభినయాన్ని ఏ కులంవారూ ఇంతవరకూ ప్రశ్నించలేదు. ఎందుకంటే అన్ని కులాలవారినీ, అన్ని కులాలలోని ఆచార వ్యవహారాలను అనుకరిస్తూ, అభినయించి చూపించేవాడు. ఈ విధానంలోనూ ఇతడు కులంలోని మంచి విషయాలనేకాక, తిరస్కరించే విషయాలను కూడా బట్టబయలు చేసేవాడు. వేషధారి సణ్ణ రామణ్ణ ప్రతి ఒక్క కులపు యాచకుడిలా కనిపిస్తాడు. మనం ఇక్కడ గమనించవలసిన ముఖ్యమైన విషయమేమిటంటే ఆయా కులాలే ఇలాంటి యాచకులకు ధాన్యంగింజలు, డబ్బు దస్కం, ఆవులు దూడలు ఇవ్వటం ద్వారా ఆ సముదాయాన్ని బతికించాయని చెప్పవచ్చు.

పైన పేర్కొన్న ఈ విధమైన కొన్ని సంచార వర్గాలు ప్రముఖంగా మూడు ఘట్టాలలో కనిపిస్తారు. 1) రాజు, 2) దైవం 3) కులం. ఈ మూడింటి చుట్టూ ఈ కళాకారుల జీవితాలు అల్లుకుని ఉన్నాయి. ఇచ్చిపుచ్చుకోవటాలు ఉన్నాయి. అత్యంత ప్రాచీన కాలం నుంచీ ఈ విధమైన పరంపరను కొనసాగిస్తూ వచ్చారు. ఈ విషయంగా తంగిరాల వెంకట సుబ్బారావుగారు తమ 'తెలుగు జానపద గాయకులు' అనే వ్యాసంలో కొందరు కవులను, కొన్ని కృతులను ఉల్లేఖించారు. అవి ఏమిటంటే శ్రీనాథుని క్రీడాభిరామము, పాలవేకరి కదిరీపతి కవి యొక్క శుకసప్తతి (1650), అయ్యలరాజు నారాయణామాత్యుడి హంసవింశతి 1750) మొదలైనవి.

**ఆంధ్ర, కన్నడ సంబంధం ఇలాంటి ఒక సాంస్కృతిక సందర్భంలో ఒక వంతెనలా కనిపిస్తుంది. బుర్రకథా ఈరమ్మ మరియు వేషగారులు ఒకే బుడగ మూలం నుంచి వచ్చినందువల్ల, వారు ఇప్పుడు కన్నడిగులైనందుకు నేను ఇక్కడ బహుముఖ నాడులను (కర్నాటకాంధ్ర) ఏక సంస్కృతి నేపథ్యంలో చిత్రించడానికి ప్రయత్నించాను. బుర్రకథా ఈరమ్మ గానంచేసే పదిపన్నెండు మహాకావ్యాలలో చాలావరకు తెలుగులోనూ, కన్నడలోనూ పాడగలిగేటటువంటివి. ఏకకాలంలో ఇది ఆంధ్రలోని తెలుగు జానపద మహాకావ్యాలుగానూ, కర్ణాటకలోని కన్నడ జానపద మహాకావ్యాలుగానూ పేర్కొనవచ్చు. కర్ణాటకలో మాతృభాష దృష్టితో చూస్తే అవి బుడగ జానపద మహాకావ్యాలు అవుతాయి. ఈరమ్మ ఈ ప్రాంతంలో అత్యంత గొప్ప మౌఖిక కావ్యాల సృజనశీల అనువాదకురాలిగా కనిపిస్తుంది. ఆమెకు తెలిసిన రెండు మూడు భాషలలోనూ ఈ కావ్యాలను గానం చేయగలదు. 'భాష'- పండితుల సొత్తు అనటాన్ని ఇలాంటి జానపదులు ఎన్నడో తుడిచివేశారు. ఈ కారణాలన్నిటివల్లనే వీటికి, వీటిని గానం చేసే ఈరమ్మలాంటివారికి ఏ విధమైన సాంస్కృతిక సరిహద్దులు లేవని అనవచ్చు.**

మన రాజకీయాలు ఏర్పరిచిన వందలాది సరిహద్దులు సాంస్కృతిక సందర్భం వచ్చినపుడు చెదరిపోతాయనటానికి మన బుర్రకథా ఈరమ్మనే పెద్ద సాక్ష్యంగా నిలుస్తుంది. ఈ విధమైన రాజకీయ సరిహద్దులను సాంస్కృతికంగా తుడిచివేసే కళాకారులు, కవులు మన జానపద జగత్తులో చాలామంది ఉన్నారు. అలాంటి జగత్తు నుంచి 'ఒక గొప్ప ప్రతిభ'ను పట్టుకుని ఇప్పుడు శిష్టలోకపు నెత్తి మీద పెట్టడం జరిగింది. ఆ బౌద్ధిక ప్రపంచం రూపొందించే శిష్ట జీవితానికి, మన ప్రపంచంలోకి మనమే ప్రవేశించి మనదిగా చేసుకునే జానపద బతుకుకూ అజగజాంతర (మేకకూ ఏనుగుకూ ఉన్నంత) వ్యత్యాసముంది.

ఈరమ్మలాంటివారి వ్యక్తిగత జీవితంలోకి ప్రవేశించడంచాలా కష్టం. మన చదువు, మన అవగాహన, మన గౌరవం, మన అనుభవాలకూ అందని అంతర్గత సత్యాల జీవితం ఆమెలో దాగివుంది. జీవితానికి సంబంధించి ముందస్తుగా తయారు చేసుకున్న లిఖిత ప్రశ్నావళికి ఆమె జవాబివ్వలేదు. ఆమె మౌఖిక మాటలనంతా లిఖితపరిచేటప్పుడూ ఒక విధమైన భయం నన్ను కమ్ముకుంది. ఈ భయం ఆమె స్వేచ్ఛాయుతమైన మౌఖిక శక్తి కారణంగా కలిగినటువంటిది. ఈరమ్మ విషయంలో మన అక్షరాస్యుల నాగరికత గుర్తించే శీల – అశ్లీలాలూ గౌరవాలు పొందుతాయి. కట్టుకున్న మొగుడు ఆమె తల్లిని 'జననీ కేంద్రంగా' పెట్టుకుని తిట్టినపుడు, స్వయంగా 'నువ్వు ఇంకెవరికో కడుపు తెచ్చుకున్నావు' అని అన్నప్పుడు ఆమె పడిన బాధలకంతా ఆమె మౌనమే సమాధానమైంది.

ఒకసారి జీవితంలో గడచిపోయిన ఆ సంగతులు భర్త చనిపోయి తాను వితంతువు అయినా ఆ సంకటపు మంటలు మనస్సులో ఆరలేదు. అది లోలోపల జ్వాలాముఖిలా విస్ఫోటిస్తూనే ఉంది. సంసార వైరాగ్యాన్ని తెచ్చుకున్న 'అక్క'లా (అక్కమహాదేవిలా) ఈరమ్మ కనిపిస్తుంది. 'అక్క' తన దారిని తానే కనుక్కోవటానికి కనుపించని చన్నమల్లికార్జునుడిని వెదుకటానికి వెళితే, ఈరమ్మ ఏ అలౌకికమైన శక్తినీ వెదకక, తన కథలను వినేటటువంటి, మెచ్చుకునేటటువంటి, ముద్ద అన్నం పెట్టేటటువంటి గ్రామీణుల దగ్గరికి వెళుతుంది. జీవితంలోని బాధలకు ఇక్కడ సాంత్వన తెచ్చుకుంటుంది.

'ఈరమ్మా నీ జీవితంలో నువ్వు ఎప్పుడు ఎక్కువ సంతోషపడ్డావు' అని అడిగితే, వెంటనే 'నాకు ఊరే సంతోషం, ఊరి జనుల సంతోషమే సంతోషం, నా బుర్రకథే నాకు సంతోషం' అని చెబుతుంది. ఇది ఆమె పాలిట నిజమే. నూటికి నూరుపాళ్ళు జీవిత సత్యం కూడా. వేరే ఏ స్త్రీనైనా అలా అడిగివుంటే, అడిగినదానికన్నా అధికంగా తమ పుట్టిల్లు, భర్త, పిల్లలు, స్నేహితులు, బాల్యం మొదలైన విషయాలను కథలుగా మార్చి చెప్పివుండేది. అయితే ఈరమ్మ ప్రజల దగ్గర గానం చేసే కథలే వేరు. నిజ జీవితంలో మనలాంటివాళ్ళ ఎదుట చెప్పే వ్యథలే వేరు.

ఎందరో ఆడవాళ్ళు తమ వ్యథలను కథగా, కావ్యంగా, పాటగా కూర్చటం ఈ కాలపు సాహిత్యంలో కనిపిస్తాయనటానికి ఎన్నో ఉదాహరణలున్నాయి. ఈరమ్మ ఇలా తన వ్యక్తిగత జీవితాన్ని ఎన్నడూ బహిరంగపరిచినది కాదు. రాజులు, రాణుల్లా శాసనాలలోకానీ, భార్య పోయినవారి 'మాస్తికల్లు'లలో (వీరులు చనిపోయినపుడు వారి గుర్తుగా పెట్టే స్మారక శిల) కానీ నిలిచిపోవాలనే ఉద్దేశమూ ఈమెకు లేదు. అది జానపద మనస్సుకు లొంగే విషయమూ కాదు.

ఈరమ్మ బతుకు తెరువు బుర్రకథ చెప్పటం. వీరుల త్యాగం, బలిదానం, సాహసాలను, ఆడదాని సామాజిక పరిస్థితులను, వంశపరంపరలు రూపొందించి, నేర్పించినట్టుగా తాను నేర్చుకున్నది. దాన్ని సృజనాత్మకంగా విస్తరించి చెప్పటమే ఆమె నిత్య కాయకం. ఆ పూటకు చెందిన ఆకలి, సంకటాలకు ఈ కథలు తెచ్చిపెట్టిన బయానాలే ఆమెకు ముఖ్యం. 'ఇంతే చాలు, మిగిలింది నాకెందుకు' అని చాలా వినయంగా అంటుంది. కొన్నిసార్లు తన మీద తానే అధికారాన్ని చలాయించుకొనే హఠయోగిలా ఆమె కనిపిస్తుంది.

(అసలు కథ వచ్చే సంచిక నుంచి...)

కీ.శే. దుర్గానంద్



# శబ్దగాండీవి వేమన-4

(అక్టోబరు సంచిక తరువాయి)

భారత రామాయణాల్లోని మహా పాత్రలైన రాముడు, ధర్మరాజు, భీముడు, అర్జునుడు మొదలైన వాళ్ల మీద విమర్శలు ఎప్పుడూ ఉంటూనే ఉన్నై. మహాభారత యుద్ధం మీద వ్యాసుడు ఇచ్చిన తీర్పు ఒకటైతే ప్రజలు ఇచ్చిన తీర్పు వేరొకటి. మహాకవులు తాము నిర్మించదలచిన పాత్రల్ను చాల వరకు ఔన్నత్య శోభితంగా చేయవలెననే చూస్తారుగాని అప్పుడప్పుడు అవి వాళ్ళ చేతుల నుండి కూడా జారిపోతాయి. ఎందుకంటే ఆ కవులు సత్యద్రష్టలు. చూచింది చూచినట్టుగా చెప్పివేయాలి. రాముడు చెట్టు చాటునుండి బాణం వేసినప్పుడూ ధర్మరాజు 'అశ్వత్థామ హతఃకుంజర' అని ఒక అబద్ధాన్ని గొంతులోనే గొణుక్కున్నప్పుడూ ఆ మహాకవులు వాళ్ల బలహీనతల్ను కూడా మనకు చూపెట్టినందుకు వాళ్ల రచనల్లోని గొప్పతనాన్ని మనం అర్థం చేసుకున్నాముగాని మళ్లీ రెండో ప్రక్కనుంచి వాళ్లు. ప్రజలు గుర్తు పట్టడానికి వీల్లేనంతగా ఆ పాత్రల్ని పొగిడి కప్పేయడానికి ప్రయత్నించారు. కాని ఎక్కడ గొట్టో అక్కడే నట్టు అన్నట్టు ప్రజలు దాన్ని మెల్లమెల్లగా బయటకు లాగారు. దాంతో దేశం రెండు పార్టీలుగా చీలిపోయింది. కొందరు ధర్మరాజు పార్టీ కొందరు దుర్యోధనుడి పార్టీ.

ధర్మరాజుకు సత్యవాది అనే పేరు వచ్చింది. అసత్యవాది అనే గుసగుసలూ బయలుదేరి నాయి. మరి వేమన్నకు ముందువాళ్లు ధర్మరాజును ఏ పేరుతో పిలిచేవాళ్లో! నయవంచకుడు అనే ఆళ్లో చిరుకత్తితో మెత్తగా గొంతుకోసేవాడు అనే వాళ్లో మనకు తెలియదు గాని వేమన్నగారు మాత్రం అతనికి మంచి పేరు పెట్టారు. "పేరు ధర్మరాజు పెను వేప విత్తయా"! ధర్మరాజును ఆయన వేప విత్తన్నాడు. ఇంత మంచి పేరు ధర్మరాజుకు ఏ భాషలోనూ ఉండి ఉండదు. ఒక్కొక్కళ్లకు పేరు పెట్టడం ఎంత కష్టం' మనం రోజూ లక్షలాది మందికి పేర్లు పెడుతుంటాము. అవి నిలిచినాయా! వేమన ధర్మరాజుకు పెట్టిన పేరు నిలిచింది.

వేమన డాంబికా చారాలను నిరసించాడనడం జగద్విదితమే గదా! అప్పుడు ఒడలు నిండా బూడిద పూసుకుని జడలు ధరించి కాషాయ వస్త్రాలు కట్టుకున్న వాళ్లకు చాలా విలువుండేది. అప్పుడు మానవుడు సాధించవలెననుకున్నది ముక్తి. ప్రాపంచిక విషయాలు సాధించ వలసినవి గాదని వారి లెక్క. కూడూ గుడ్డా అనేది మనిషికి సాధించవలసినదిగాదు. పొట్ట ఉంది గాబట్టి పాటు పడతాడు, తింటాడు. ఇది అర్థంగానిదేమీ కాదు. దీనికి తల కాయబద్దలు కొట్టుకోవలసిన పనేమీ లేదు. అందువల్ల వేమన కూడా ఆ పద్ధతి ప్రకారమే భుక్తికి అడ్డువచ్చేవాళ్లను గురించి కాకుండా ముక్తికి అడ్డు వచ్చేవాళ్లను మాత్రం బాగా తెగనాడాడు.

*ఒడల బూది పూసి జడలు ధరించిన*
*నొడయడగును ముక్తి బడయలేడు*
*తడక బిఱ్ఱుపెట్ట దలుపుతో సరియౌనె*

ఆయన కవిత్వ శక్తి అంతా దృష్టాంతాల్లో ఉంది.

తడకను ఎంత బిఱ్ఱుగా పెట్టినా తలుపు అవుతుందా అంటాడు. ఆయన స్లో మోషన్లో ఎప్పుడూ అనడు. ఎట్టాక్ చేస్తున్నట్టు ఉంటుంది ప్రతిమాటా. ఆయన విడిచే శబ్ద బాణాలు రక్కున గుండెలకు తగులుతాయి. కవీ ప్రజలూ భావం మీదా శబ్దం మీదా ఏకాభిప్రాయానికి వచ్చినప్పుడే దాన్ని లోకం మంజూరు చేస్తుంది. వేమన్నను ఆయన తిట్లతో సహా లోకం ఒప్పుకుంది.

ఎన్ని దొంగ వేషాలు వేస్తేనేం లోపలి మాలిన్యం తొలగనప్పుడు అనడానికి వేమన 'తలలు బోడులైన తలపులు బోడులా' అంటాడు. ఈ మాట తెలుగులో ఒక సామెత లాగా నిలిచిపోయింది. కోర్కెలు కూడా బోడివి అవడం! ఎంత మంచి ప్రయోగం! బోడిగుండు తలకాయలకు ఉంటుంది. ఆ గుండును కోర్కెలకు తీసుకు వచ్చి పెట్టాడు వేమన. ఈ రోజుల్లో మతాల్ను గురించి చెబుతుంటే మనకిప్పుడు కాలదోషం పట్టినవిగా కనుపించుతాయిగాని అప్పుడు మాత్రం అవి జీవితంలో ప్రతికోణానికి చిక్కుకుని ఉండేవి. తిండిలో మనకిప్పుడు రాజకీయ వేత్త కనపడుతున్నాడు. చదువులో సైంటిస్టు కనిపించుతున్నాడు. ఆలోచనలో పార్టీ జండాలు కనిపిస్తున్నాయి. కాని అప్పుడు తిండి బట్ట చదువు సంధ్య అన్నిటిలో మతమూ ధర్మమే కనిపించుతుండేది. వాళ్లకు ఏ జ్ఞానమూ లేక పోయినా మతం పేరు చెప్పి భయపెడుతూ ఉండేవాళ్లు. అందువల్లే వేమన అంటాడు.

*మతపు వేషధార్లు మహిలోన బదివేలు*
*మూఢ జనుల గలప మూగు చుంద్రు*
*మర్మ విడుదు గాని మర్మంబు గనలేడు.*

చదువుల్లో సారం మర్మం అనేది ఉంది. దాన్నె మనం అసలు పాఠమంటాము. అసలు పాఠం చెప్పే గురువులు కనపడటం లేదు. పిల్లలకు ఐదారు పేజీలు పాఠాలని చెప్తుంటారు. ఆ ఐదారు పేజీలు పాఠాలు కావు. చివర ఎక్కడో పాఠముంటుదా హరిశ్చంద్రుని కథంతా చెప్పిన తరువాత ఎవరూ అసత్యమాడ గూడదు అని ఒక నీతి చెబుతాం. ఆ నీతే పాఠం. ఆ ఒక్క మాటకోసం ఆ ఐదారు పేజీల వివరణ కూడా చదవ వలసి వస్తుంది. వేమన పైపై వివరణలన్నీ వదిలేసి మనకు పాఠభాగం మాత్రమే చెప్పాడు.

వేమన ధనికుల్ను బాగానే నిందించాడు. అయినా ధనంలేని బ్రతుకు చాలా దుర్భరమని ఆయన చాలా చోట్ల అన్నాడు. ఈ విషయంలో ఈయనకుఒక హిందీ కవితో చాలా పోలికలున్నాయి. అతని పేరు అబ్దుల్ ఖాన్ ఖానా రహీం. రహీం, అక్బరును పెంచిన భైరముఖాను కొడుకు. అతడు హిందీ శతక సాహిత్యంలో గొప్ప కవి. అక్బరు దగ్గర సేనాపతిగా ఉండి పెద్ద యుద్ధాలు చేసి చాలా భోగ విలాసంగా బ్రతికి చివరకు తన దగ్గరున్నదంతా బీదలకు దానం చేసి దుర్భర దారిద్ర్య జీవితం అనుభవించాడు. ఆయన ధనంలేని పరిస్థితినీ,

దారిద్ర్యాన్ని గురించి ఎన్నో చక్కని దోహాలు వ్రాశాడు. లక్ష్మీదేవిని చంచల స్వభావురాలు అన్నాడు. ఎందుకు చంచల స్వభావురాలు అయింది అంటే పురాతన పురుషుడి భార్యగదా అన్నాడు. పురాతన పురుషుడు అంటే పాతవాడు ముసలివాడు అని అందుకనే ఆమె కాలు ఒకచోట నిలువకుండా తిరుగుతుంది అని. ఆమెకు జరిగిన పరిస్థితే, వేమనకు కూడా జరిగి ఉండవచ్చు. మొదట వేమన భోగి తరువాత యోగి అయ్యాడు. భోగి యోగి అయే మధ్య దశలలో ఆయన దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించి ఉంటాడు. అవే వేడివేడి శబ్దాల్ను ఈటెలుగా చేసుకుని సంఘం గుండెలు దూసుకు పోయేటట్టు విసరిన కవిత్వపు రోజులు మొదట భోగి దశ, రెండవది కవి దశ, మూడవది యోగి దశ. ఈ కవి దశే ఆంధ్ర దేశానికి పెన్నిధి అయింది. అప్పుడే అంటున్నాడు –

*ధనము లేక సుఖము తనకెట్లు కలుగురా!*
*గోచిపాత కంటె గొంచెంబికను లేదు'.*

ఇది తతిమ్మా కవుల కంటె భిన్నంగా ఉంది. తదితర జ్ఞాన కవులు దారిద్ర్యాన్ని వరించారు. దారిద్ర్య స్థితిలోనే ఆత్మజ్ఞానం కలగ డానికి అవకాశం ఎక్కువ ఉంది. అన్నారు అయినా పూర్వ జీవిత ఔన్నత్యాన్ని తలుచు కున్నప్పుడు వేమన్నకు అప్పుడప్పుడు దుఃఖం కలిగి ఉంటుంది. అష్టైశ్వర్యాలు లేక పోయినా కడుపు నిండా భోజనం ఉంటే చాలు అనే తృప్తి కూడా ఆయన పొందాడు. అది కూడా లేకపోతే దుర్భరమే.

"చల్ది మిగుల నిల్లు సంసార మేలరా" అన్నాడు కనీసం చల్ది అయినా మిగలాలి సంసారి యింటిలో. చల్ది అనే మాటలో ఎంతో ఆత్మీయతా దేశీయతా ఉంది. ధనికత్వమంటే ఏమిటి? ధన కనక వస్తు వాహనాలు ఉండటం కాదు. ఇవ్వాల్టికి భోజనం ఉండాలి. రేపటికి చల్ది అన్నం మిగలాలి. ఈ చల్ది ఎందుకు? మళ్లీ ఇవాల్టి భోజనం సంపాయించుకోవడానికి. "దీన్నే మనం తిండి లేక ఎవరూ చావరు, వేళ దప్పకుండా తినడాన్ని గవర్నమెంటు అంటూ అనవచ్చు. వేళకు అన్నం తినడం వేళకు తినలేక పోవడం ఇంతలోనే ఉంది యీ ప్రపంచ నీతి, ప్రపంచ ధర్మాలు. ప్రపంచ రాజకీయాలు. ఎప్పుడో ఎక్కడో భోజనం చేస్తాం అంటే మన బ్రతుకు దైవాధీనం అయినట్టే. అంచనాల మీద బ్రతుకుతున్నట్టు. టైం టేబులు వేసుకున్నట్టు అన్నం లభిస్తేనే మన బండి గాడి తప్పకుండా వెళుతున్నట్టు. ప్రతి యిల్లూ చల్ది ఉండే యిల్లు కావాలని వేమన ఆశించాడు. ఇంటింటికీ ఒక ఉద్యోగం కావాలన్నా ఇదే. ఈ ఆర్థిక సందేశంతో పాటు ఇంకొక మాట కూడా అన్నాడు వేమన.

'అప్పులేని వాడు అధిక సంపన్నుడు' దాదాపు వేమన్నదీ శ్రీనాధుడిదీ ఒక కాల మంటున్నారు కాబట్టి ఒడ్డె రాజులు శ్రీనాధుణ్ణి ఎదురెండలో ఈడ్చుకుంటూ పోతుండటం చూచి ఉంటాడు లేక వినైనా ఉంటాడు. ఈ మాట మనమూ అప్పులవాళ్ళు వచ్చి బాధించి నప్పుడు అంటాముగాని వేమన అనుభవించే వ్రాశాడు అనిపిస్తుంది. ఇప్పుడు మనకు పొదుపు ఉద్యమాలు ఉన్నాయి. బాగా జరుగుబాటు ఉండి మనం పొదుపు చేయడం లేదు. మనకు జరిగినా జరగక పోయినా అప్పు చేసి పొదుపు చేస్తున్నాం. మీకు ఏమైనా జరిగితే మీ పిల్లలు ఏమైపోతారు అని మనకు మృత్యుభయం చూపి మనల్ని పొదుపుకు ఒత్తిడికి చేయిస్తున్నారు. ఎప్పుడో ప్రాణాలు పోతాయని ఇప్పుడు ప్రాణాల మీదకు తెచ్చు కుంటున్నాము. వేమన కాలంలో డబ్బులేక అప్పులు చేసే వాళ్ళు ఇప్పుడు చేసే అప్పు అన్నీ ఉన్న దరిద్రుడు చేసే అప్పు. మన జీవితంలో అన్నిట్లోనూ సహజత్వం లోపించింది. అన్నింటా కృతకత్వమే. చదువులో, సంపాదనలో, పొదు పులో, అప్పులో అన్నింటా. బ్రతుకులోనూ కృత కత్వమే, మరణంలోనూ కృతకత్వమే. ఆ కాలంలో ఆయనకు కనపడ్డ కృత్రిమాల మీద ఆయన బాణాలు విసిరాడు. ఆయన బాటల్లోనే మనమూ ఇప్పుడు ఈ పరిస్థితుల్లో ఉన్న కృత కత్వాల మీద బాణాలు విసర వలసి ఉంది.

హిందీ కవి కబీరుకూ వేమన్నకూ చాలా పోలికలున్నాయి. సామాజిక దూషణ, స్ఫుట వాదిత, స్వీయ జీవన దృష్టి, జీవ పరమాత్మల సంబంధం మొదలైన ఎన్నో విషయాల్లో వీరిద్దరూ ఒకే పంథాన పయనించారు. కబీరు, పరమాత్మ సర్వత్ర వ్యాపించి ఉన్నాడు అని చెప్పడానికి 'జ్యోంపుహుపున్ మే బాస్' అంటాడు. పుష్పంలో సుగంధంలాగా పరమాత్మ వ్యాపించి ఉన్నాడు అని. అదే వేమన అంటాడు.

*పరుస మినుము సోక బంగారమైనట్లు*
*కప్పురంబు జ్యోతి గలిసినట్లు*
*పుష్పమందు దావి పొసగినట్లగు ముక్తి.*

కబీరు తిండి తిప్పలకోసం భగవంతుని విలువైన సమయం పాడు చేయవద్దు అంటాడు. 'పొట్ట అనేది కుక్క. దానికో రొట్టె ముక్క పారవేసి భగవద్ధ్యానంలో లీనమవు, లేకపోతే అది గోల చేస్తూ ఆ ధ్యానం నుండి నీ మనస్సును తప్పి స్తుంది' అంటాడు. అదే అర్థం వచ్చేమాట వేమన్న కూడా అన్నాడు.

*కడుపు చిచ్చు చేత కామానలము చేత*
*క్రోధ వహ్ని చేత కుతిల పడక*
*యుక్త మనసుతోడ నుందును సుజ నుడు.*

దీనిలో భగవద్భక్తికి భంగకరమైనవి కడుపు చిచ్చేగాక కామాన్నీ క్రోధాన్నీ కూడా వేమన పేర్కొన్నాడు. కబీరూ వేమన్నా ఇద్దరూ విగ్రహారాధనను నిరసించారు. నిరాకారుడైన పరమాత్మ ఒక్కడుండగా రాతి బొమ్మలకు పూజ చేయడం అవివేకం అంటారు ఈ జ్ఞాన కవులు. 'రాయి దేవుడైతే నేను కొండకు పూజ చేస్తాను' అన్నాడు కబీరు. వేమన కూడా అలాంటి భావాన్నే వ్యక్త పరిచాడు.

*తోలు కడుపులోన దొడ్డ వాడుండగా*
*రాతి గుళ్లలేల రాశివోయ*
*రాయి దేవుడైన రాసులు మ్రింగవా!*

కబీరు అన్న దానిలో ఒక చమత్కారం ఉంది. వేమన్న అన్న దానిలో ఒక చమ త్కారముంది. కొన్ని తాత్విక విషయాల్లో విషయ గాంభీర్యంలో కబీరు మహోన్నతుడుగా కని పించినా లోక వ్యవహారం, ప్రజా జీవన పరి శీలనలో వేమన అద్వితీయుడుగా కనిపించు తాడు. భర్తృహరి లాగా ఇతడు సంపన్న కుటుం బంలో జన్మించిన వాడు కావడం వల్ల లోకాన్ని నిశితంగా చూడగలిగిన నేర్పు అలవడింది.

*'తనర నృపతితోడ దగ దుర్జనునితోడ*
*నగ్నితోడ బరుని యాలితోడ*
*హాస్యమాడుటెల్ల నగును ప్రాణాంతకం'*

తెలుగులో యోగి శ్రేష్ఠుల్లో జ్ఞాన కవుల్లో అగ్రగణ్యుడైన ఒక కవిని చెప్పేటప్పుడు

## పాఠశాల విద్యలో మాతృభాషే మాధ్యమంగా ఉండాలి

యావద్భారత దేశంలోనే జ్ఞాన కవుల్లో మకుటాయమానంగా వెలిగిన కబీరును గురించి ఇచ్చట రెండు మూడు మాటలు ముచ్చటించడం అసందర్భం కాదు. కబీరు భావాలు కబీరు సమయానికి భారతదేశమంతటా ప్రచార మయినాయి. వేమన కబీరు కాలం కూడా కొంచెం మించుగా ఒక్కటే. కబీరు 1382 లో పుట్టి 120 సంవత్సరాల దీర్ఘ జీవితం అనుభవించి పరమ పదించాడు. కాశీలో లహర్ తారా అనే చెరువులో దొరికాడట. ఒక హిందూ కన్య ఈ బాలుణ్ణి కని వదిలి పెట్టగా ముసల్మాను దంపతులు తీసుకుని కబీరుని పెంచి పెద్దవాణ్ణి చేశారు. అందువల్ల ఇతడు ముసల్మానుగానే చెల్లుబడి అయినాడు. ఆ ముసల్మాను గుడ్డలు నేస్తూ మగ్గం మీద బ్రతికేవాడు. కబీరు కూడా గుడ్డలు నేస్తూనే కాలం వెళ్లబుచ్చాడు. కబీరు చదువుకొనక పోయినా శ్రుత పాండిత్యం ద్వారానే విద్య నార్జించి అపారమైన సాహిత్యాన్ని వెల యించాడు. కబీరు తన దీర్ఘ జీవితంలో ఎన్నో ప్రాంతాలు పర్యటించాడు. ఆంధ్ర ప్రాంతం కూడా వచ్చి ఉండవచ్చు. ఎందుకంటే రామ దాసుగారు ఇతని శిష్యుడని చెప్పబడుతుంది. రామదాసుది చాలా ఇవతలి కాలం. కబీరుకు సమకాలికుడు కాదు. రామదాసు కబీరుకు శిష్యుడని చెప్పడం కేవలం పుక్కిటి గాధ అయినా కబీరు ఆంధ్ర ప్రాంతానికి వచ్చినందువల్లే అలాంటి పుక్కిటి గాధను సృష్టించి ఆంధ్రులు ఒక కల్పనా సుఖాన్ని అనుభవిస్తున్నారని చెప్పుకొనవలసి వస్తుంది. అచ్చు యంత్రాలూ కాగితాలు ఉన్న ఈ కాలం కంటే ఆ కాలంలోనే మౌఖిక ప్రచారంతోనూ శిష్య ప్రశిష్య పరం పరతోనూ కాకులు దూరని కారడవుల్లో కూడా వ్యాపించుతుండేవి కవిత్వాలు. సారంలేని పుస్తకాలు నాలుగువేలు ప్రతులు వేసుకున్నా నాలుగు గజాలు కూడా కదలవు. శక్తి ఉన్న కవిత్వం ఒక్క ప్రతి వున్నా దేశ దేశాల నుండి వచ్చి దానికి వేల ప్రతులు వ్రాసుకు పోతుంటారు. ఏమైనా కావ్య ప్రయోజనము వస్తు ప్రతిపాదన పద్ధతుల్లో ఒకరి భావాలు ఇంకొకరి మీద ప్రసరించినా ప్రసరించక పోయినా కబీరు వేమనల మార్గం ఒక్కటే. వీళ్ళిద్దరి విప్లవాత్మక భావాభివ్యక్తీ ఒక్కటే.

తతిమ్మా హిందూ సమాజపుటాదర్శం వేరై ఉంటే ఈ సత్య ద్రష్టల ఆదర్శం వేరుగా ఉంది. ధర్మార్థ కామ మోక్షాలు తతిమ్మా వారికి ఆదర్శం. వీరికి మోక్ష మొక్కటే ఆదర్శం. ధర్మం విషయంలో ఈ సత్యద్రష్టలు తమ దృష్టితోనే ఒక మార్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. హిందువుల ధర్మం కుల వ్యవస్థకూ ఆశ్రమ వ్యవస్థకూ సంబంధించి ఉంటుంది. వాళ్ల ప్రకారం బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ సన్యాసాశ్రమాలు ఆచరణీయాలు. అందు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య శూద్రులుగా మానవ జాతి విభజింపబడి ఉంది. కాని ఈ సత్య ద్రష్టలు కుల వ్యవస్థను తారుమారు చేశారు. శూద్రుడు బ్రాహ్మణుడు అవుతాడు బ్రాహ్మణుడు శూద్రుడూ అవుతాడు. అసలు ఈ రకంగా కూడా ఉండదు. సమస్తమైన మానవజాతి, అంతేగాదు, పశుపక్ష్యాది కీటకాలతో సహా సమస్త ప్రాణికోటీ రెండు విభాగాల క్రిందకు వస్తుంది. ఒకటి బ్రహ్మ, రెండు జీవుడు, మళ్లీ అక్కడ బ్రహ్మ ఒక్కడే నిలుస్తాడు. అంతా ప్రవాహమయం. వివిధ రూపాల్లో ప్రవహించుతుంది.

Everithing is flow and, every bit is its foe the same in several

ఇంత విశాలమైన దృష్టి సత్యద్రష్టలది. బ్రహ్మచర్యం అనే పేరుతో ఏ ఇరవై సంవత్సరాలో పాతిక సంవత్సరాలో విద్యార్థిగా జీవించాలన్న నియమమూ లేదు. పరిపక్వత లభిస్తే అతడు చిన్ననాటి నుండే జ్ఞానీ, సాధకుడూ కావచ్చు ప్రహ్లాదుడు ధృవుడులా. గృహస్థుగా ఉన్నా గృహస్థ ధర్మాశ్రపు మలినం ఏమీ అంటదు. ఎందుకంటే భార్యా బిడ్డలతో ఉన్నా సోక్రటీసులా కబీరులా తామరాకు మీద నీటి వతులా అంటీ అంటక ఉంటారు. ఇక వానప్రస్థం అనే పేరుతో వృద్ధాప్యంలో అడవులకు పోనవసరం లేదు. ఎక్కడుంటే అక్కడే అరణ్య ఏకాంత వాస మౌనాన్ని సాధిస్తారు. సన్యాసాశ్రమంలా కాషాయ గుడ్డలు కూడా కట్టుకో నవసరం లేదు. జీవితమంతా వస్త్ర నిగ్రహంతోనూ వేషభాషల నిగ్రహంతోనూ కాలం గడుపుతూ ఉంటారు. అందువల్ల ఈ సత్యద్రష్టల పంథా, హిందువుల ఆశ్రమ వ్యవ స్థనూ వర్ణ వ్యవస్థనూ తల్లక్రిందులు చేసింది.

**తరువాయి వచ్చే సంచికలో...**

**( 25 వ పుట తరువాయి...)**

స్వామీ!

నన్ను దీవించండి. మీ అండదండలుంటాయని హామీ ఇవ్వండి. చాలు.

నాకు, నన్ను గౌరవించి, ప్రేమించే మను మడు, మనుమరాలు ఉన్నారు. నా ట్రస్ట్ ఆధ్వర్యంలోనడుస్తున్న నాలుగు బడులున్నాయి. ముందు ఇంట గెలవటం ప్రారంభిస్తాను. నన్ను చూసి, నలుగురు ప్రభావితులై, నా మార్గాన్ని అనుసరించేలా కృషి చేస్తాను." దృఢంగా చెప్పాడు సింగయ్య,

ఒక క్షణం ఆగి, మరల కొనసాగించాడు, " మీ అండదండలంటే మరేమీ కాదు. కేవలం, మీ దగ్గర ఉన్న పెద్దబాల శిక్ష వంటి పుస్తకాలూ, కొన్ని ప్రాథమిక గ్రంధాలూ, నాతో తీసుకు వెళతాను. వాటిని ముద్రింపజేసి, మీ ప్రతులు భద్రంగా తిరిగి ఇస్తాను. మీ ఏకాంత వాసానికి ఎట్టి భంగమూ కలిగించను. మీ ఉనికి ఎవరికీ తెలియనివ్వను.

మీ నైతిక ప్రోత్సాహం చాలు నాకు. అది మీరవలంబించిన జీవన విధానం ద్వారా ఇప్పటికే పుష్కలంగా అందించారు.

ఈ హెలికాప్టర్ ప్రమాదం, నా జాతి పునర్జీవనానికి దారితీయటం చాల సంతోషంగా ఉంది."

సింగయ్యను కౌగలించుకున్నాడు ఏకాంతరామయ్య.

'ఇన్నాళ్ల నా తపం ఫలించే రోజు వచ్చింది' తనలో తనే అనుకున్నాడు.

భుజాన పుస్తకాల సంచితో, ఘనీష్ ద్రవీ చెరోచేయిపట్టుకు నడుస్తుండగా, ఆ అడవి లోంచిజనారణ్యంలోకి, ఎంత దూరమైనా నడ వగలమన్న ఉత్సాహంతో, పయనమయ్యాడు సింగయ్య.

అయితే, గమ్యం తెలియని మార్గంలో, ఫలితం తెలియని నైరాశ్యంలో, చీకటిలో సతమతమవుతూ వచ్చిన తొలి ప్రయాణానికీ, నిర్దిష్ట గమ్యంతో, భవిష్యత్తుమీది ఆశతో, పోగొట్టుకున్న పెన్నిధిని తిరిగి పొందాలనే దృఢ నిశ్చయంతో, వెలుగులకైసాగుతున్న ఈ ప్రయాణానికి ఎంత తేడా!



# బౌద్ధం - వైజ్ఞానిక మార్గం

బొర్రా గోవర్ధన్
93906 00157

## 19. జ్ఞానం...కోరిక... తృష్ణల... పుట్టుక

గత సంచికలో భవచక్రంలోని 12 దశల్లోని అవిద్య, సంఖార, విజ్ఞానం అనే మూడు దశలగురించి తెలుసుకున్నాం. ఇక, మిగిలిన దశలగురించి ఇప్పుడు తెలుసుకుందాం.

**4: నామ**

'నామ, రూప' అనే రెండు దశల్నీ కలిపి నామ-రూప దశ అంటారు. ఈ నామరూప దశతో జీవికి 'సొంత తనం' మొదలవుతుంది. మనిషికి మనిషిగా, కుక్కకు కుక్కగా, గుర్రానికి గుర్రంగా... వాటివాటి స్వజాతి లక్షణాలు బహిర్గతం అవుతాయి. దీన్నే తాత్త్విక పరిభాషలో "నేను" అని చెప్పుకోవచ్చు. మానవపిండానికి ఈ దశ 3 నెలలకి వస్తుంది. తల్లితో 'పేగు' బంధం ప్రారంభమవుతుంది.

బౌద్ధం ఏం చెప్తుందంటే 'నామరూప' పుట్టుకతో 'కాయికజీవి' ఏర్పడుతుంది అని. ఇక్కడ కాయిక అంటే కాయం, అంటే శరీరం. ముందే చెప్పుకున్నట్లు నామ అంటే మైండ్ లేదా మనస్సు అని. అంటే ఓ మనోవ్యవస్థ. రూపం కంటే నామమే ముందరి దశ అని చెప్తుంది. ఎందుకంటే... నామ అంటే మనం ఈనాడు అనుకునే నామం(పేరు) కాదు. 'పేరు' పొందడానికి కావలసిన కాయిక స్థితి. ఈ స్థితిని నిర్వహించడానికి కావలసిన ఒక వ్యవస్థ. ఈ సృష్టిలో ప్రతిజీవికీ సొంత ఆలోచన ఉంది. ప్రతిజీవికీ విజ్ఞానం అందుతుంది. ప్రతిజీవీ ఎంతో కొంత జ్ఞానం పొందుతుంది. ఆ జ్ఞానం పొందడంలో ఎక్కువ తక్కువలు ఉండొచ్చు. కానీ... జ్ఞానం పొందడం తప్పనిసరి. ఈ జ్ఞానమే ప్రతిజీవి పుట్టుకలో మిగిలిన అంశాలకంటే ముందుగానే వ్యక్తం అవుతుంది. జ్ఞానానికి కేంద్రం మెదడు కదా!. కాబట్టి జీవుల్లో పిండ దశలోనే వ్యక్తావ్యక్తంగా తొలిగా అగు పించేది మెదడే.



3వారాల పిండం

మానవ పిండంలో కూడా అంతే. 21వ రోజున ముద్దలాంటి పిండంలో ఒక చిన్న ట్యూబులాంటి భాగం ప్రత్యేకంగా ఏర్పడుతుంది. ఆ భాగమే ఆ తర్వాత మెదడు, వెన్నుపాముగా మార్పు చెందుతుంది. నాడీవ్యవస్థగా రూపొందు తుంది. ఇలా ఏర్పడ్డ మెదడు కాలక్రమంలో న్యూరాన్లను (నాడీకణాలు) నిర్మించుకొంటూ 4వ నెల చివరికి శరీరాన్నంతా తన ఆధీనంలోకి తెచ్చుకుంటుంది.

"నేను" అంటే ఇదే. మనం "నేను", "నేను" అంటాం చూడండి. నేను అంటే నా జ్ఞానమే. నా ఆలోచనే. శరీరాన్ని "నా దేహం" అంటాం. అంటే నా యొక్క దేహం. అంటే "నా"కు సంబంధించినది, లేదా "నేను" ఉండే దేహం అని. దేహానికంటే "ఆలోచనకే" అగ్రపీఠం వేస్తాం. కాబట్టి "నేను" అంటే ఆలోచన కాబట్టి ఆలోచనే (విజ్ఞానమే) మొదటిది.

ఆ తర్వాతే 'దేహం', అదే రూపం.

విజ్ఞానకేంద్రం "మనస్సు" అని బౌద్ధం చెప్పింది.

మనం ఇంతకుముందు చెప్పుకొన్నాం. మానవపిండంలో 21వ రోజున మెదడు ప్రాథమిక రూపం మొలకెత్తుతుందని. ఆ తర్వాత రెండోరోజే అంటే పిండం 23వ రోజున గుండె (హృదయం) ప్రాథమిక రూపం పుట్టుకొస్తుంది.

"నాకు నేను" అని ప్రత్యేకంగా ఒక జీవి 'ఎరిగే'దశ 'నామ'దశ. ఈ 'ఎరిగే' దశ మొద లయ్యాక, ఇక ముద్దలా ఉన్న జీవిలో 'అవ యవాలు' ఏర్పడే దశ ప్రారంభమవుతుంది.

అంటే ఎదిగేదశ మొదలవుతుందన్నమాట. దీన్నే 'రూప'దశ అంటాం.

**5. రూప :**

మానవ పిండాన్ని చూస్తే ఈ దశలో తల్లిగర్భంలో చిక్కుడు గింజ (4 సెం.మీ) అంత సైజులో ఉంటుంది. ఈ చిక్కుడు గింజ సైజు పిండానికి మెదడు, హృదయం తర్వాత 28వ రోజు రెండు చిన్న చుక్కలు కనిపిస్తాయి. ఇవే ఆ తర్వాత 'కళ్ళు'గా మారతాయి. అంటే జ్ఞానేంద్రియాల పుట్టుక ప్రారంభమైందన్న మాట.. ఇలా శరీర భాగాలు నిర్మాణమయ్యేదశే రూపదశ. ఈ దశని బౌద్ధం 3 భాగాలుగా విభజించింది.




1. కాయకం (శరీర భాగాలు)
2. భవం (లైంగికత)
3. విజ్ఞానకేంద్రం (ఆలోచనల కేంద్రం)

ఇందులో 4 భూతాల నుండి 4 జ్ఞానాలు పుట్టాయని చెప్తుంది. నేల నుండి పోషకాలు లభిస్తాయని, నీటివల్ల రుచిజ్ఞానం, అగ్నివల్ల రంగులు గుర్తించే జ్ఞానం, వాయువు వల్ల వాసన జ్ఞానం కలుగుతాయని... ఈ జ్ఞానాలు ప్రాథమిక దశలు, వాటికి చెందిన అవయవాలు పుడతాయనీ చెప్పింది. అంటే... మన శరీర అవయవ నిర్మాణానికి ఈ 'భూతాలు' ఇటుకల్లాంటి మూల పదార్థాలన్నమాట.అలా కాయక స్థితి కలుగుతుంది. ఇక రెండో విషయం భవం. ఇక్కడ భవం అంటే లైంగికత. శరీర నిర్మాణదశలోనే లైంగిక అవయవ నిర్ణయం జరుగుతుంది. ఈ లైంగిక నిర్మాణానికి 'గ్రంథులు' మూలం అని ఆధునిక విజ్ఞానశాస్త్రం చెప్తుంది. లైంగిక అవయవ నిర్మాణానికంటే ముందే.. అసలు క్రోమోజోముల (ఎక్స్-వై) కలయికే లైంగికతకు మూలం. అయితే... బౌద్ధం ఈ లైంగికతను ఒక 'తత్త్వం'గానే చెప్పింది. తన సిద్ధాంతానికి ప్రధానమైన 'కోరిక' లేదా 'తృష్ణ'ల నుండే ఈ లైంగిక విషయాన్ని విశ్లేషించింది. ఈ లైంగికత బౌద్ధం ప్రకారం కూడా నిర్మాణక్రమం ఈ 'నామరూప' దశలోనే వ్యక్తంఅయినా, అసలు గర్భంలో పడ్డపుడే ఈ నిర్ణయం జరిగిపోతుందనీ చెప్పింది. అయితే... కొత్తగా పుట్టే ఈ జీవికి 'స్త్రీ' వాంఛ కలిగితే అది 'మగ'జీవిగా, 'పురుష'వాంఛ కలిగితే అది 'స్త్రీ'జీవిగా అవుతుందని చెప్పింది. స్త్రీ వాంఛ పురుషులకూ, పురుషవాంఛ స్త్రీలకూ ఉండడం ప్రకృతి లక్షణం కదా!







ఇక మూడోది విజ్ఞానకేంద్రం. ఈ కేంద్రం మనస్సులోనే ఉంటుంది.

మనం ఇప్పటిదాకా చెప్పుకున్న ఈ నామ రూప దశలో మానవదేహం ఆరు ఆయతనాలు, ఆరు ఇంద్రియాలు (కన్ను, చెవి, ముక్కు, నాలుక, శరీరం, మనస్సు).. ఇంకా ఇతర కర్మేంద్రియాలైన కాళ్ళూ, చేతులూ, లైంగిక అవయవాలు, విసర్జన వ్యవస్థలూ... అన్నీ ఒక నిర్దిష్ట యంత్రంగా రూపొందుతుంది.

తన 'బుద్ధదర్శనం'లో నారద మహాథేర ఇలా అన్నారు:

*"మామూలు యంత్రాలు మొదట్లో సంక్లిష్టంగా ఉండి తరువాత సులభంగా మారతాయి. కానీ, మానవయంత్రం మొదట సులభంగా ఉండి రానురాను సంక్లిష్టంగా రూపొందుతుంది"* అని.

ఇలా శరీర నిర్మాణం ప్రారంభమై, కొద్దికొద్దిగా అవయవాలు ఏర్పడే దశ మానవపిండానికి 3, 5 నెలల మధ్య ఉంటుంది. ఈ సమయంలో పిండం 18 సెంటీమీటర్ల సైజుకు వస్తుంది. దీన్ని 'భ్రూణం' అంటాం. తల్లి శారీరక స్థితిలో ఈ నెలల్లో ఒక విధమైన మార్పు కలిగి, తల్లి అసహనానికి, అసౌకర్యానికి లోనవుతుంది..




ఆరవ నెలలో (24వ వారం) ఈ భ్రూణం తన జ్ఞానేంద్రియాలతో 'స్వంత' అనుభవాల్ని గ్రహించడం ప్రారంభిస్తుంది. ఈ దశే.. భవ చక్రంలో ఆరోదశ అయిన "స్పర్శ" దశ.

**6. స్పర్శ :**

బైటి విషయాల్ని తెలుసుకుని "ఇది ఫలానా?" అని గుర్తించుకోవడమే జ్ఞానం. మనకు ఈ జ్ఞానం ఐదు ఇంద్రియాల ద్వారా అందుతుంది. కంప్యూటర్ పరిభాషలో ఇవి 'ఇన్‌పుట్' డివైజర్లు... కన్నుద్వారా చూడడం, చెవిద్వారా 'వినడం', నాలుక ద్వారా రుచి, చర్మం ద్వారా స్పర్శ, ముక్కు ద్వారా వాసన.. ఇవీ మనం చెప్పుకొనే ఐదు జ్ఞానేంద్రియాలూ, ఐదు జ్ఞానాలు. అయితే, బౌద్ధం వీటితోపాటు మరో ఇంద్రియాన్ని చేర్చింది. అదే మనస్సు. ఈ ఆరు ఇంద్రియాలు 6 విషయాల మీద, 6 జ్ఞానాల్ని పొందుతాయి. 6 ఇంద్రియాలు+6 విషయాలు+6 జ్ఞానాలు ఈ 18 నీ కలిపి 'ధాతువులు'గా పేర్కొంది బౌద్ధం. (వాటి వివరణ గతంలో చూశాం.)

జ్ఞానార్జనలో ఈ మూడూ ప్రధాన అంగాలు. కన్ను ఉంటుంది. కానీ వస్తువు లేదనుకోండి కన్ను దేన్ని చూస్తుంది?

చెవి ఉంటుంది. కానీ ఏ శబ్దమూ ఉండదనుకోండి. చెవి దేన్ని వింటుంది?

అంటే.. చూచే 'కన్ను' ఉండాలి. అది చూడ్డానికి ఒక వస్తువూ ఉండాలి. అంటే కన్ను (ఇంద్రియం), రూపం (విషయం) ఉండాలి.

మరి చనిపోయిన వ్యక్తికి కన్నూ ఉంటుంది. ఆ కంటికి ఎదురుగా 'రూపాలూ' ఉంటాయి. ఆ వ్యక్తి కంటిమీద రూపాలన్నీ పడుతూనే ఉంటాయి. బ్రతికిన వ్యక్తి కంటిమీద రూపాలు ఎలా పడతాయో అలాగే ఆ మరణించిన వ్యక్తి కంటిమీద కూడా పడుతూనే ఉంటాయి..

కానీ, ఆ వ్యక్తి.. ఈమె నా 'భార్య', ఈమె నా కూతురు, వీడు నా కొడుకు... వీడు నా స్నేహితుడు.. వీడు ఫలానా అని గుర్తించలేడు. అంటే.. కేవలం అతని కన్ను ఒక అద్దంలా మాత్రమే పనిచేస్తుంది. ఆ రూపాలు అద్దం మీద పడే బొమ్మల్లా మాత్రమే ఉంటాయి. ఆ రూపాన్ని అనుసంధానం చేసుకొని, జ్ఞానంగా మలచుకుని, గుర్తించుకునే 'శక్తి' ఆ మనిషికి ఉండదు. ఆ చనిపోయిన వ్యక్తి కోల్పోయిన ఆ శక్తే 'విజ్ఞానం' లేదా 'జ్ఞానపరికర్మ'. రూపాన్ని ఇంద్రియం ద్వారా గ్రహించి, 'తన'లో నిలుపుకునే ప్రక్రియే ఈ ప్రక్రియ. ఈ ప్రక్రియలు లేకపోతే.. జ్ఞానానికి అవకాశమే లేదు. 'స్పర్శ' అంటే ఇదే. స్పర్శ అంటే తాకడం, అంటుకోవడం అంటాం కదా! అదే ఇది. బాహ్య ప్రపంచ 'రూపాన్ని' ఇంద్రియం ద్వారా తాకడం లేదా అంటుకోవడం. అంటే... జ్ఞాన పరికర్మ స్పర్శ అన్నమాట. ఇంకా ఖచ్చితంగా చెప్పుకోవాలంటే...

ఇంద్రియం +విషయం+ జ్ఞానం...... ఈ మూడింటి సంయోగమే స్పర్శ.

అంటే...

కన్న+రూపం+చక్షువిజ్ఞానం.. ఈ మూడింటి సంయోగమే స్పర్శ. అలాగే మిగిలిన ఐదు ఇంద్రియాలూ, వాటి విషయాలూ, వాటి జ్ఞానాలూ.

స్పర్శ దశకు వచ్చిన తర్వాత మానవ భ్రూణాన్ని "భ్రూణం" అనకూడదు. "శిశువు" అనే అనాలి. ఎందుకంటే జీవికి తనదైన "సొంతతనం", "అహం", లేదా "నేను" అనే మనోవిజ్ఞానకేంద్రం తన పని ప్రారంభిస్తుంది. "శిశువు" దశకు చేరాక ఇక కొత్తగా అవయవ నిర్మాణం జరగదు. ఆ అవయవ నిర్మాణదశ అంతా 'భ్రూణ'దశలోనే. లేదా నామ-రూప దశలోనే. మానవజీవికి ఆరో నెలతో ఈ ఆరోదశ అయిన స్పర్శ దశతో శిశుదశ ప్రారంభం అవుతోంది. ఇక ఈ దశనుండి కొత్తగా అవయవ నిర్మాణం జరగదు. ఏర్పడ్డ శరీర అవయవాలన్నీ అభివృద్ధి మాత్రమే చెందుతాయి.. ఈ దశలో మానవ శిశువులో జ్ఞానేంద్రియాలు పనిచేయడం ప్రారంభిస్తాయి. 24 వారాలు దాటాక మానవశిశువు.. తొలిసారిగా తల్లిగర్భానికి వెలుపల ఉన్న బాహ్యవాతావరణంతో సంబంధం పెట్టుకుంటుంది. జ్ఞానేంద్రియాలన్నీ పని ప్రారంభిస్తాయి. బాహ్య ప్రపంచంలోని వెలుతురుని ఆ శిశువు గ్రహించగలుగుతుంది. ధ్వనులు వింటుంది. ఉలిక్కిపడుతుంది. తల్లి గొంతు నుండి వెలువడే ధ్వనుల్ని బాగా వింటుంది. శిశువు నాలుక మీద రుచి బుడిపెలు మొలకెత్తుతాయి.




అయితే... ఈ దశలో ఈ అనుభూతులేవీ అంతగా 'జ్ఞాపకం' ఉండవు. తెలుసుకుంటుంది, గ్రహిస్తుంది. కానీ మరచేపోతుంది... అది వాటిని గుర్తించుకోవాలంటే దాని మెదడు 'జ్ఞాపక శక్తి'ని నిద్రలేపాలి. నిజానికి మెదడు ఇప్పటి వరకూ కేవలం శరీరాన్ని మాత్రమే నియంత్రిస్తూ ఉంటుంది తప్ప "జ్ఞాపకం" నిలుపుకోలేదు. బౌద్ధం చెప్పిన ఈ "స్పర్శ" దశ మానవ జీవితంలో 24, 25 వారాల శిశు దశలాంటిది. ఈ దశలో జ్ఞానం కలుగుతుంది. కానీ, అది ఎక్కువకాలం 'జ్ఞాపకం'గా నిలబడదు. అలా నిలబడాలంటే... ఆ శిశువు...విజ్ఞానశాస్త్రం ప్రకారం మరో వారం ఆగాలి. బౌద్ధం ప్రకారం "వేదన" దశలోకి మారాలి.

**7. వేదన**

వేదన అంటే అనుభూతి చెందడం. అనుభూతి చెందడమే జ్ఞానం. నెయ్యి 'వాసన' చూస్తాం. అది మనకు ఎంతో బాగుంటుంది. ఆ 'వాసన' తాలూకు జ్ఞానం మనలో నిలబడిపోతుంది. ఒక 'కుళ్ళిన' పదార్థాన్ని వాసన చూస్తాం. మనకు ఆ వాసన అసహ్యం అనిపిస్తుంది. అయినా దాని తాలూకు జ్ఞానం మనలో నిలబడిపోతుంది. 'జ్ఞానం' ఇలా నిలబడిపోవడమే 'అనుభూతి'. ఈ 'అనుభూతి' కలగకపోతే, మరోసారి ఆ వాసనని మనం పీల్చినపుడు 'అది ఫలానా నెయ్యి వాసన' అని గుర్తించలేం. ఆ వాసన బాగుంది అని అనుకోలేం. అలాగే... రంగులూ, శబ్దాలూ, స్పర్శలూ ఇవన్నీ. ఇష్టం, అయిష్టం – ఇవే వేదన.

ఇక్కడొక ప్రత్యేకమైన అంశాన్ని మనం గుర్తించుకోవాలి. ఇలా బాహ్య ప్రపంచం నుండి వచ్చిన జ్ఞానాన్ని "అంది పుచ్చుకునేది ఎవరు?" లేదా "అంది పుచ్చుకునేది ఏది?".. అని ప్రశ్నించుకుంటే..

"ఈ అందిపుచ్చుకునేది 'ఆత్మ'.. అంటే పునర్జన్మ పొందిన ఆత్మ" అని వైదికం, ఉపనిషత్తులు చెప్పాయి.

"ఈ అందిపుచ్చుకునేది మనస్సు. అదో మానసిక స్థితి. మనోవైజ్ఞానిక కేంద్రం" అని బౌద్ధం చెప్పింది.

అసలు "వేదన" అంటే 'విదజ్ఞానే వేదనా' లేదా 'సంవేదో వేదనానన' అంటారు. అంటే... 'అనుభవించేదే వేదన' అని.

"ఒక వస్తువు, ఇంద్రియాలతో స్పర్శలోకి వచ్చినప్పుడు అనుభవంలోకి వచ్చేదే వేదన" అంటుంది బౌద్ధం.

ఈ 'వేదన' దశ మనోవిజ్ఞానశాస్త్ర ప్రకారం చూస్తే "మనో నిర్మితికి" పునాది అనొచ్చు.

**8. తృష్ణ**

మనం ఇంతకు ముందే చెప్పుకున్నాం. పై దశలో ఇంద్రియాలద్వారా జ్ఞానం అందుతుంది కానీ, అది ఎక్కువకాలం నిలబడకుండా పోతుంది అని. మానవ శిశువులో 27వ వారంలో మెదడు తొలిగా "జ్ఞాపకం పెటుకోవడం" ప్రారంభిస్తుంది. అంటే 'కలిగిన' అనుభూతిని అప్పటికప్పుడు అను భవించి వదిలేయకుండా పదిల పరచు కుంటుంది అన్నమాట. ఇలా పదిల పరచు కోవడంతోనే 'తృష్ణ' ప్రారంభమవుతోంది. తృష్ణ అంటే కోరిక, ఇచ్ఛ. ఖచ్చితంగా చెప్పు కోవాలంటే "విషయాల మీద కలిగే తెంపులేని ఆశ".

"తృష్ణ పానాయాం తృష్ణ" అంటారు. పానం చేయాలనే కోరికే తృష్ణ. పాళీభాషలో దీన్ని 'తన్హ' అంటారు.

'ఒక అనుభూతి మనకు సుఖాన్నిచ్చింది అనుకోండి' దాన్ని మళ్ళీ కావాలని కోరు కుంటాం.

ఒకరికి 'సెంటు' వాసన సుఖానుభూతి నిచ్చింది అనుకోండి. మరలా ఆ వాసనే పీల్చా లనుకుంటారు. ఇలా ఎందుకు 'అనుకుం టాడు?' ఎందుకంటే ఇలా అనుకొనేట్టు చేసేదే తృష్ణ. గత అనుభూతి జ్ఞాపకం ఉంటేనే ఇది కలుగుతుంది. జ్ఞాపకం లేకపోతే కలగదు కదా!

అందుకే వేదన నుండి తృష్ణ ఉద్భవి స్తుంది. మరి, ఈ వేదన, దానికంటే ముందరిదైన 'స్పర్శ' నుండి పుట్టుకొస్తుంది. ఇదే ప్రతీత్య సముత్పాదం అంటే. ఒక 'దశ' నుండి మరో 'దశ' పరిణామం చెందడమే. ఒక దాన్నుండి మరొకటి పుట్టడమే. ఈ క్రమంలోనే తృష్ణకూడా పుట్టుకొచ్చింది. ఇంద్రియ వాంఛలే తృష్ణలు. తృష్ణనే రాగం అనీ అంటాం. అతి సాధారణ భాషలో చెప్పుకోవాలంటే "మారాం" అనొచ్చు. నాకు అది కావాలీ ఇది కావాలీ అని 'మారాం' చేస్తాం గదా! ఆ మారామే తృష్ణ. మంచివైనా చెడ్డవైనా తృష్ణలు తృష్ణలే.

"దుఃఖానికి కారణం 'కోరికలే' అని బుద్ధుడు చెప్పాడని బౌద్ధం లోతులు తెలియని వారిక్కూడా తెలిసే విషయం. నిజమే, ఎందు కంటే ఈ భవచక్రంలో అత్యంత కీలకమైన దశ ఈ 'తృష్ణ'. బౌద్ధతత్త్వ పునాదే తృష్ణ. "తృష్ణా నిరోధమే నిర్వాణం" అంటుంది బౌద్ధం. మొత్తం మీద "గుర్తు పెట్టుకున్న అనుభూతులను మరలా మరలా కోరుకోవడమే" తృష్ణ.


28 వారాల పిండం

తల్లికడుపులో ఉన్న మానవ శిశువుకు ఈ దశ 27వ వారంలో కలుగుతుంది అని ఇంతకుముందే చెప్పుకున్నాం. ఇలా ఈ 'జ్ఞాపకశక్తి' కలగగానే ఆ శిశువుకు కలిగే తృష్ణలు మొదటిగా రెండే రెండు. మొదటిది 'రుచి', రెండోది 'శబ్దం'. రుచి తృష్ణ కలిగిన శిశువు తన బొటనవ్రేలుని చీకుతుంది. ఇలా చీకుతూ రుచిజ్ఞానం అనుభూతిని పొందుతుంది. ఇక రెండోది 'శబ్దం' ఈ వయసులోనే శబ్దాలను వింటూ ఆనందిస్తూ... ఆ శబ్దాల్ని వేరువేరుగా గుర్తించగలుగుతుంది. తల్లి కంఠధ్వనిని చక్కగా గుర్తిస్తుంది.

జ్ఞానేంద్రియాల ద్వారా జ్ఞానాన్ని పొంది, ఆ జ్ఞానాన్ని గుర్తుపెట్టుకొని, వాటి పట్ల 'అనురాగం' పెంచుకోవడమే తృష్ణ.

తొండ ముదిరితే ఊసరవెల్లి అయినట్లు ఈ తృష్ణ ముదిరి "ఉపాదానం" అవుతుంది.

**౯. ఉపాదానం :**

ఉపాదానం అంటే పట్టుకుని వేళ్ళాడడం. వదలకుండా అంటిపెట్టుకుని ఉండడం. తగులుకొనడం. అలవాటు. ఉపాదానాన్ని బౌద్ధంలో 'గ్రహణం' అని కూడా అంటారు. గ్రహణం అంటే "అతి తీవ్ర తృష్ణ" అని. ఈ "ఉపాదాన దశ లక్షణం ఎలా ఉంటుందో పైన మనం చెప్పుకున్న తృష్ణకు చెందిన రెండు విషయాల గురించే ఇంకాస్త విడమరచి చెప్పుకుందాం.

మొదటగా శిశువు వ్రేళ్ళు చీకటం చూద్దాం. 'తృష్ణ' దశలో రుచి జ్ఞానానికి చెందిన రసానుభూతి ఇది. తల్లి కడుపులో ఉన్నప్పుడు శిశువు ఆ రుచికి అలవాటు పడి ఎప్పుడూ అలా నోట్లో వ్రేళ్ళు పెట్టుకునే నిద్రపోతూ ఉంటుంది. ఆ తరువాత పుట్టాక కూడా ఈ అలవాటు వదలదు. తల్లిదండ్రులు కొట్టి మాన్పిస్తారు. మానడానికి పిల్లలు ఇష్టపడరు. కారణం? వ్రేళ్ళు చీకేప్పుడు లాలాజల గ్రంథి స్రవించి రుచిని కల్గిస్తుంది. కొట్టే పెద్దలు కూడా ఈ అలవాటు జీవితాంతం మానలేరు. అన్నం తిన్నాక వ్రేళ్ళు చీకడం ఈ తృష్ణలో భాగమే. వ్రేళ్ళు నాకే రుచి మధురంగా ఉంటుంది. కారణం మామూలే. ఆ సమయంలో లాలా జలగ్రంథులు ఉత్తేజం పొందుతాయి. ఇలా వ్రేళ్ళు చీకితే... తిన్న తిండి వంటపడు తుందం టారు. స్పూన్‌లతో తింటే వంట బట్టదంటారు. (మాతృభాషలో కాకుండా పర భాషల్లో చదివితే విషయాన్ని అవగాహన చేసు కోలేని విద్యార్థి చదువుని స్పూన్ ఫీడింగ్ అంటాం) ఇలా.. ఈ రుచి 'తృష్ణ' మనల్ని వదల కుండా పట్టుకు వ్రేళ్ళాడుతుంది. ఇలా వేళ్ళాడటమే ఉపాదానం.

ధ్వని కూడా అంతే. శిశువు మొదటగా తల్లి కడుపులో ఉండి బాహ్య ధ్వనుల్ని వింటూ, గుర్తించ కలుగుతుంది. ఆ వయసులో వినే ధ్వనుల పట్ల, సంగీతం పట్ల శిశువు ఆసక్తిని పెంచుకొంటుంది. ముఖ్యంగా తల్లి స్వరం పట్ల. అలాగే తల్లి గుండె చప్పుడు కూడా. అందుకే.. వీపుమీద జోకొడుతూ తల్లి పాటపాడితే.... ఆమె స్వరం లీల, సుశీల స్వరాలంత మాధుర్యంగా లేక పోయినా ఆ శిశువు హాయిగా నిద్రపోతుంది. ఇదీ 'ఉపాదాన'మే. ఈ దశకు వచ్చే సరికి మనకు 8 నెలలు గడుస్తాయి.


38 వారాల పిండం

జ్ఞానంతోపాటు ఇష్టాయిష్టాలు ఏర్పడ తాయి. ఈ దశలో 'ఇన్సులిన్' ఉత్పత్తి అవు తుంది. జీవనాన్ని నిర్దేశిస్తుంది. 'వ్యక్తిగతం' ప్రారంభం అవుతుంది. వ్యక్తిగతం ప్రారంభ మయ్యాక పరాధీనంగా ఉండలేం. గర్భలోకం నుండి బాహ్యలోకంలోకి రావాలని పరిత పిస్తాం. ఈ పరితపనే భవం.

**౧౦. భవం :**

భవం అంటే పరిణమించడం. బౌద్ధం ఈ భవాన్ని రెండు రకాలుగా వివరించింది.

ఒకటి: పరిణామ ప్రక్రియకీ, నిర్మాణం శాలకీ, ప్రకృతి జీవితానికీ సంబంధించిన 'కమ్మభవం'.

రెండోది: క్రియారహితమైన ధార్మిక భావాలకి చెందిన 'ఉపపత్తి భవం'.

కమ్మభవం అంటే... ఇది భవా(ఉద్భవం, పుట్టడం)నికి చెందిన ప్రాకృతిక అంశం.

ఒక్కమాటలో చెప్పాలంటే ఇది 'ఉత్పత్తి'. దేన్నైనా ఎప్పుడు 'ఉత్పత్తి' అంటాం? ఫలం సిద్ధించాకే. ఫలితం దక్కాక. పూర్తిగా ఫలవంతం అయ్యాక.. దాన్ని ఉత్పత్తి అంటాం. ఏ జీవి అయినా తన సహజరూపాన్ని, తన మనస్తత్వాన్ని పూర్తిగా సంతరించుకున్నాకే పుట్టగలుగుతోంది. దాన్నే "పుట్టింది" అంటాం.

కంకిలో విత్తనం పూర్తిగా తయారవ కుండా ఉంటే ఆ పం[illegible]సుకుపోయింది" అంటాం. పంట "పండింది" అనం.

పశువులు తమ దూడల్ని పూర్తిగా తయారుకాకుండా ముందే కంటే... దాన్ని 'ఈనుకు' పోయింది అంటాం. "ఈనింది" అనం.

అలాగే...మనిషి కూడా. శిశువు శారీరకంగా, మానసికంగా తయారు కాకుండా.. నెలలు నిండకుండానే పుడితే... 'గర్భస్రావం' జరిగిందంటాం. "ప్రసవం" అనం. ఇలా... ఒక జీవి పూర్తి సహజ లక్షణాలనీ, మనోస్థితినీ కలిగి పుట్టడానికి సిద్ధంగా ఉండేదశ ఇది అని చెప్పుకోవచ్చు. ఈ భవం నుండే.. జన్మ, జరామరణాలు సంభవిస్తాయని చెప్పింది బౌద్ధం.

మరణం అంటే పదార్థం అంతరించడం కాదు. పదార్థం ఒక 'వ్యక్తిగా' ఉనికి కోల్పోవడం మాత్రమే.

పుట్టడం అంటేనే మరణం. పుట్టనిది ఏదీ మరణించదు. విచిత్రం ఏమంటే... ప్రతి జీవి ఈ 'భవ' స్థితికి రాగానే 'జన్మ'దశకు చేరుకుంటుంది. జన్మంటే మరణానికి దారే కాబట్టి ఆ మరణదశ ఈ భవ దశతోనే ప్రారంభం అవుతుంది.



40 వారాల పిండం

మానవ శిశువులలో కూడా.. శుక్ర, అండకణాలు కలిసిన తొలిక్షణం నుండి... ఆ కణాలు విభజన చెందుతూ, పిండంగా, భ్రూణంగా, శిశువుగా పెరుగుతూ, మారుతూ, కొత్తకొత్త శరీరభాగాలు నిర్మించుకొంటూ ఉంటుంది. ఈ 8 నెలల కాలంలో జీవకణాల ఉత్పత్తే గానీ నాశనం ఉండదు. పుట్టే కణాలే గాని, గిట్టే కణాలే ఉండవు. 8 నెలలు నిండిన తరువాత 266వ రోజు నుండి జీవకణాల మరణం మొదలవుతుంది. మరణం మొదలయ్యిందంటే మనం పుట్టడానికి భూమిక మొదలయ్యినట్టే. అదే...జన్మ.

**11. జన్మ:**

దీన్నే జననం అంటాం. జాతి అంటాం. పుట్టుక అంటాం. పుట్టడం అంటే శరీరం ఒక్కటే పుట్టడం కాదు. మనస్సు కూడా పుట్టడమే. శారీరకంగా, మానసికంగా ఒక జీవి ఉనికిలోకి రావడమే జన్మ. కంప్యూటర్ లాగా హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌లు విడివిడిగా కాకుండా, రెండూ కలిసి వచ్చేదే జీవుల జన్మ.



జన్మించడానికి సిద్ధమవుతున్న శిశువు

ఈ భవచక్రంలోని "నామ, రూపాలు" అనే రెండు దశలు ఎలా అవిభాజ్యాలో ఈ "భవం, జన్మ" దశలు కూడా అలాంటివే.

పుట్టుకకు "భూమిక" భవం. "పుట్టుకే" జన్మ. ఇదీ తేడా. ఇప్పటి దాకా.. భవ చక్రంలో 11 దశల్ని చూశాం.

ఇంకా 12వ దశను చూడాలి. అదీ చూద్దాం.

**12. జరామరణం:**

జరా అంటే వృద్ధాప్యం. మరణం అంటే చావు. *"జీర్యంత్యనయా అంగానేతి జరా"* అంటే 'దీనిచేత అంగాలు వయోహాని పొందుతాయి' అని అర్థం. అంటే పండు ముసలితనం. మనం ఇంతకుముందే చెప్పుకున్నాం. జీవకణాల మరణ ప్రారంభం, జీవి మనుగడ ప్రారంభం ఒకసారే మొదలయ్యిందని. ఈ 'మనుగడ'నే మనం పుట్టుకకూ మరణానికీ మధ్య ఉన్న 'జీవితం' అంటాం. ఇందులో బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం ఇలా దశలుంటాయి.

వీటిలో తొలిదశల్లో 'పుట్టే జీవకణాలు ఎక్కువ, మరణించే జీవకణాలు తక్కువగా ఉంటాయి. యవ్వన దశలో పుట్టేవీ మరణించేవి సమానంగా ఉంటాయి. ఇక వృద్ధాప్యంలో పుట్టేవి తక్కువ, మరణించేవి ఎక్కువగా ఉంటాయి. చివరికి పుట్టేవిలేకపోగా మరణించేవే ఉంటాయి. ఇది మనిషికే కాదు.. ప్రతిజీవికీ, ప్రతి జీవపదార్థానికీ ఉండే స్థితే.

బౌద్ధం ఈ జరామరణాల్ని 'పుట్టుక వల్ల వచ్చే అనివార్య ఫలాలు' అంటుంది. వీటి వల్లే దుఃఖం పుడుతుంది అని చెప్పింది. ఈ దుఃఖాన్ని పోగొట్టడానికే బౌద్ధతత్త్వం పుట్టింది. మనిషికి అనివార్యమైన ఈ దుఃఖాన్ని పోగొట్టడానికే అసలు తత్త్వశాస్త్రం పుట్టింది. ఏ తత్త్వవేత్త ఏం చెప్పినా ఈ దుఃఖాన్ని రూపుమాపడం కోసమే చెప్పాడు.

చివరికి మనం ఈ భవచక్రంలో ఆఖరిదైన 'జరామరణానికి' వచ్చి దాని ఫలితం "దుఃఖం" అని తేల్చాం.

ఈ చక్రంలో... జరామరణాల తర్వాత తిరిగి మొదటిదైన 'అవిద్య' దశ ప్రారంభం కావాలి.

మరణానంతరం అవిద్యదశ ఎలా ప్రారంభమవుతుందో బౌద్ధంలో ఉంది.

(అది వచ్చే సంచికలో ....)

కవిత

## అమ్మనోటి తేనెపట్టు

కొందరు అనామకులు
పరభాషా చెట్టుకిందకు చేరి
తాత్కాలిక వెలుగులతో
తారలై మెరిసిపోతూ
చంద్రుడిలో ప్రశాంతతను తలదన్నే
అమ్మ భాషను అనాధగా విసిరేస్తున్నారు
రెక్కలొచ్చిన బిడ్డలు ఎగిరిపోతే
తల్లికి కోపం వచ్చునా
పరభాషను పలుకరిస్తే
మాతృభాషకు ద్వేషం కలుగునా
అమ్మ నోటికి పట్టిన తేనెపట్టులో
మాధుర్యం ఎన్నడైనా మారునా
ఆలోచించరా తెలుగింటి చిట్టినాయనా
నీ భాష సౌష్టవం
మెరిసే మేరుపర్వతం నాన్నా
ఎన్నడూ తెలుగు చేయిని వదలకుమా కన్నా
తెలుగంటే నీకు
శాశ్వత వెలుగునిచ్చే దివ్వెరా చిన్నా

అభిరామ్
9704153642

పిట్ట చూపు

చలసాని నరేంద్ర
9849569050

# ప్రశ్నార్థకంగా మారుతున్న ప్రజాస్వామ్య పునాదులు

మనది ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం. అనేక ఆటు పోట్లు ఎదురవుతున్నా క్రమం తప్పకుండా ఎన్నికలు జరుగుతూ ఉండటం, తమకు తిరుగు లేదు అనుకున్న అనేకమంది పాలకులను ప్రజలు అధికారం నుండి తొలగించడం జరుగుతూ వస్తున్నది. మన ఎన్నికలలో కులం, మతం, ధనం వంటి ప్రభావాలు ఉన్నాయని భావిస్తున్నా, నేరస్థులు రాజకీయాలపై ప్రభావం చూపుతు న్నారని కొన్ని పౌర సమాజ సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా మొత్తం మొత్తం మీద చాల విజ్ఞతతో మన ప్రజలు ఓటు వేస్తున్నారు.

అంతగా చదువు లేని, సామాజిక హోదా లేని, ఆర్థిక స్తోమతు లేని సాధారణ ప్రజలే మన ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుతున్నారని ఒక విధంగా చెప్పవచ్చు. నిర్భయంగా, స్వతంత్రంగా ప్రభుత్వాలలో మార్పు తీసుకు రాగలుగుతున్నారు. అందుకనే ఎన్నికలలో నేడు ఖర్చులు పెరుగుతున్నా, ఎక్కువ డబ్బు ఖర్చు పెట్టిన వారు గెలుస్తారనే నమ్మకం మాత్రం ఉండటం లేదు. ఒక అధ్యయనం ప్రకారం ప్రతి పది ఎన్నికలలో కనీసం ఆరు, ఏడు ఎన్నికలలో అధికార పక్షాలు ఓటమి చెందుతున్నాయి.

సాధారణంగా అధికారంలో ఉన్నవారు ప్రతిపక్షాల కన్నా ఎక్కువ డబ్బు ఖర్చు పెట్టగలరు. వారి వద్ద ఆర్థిక వనరులే కాకుండా అధికార యంత్రాంగం కూడా అందుబాటులో ఉంటుంది. అయినా కూడా ప్రజల తీర్పు పొందలేక పోతున్నారు. ఈ వాస్తవాన్ని గ్రహించలేక లభించిన అధికారం శాశ్వతమని చాలామంది ఊహా ప్రపంచంలో విహరిస్తున్నారు. తమ అధికారాన్ని శాశ్వతం చేసుకోవడం కోసం సుపరిపాలనను అందిం చడం ద్వారా ప్రజల మన్ననలు పొందే ప్రయత్నం చేయవచ్చు. కానీ ఆ విధంగా చేయకుండా మొత్తం అధికార యంత్రాంగాన్ని తమ కనుసన్నలలో మెలిగే విధంగా చేసుకొనే ప్రయత్నం చేస్తున్నారు. తద్వారా మన ప్రజాస్వామ్య పునాదులనే ప్రశ్నార్థకరంగా మారుస్తున్నారు.

స్వతంత్రంగా వ్యవహరించ వలసిన రాజ్యాంగ బద్ధ సంస్థలను సహితం తమ విధులను నిక్కచ్చిగా నిర్వహించడాన్ని సహించలేక పోతు న్నారు. తాము తప్ప మరో రాజకీయ పక్షం అధికార పరిధిలో ఉండరాదనే ఒకవిధమైన నిరంకుశ ధోరణులు వ్యక్తం అవుతున్నాయి. ఆ విధమైన ధోరణులు ప్రదర్శించిన వారెవ్వరూ ప్రజలను మెప్పించలేక పోతున్నారని గ్రహించలేక పోతున్నారు.

స్వతంత్ర భారత దేశంలో ఇందిరా గాంధీని మించిన శక్తివంతమైన నేత లేరని చెప్పవచ్చు. అయితే ఆమె తన అధికారాన్ని కాపాడుకోవడం కోసం అత్యవసర పరిస్థితిని ప్రవేశ పెట్టి అభాసుపాలు కావలసి వచ్చింది. ఎవ్వరూ ఊహించని రీతిలో ఆమెను, ఆమె కుమారుడిని కూడా ఓడిస్తూ ప్రజలు తీర్పు ఇచ్చారు. పత్రికలపై ఆంక్షలు విధించినా ప్రజలకు వాస్తవాలు చేరకుండా అడ్డుకోలేక పోయారు.

1977 తర్వాత గత నాలుగు దశాబ్దాలలో కేంద్రంలో తన పనితీరు ద్వారా తిరిగి అధికారంలోకి రాగలిగింది, తమ పార్టీని గెలిపించి గలిగింది 2009లో డా. మన్మోహన్ సింగ్ ఒక్కరే అని చెప్పవచ్చు. వాస్తవానికి చాలామంది మన్మోహన్ సింగ్ ను అత్యంత బలహీనమైన ప్రధానిగా భావించారు. కానీ ఆయన హయాంలో తీసుకు వచ్చినన్ని విప్లవాత్మకమైన చట్టాలు స్వతంత్ర భారత దేశ చరిత్రలో రానే రాలేదు. అనేక చట్టాలను ప్రతిపక్షాలతో సహా అన్ని పక్షాలను ఒప్పించి మరీ తీసుకు రాగలిగారు. సమాచార హక్కు, విద్య హక్కు, భూసేకరణ చట్టం వంటివి కొన్ని మాత్రమే.

> ఇప్పుడు రాజకీయ పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కడా కనిపించడం లేదు. చట్టసభలలో ఎక్కడా అర్థవంతమైన చర్చలు జరగడం లేదు. మంత్రివర్గ సమావేశాలలో సహితం ఏ అంశం గురించి సవివరమైన చర్చలు జరగడం లేదు. కీలక పదవులలో ఉన్న ఒకరిద్దరే ప్రతి చోట కీలక నిర్ణయాలు తీసుకొనే వారవుతున్నారు. అటువంటి పరిస్థితి నిరంకుశ ధోరణులను మాత్రమే సూచించ గలుగుతుంది. దేశానికి మాత్రమే కాదు ఆయా పార్టీలకు సహితం మంచిది కాదని గ్రహించాలి.

అయితే 1984 తర్వాత సొంత పార్టీ బలంతో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీకి పెద్దగా అడ్డు లేకపోయినా జీఎస్టీ చట్టం తీసుకు రావడానికి చాల హైరానా పడవలసి వచ్చింది. అధికారంలోకి రాగానే భూసేకరణ చట్టానికి తూట్లు పొడిచే ప్రయత్నం చేసినా, సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేసినా చేయలేక పోయారు. అనేక సంస్కరణలను ముందుకు తీసుకు వెళ్లలేక పోతున్నారు. కారణం ఏమిటి? ఒక విధంగా మన ప్రజాస్వామ్యంలోని అందమైన అంశం అదే అని చెప్పవచ్చు.

అవినీతిని అంతం చేస్తానని ప్రజలకు భరోసా ఇస్తూ నరేంద్ర మోదీ ప్రధానంగా అధికారంలోకి రాగలిగారు. ఈ దిశలో కీలకంగా పనిచేయ గలిగిన సంస్థలు సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి). ఈ రెండింటికి ఏరి కోరి సమర్థులైన అధికారులని పేరున్న అలోక్ వర్మ, కర్నల్ సింగ్ లను అధిపతులుగా తీసుకు వచ్చారు. వారు కూడా తమకు అప్పచెప్పిన బాధ్యతలను నిజాయతీతో నిర్వహించడం ప్రభుత్వానికి నచ్చలేదు. దానితో అలోక్ వర్మను అర్ధరాత్రి అర్థాంతరంగా సెలవుపై పంపి ప్రభుత్వం నవ్వుల పాలయింది. కర్నల్ సింగ్ పదవి విరమణ చేశారు.

విచిత్రం ఏమిటంటే ఇప్పుడు అలోక్ వర్మను ఆ పదవిలో కొనసాగించాలని ఉద్యమాలు చేస్తున్న కాంగ్రెస్ రెండేళ్ల క్రితం ఆయనను సీబీఐ డైరెక్టర్ గా నియమించడాన్ని పూర్తిగా వ్యతిరేకించింది. నానా రభస చేసింది. అంటే అప్పుడు కాంగ్రెస్ వ్యతిరేకించినా, ఇప్పుడు ఆయనకు మద్దతు ఇస్తున్నా, బిజెపి అపుడు కావాలని నియమించి ఇపుడు ఏవగించు కొంటున్నా – రాజకీయ కారణాలతోనే గాని, అవినీతిని అంతం చేయాలనే చిత్తశుద్ధి, ఇటువంటి సంస్థల స్వతంత్రతను కాపాడాలనే నిజాయతీ రాజకీయ పార్టీలు వేటికీ లేవని స్పష్టం అవుతున్నది.

అదే విధంగా సుప్రీం కోర్ట్ న్యాయమూర్తుల నియామకంలో కూడా ప్రభుత్వం వ్యవహరించిన తీరు వివాదాస్పదం అయింది. లోక్ పాల్ నియామకంలో జరుగుతున్న జాప్యం సహితం విస్మరింపలేము. ఎన్నికల కమీషన్ స్వతంత్రత సహితం ఈ సందర్భంగా అనుమానాస్పదంగా మారుతున్నది. తమ పరిపాలన ద్వారా, ప్రజల మన్ననలు పొందడం ద్వారా కాకుండా రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేయడం ద్వారా అధికారం కాపాడుకోవాలని ప్రయత్నించడం వ్యర్ధయత్నం కాగలవని అత్యవసర పరిస్థితి కాలంలోని ఇందిరా గాంధీ అనుభవం నుండైనా నేటి పాలకులు గ్రహించలేరా ?

రాజ్యాంగబద్ధ సంస్థలను బలోపేతం చేయడం ద్వారా దేశంలో చట్టబద్ధ పాలనకు హామీ ఇచ్చిన్నట్లు కాగలదు. తద్వారా సుపరిపాలనకు అవసరమైన భూమిక ఏర్పడుతుంది. అటువంటి పరిస్థితులలో ప్రభుత్వాలు సహితం బాధ్యతాయుతంగా వ్యవహరించకుండా తప్పించుకోలేని పరిస్థితులు ఏర్పడగలవు. ప్రజాస్వామ్యం అంటేనే ప్రతి అంశాన్ని వివిధ స్థాయిలలో కూలంకషంగా చర్చ జరిపి, ఒక నిర్ణయానికి రావడం. అనుభవాలను మదింపు చేసుకొని, మంచి మార్గాల వైపు వెళ్ళగలగడం.

ఇప్పుడు రాజకీయ పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కడా కనిపించడం లేదు. చట్టసభలలో ఎక్కడా అర్ధవంతమైన చర్చలు జరగడం లేదు. మంత్రివర్గ సమావేశాలలో సహితం ఏ అంశం గురించి సవివరమైన చర్చలు జరగడం లేదు. కీలక పదవులలో ఉన్న ఒకరిద్దరే ప్రతి చోట కీలక నిర్ణయాలు తీసుకొనే వారవుతున్నారు. అటువంటి పరిస్థితి నిరంకుశ ధోరణులను మాత్రమే సూచించ గలుగుతుంది. దేశానికి మాత్రమే కాదు ఆయా పార్టీలకు సహితం మంచిది కాదని గ్రహించాలి.

తొలి భారత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ విధానాల పట్ల ఎన్ని భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ ఆయన స్వతహాగా ప్రజాస్వామ్య విలువల పట్ల గౌరవం ఉన్న నేత. అందుకు ఒక చక్కటి ఉదాహరణ ఉంది. తొలి రాష్ట్రపతి పదవి విషయంలో రాజేంద్ర ప్రసాద్ పేరు ముందుకు వచ్చినప్పుడు తాను ఉత్తర ప్రదేశ్ కు చెందిన వ్యక్తిని, పొరుగున ఉన్న బీహార్ కు చెందిన నేతకు మరో కీలక పదవి ఇవ్వడం సముచితంగా ఉండబోదని దక్షిణాదికి చెందిన రాజగోపాలచారికి ఇస్తే బాగాఉంటుందని భావించారు. పైగా గవర్నర్ జనరల్ గా ఉన్న వ్యక్తి సహజంగా రాష్ట్రపతి కావలసి ఉంది.

అయితే కాంగ్రెస్ పార్టీలో దాదాపు అందరూ రాజేంద్రప్రసాద్ వైపు మొగ్గు చూపుతున్నారు. అందుకనే నేరుగా రాజేంద్ర ప్రసాద్ వద్దనే ఈ విషయం ప్రస్తావించి రాజగోపాలాచారి ఎన్నిక అయ్యేటట్లు చూడ డానికి సహకరించమని కోరతారు. అందుకు ఆయన ఒప్పుకొంటారు. కాంగ్రెస్ కార్యవర్గ సమావేశంలో తన పేరు ప్రస్తావనకు వచ్చినప్పుడు తనకు ఈ పదవి ఇష్టం లేదని చెబుతానని అంటారు. ఆ విధంగా ఒక హామీని కూడా లిఖిత పూర్వకంగా ఇస్తారు. కానీ తీరా కాంగ్రెస్ కార్యవర్గ సమావేశంలో ఈ అంశం ప్రస్తావనకు రాగానే రాజేంద్ర ప్రసాద్ పేరు రావడం, అందరు ఆమోదం తెలపడం జరిగి పోతుంది. అక్కడనే ఉన్న రాజేంద్ర ప్రసాద్ ఏమీ మాట్లాడారు.

తనకు ఈ విధంగా హామీ ఇచ్చి రాజేంద్ర ప్రసాద్ మాట తప్పారని ఆ తర్వాత ఎప్పుడు, ఎవ్వరి వద్దా నెహ్రూ ప్రస్తావనకు తీసుకు రానే రాలేదు. ఆయన వ్రాసి ఇచ్చిన కాగితాన్ని సహితం తాను జీవించి ఉన్నంత వరకు బైట పెట్టలేదు. ఆ తర్వాత బైట పడింది. నేడు అసలు అటువంటి సంప్రదింపులు, పార్టీలలో ఇతరుల అభిప్రాయాలకు విలువ ఇవ్వడం ఎక్కడైనా జరుగుతున్నదా ?

ప్రజాస్వామ్యం బలపడాలి అంటే ఒకరిద్దరు వ్యక్తులు నిర్ణయాలు తీసుకోవడం ఎక్కడ జరుగరాదు. సమిష్టి నిర్ణయమే ఎప్పుడూ బలం చేకూరుస్తుంది. రాజకీయ పక్షాలలో, ప్రభుత్వాలలో సహితం అటువంటి పరిస్థితులు ఏర్పడాలి. నెహ్రూ, మొరార్జీ దేశాయ్‌లు కాకుండా తమ మంత్రి వర్గాలలో స్వేచ్ఛగా మంత్రులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేయడం, కీలక అంశాలపై సవివరంగా చర్చలు జరిపే అవకాశం ఇవ్వడం కేవలం వాజపేయి మంత్రివర్గంలోనే జరిగినదని చెప్పవచ్చు. మిగిలిన ప్రధానులు ఎవ్వరూ అటువంటి స్వేచ్ఛను ఇచ్చిన దాఖలాలు లేనే లేవు.

ఎంజే అక్బర్ తమను లైంగిక వేధింపులకు గురిచేశారని పలువురు మహిళా పాత్రికేయులు ఆరోపణలు చేస్తే ప్రభుత్వంలో ఉన్న పెద్దలు ఆరోపణలు చేసిన వారి పట్ల చులకన భావంతో వ్యవహరించారు గాని, వారి పట్ల కనీసం సానుభూతి చూపనే లేదు. కేంద్ర మంత్రులలో కేవలం మేనకా గాంధీ ఎవ్వరి మీద ఆరోపణ వచ్చినా విచారణ జరగ వలసిందే అనగా, మరో మంత్రి స్మృతి ఇరానీ అందుకు అక్బర్ సమాధానం చెప్పుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వంలో ఇతరులు ఎవ్వరూ కనీసం స్పందించడానికి సహితం వెనుకడుగు వేశారు. ఒక ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ఇటువంటి ధోరణి అభిలషణీయమా ?

నరేంద్ర మోదీ ప్రభుత్వంలో కీలకమైన అధికార కేంద్రంగా వ్యవహరిస్తున్న వ్యక్తి ఎవరైతే అలోక్ వర్మను పట్టుబట్టి సిబిఐ డైరెక్టర్ గా తీసుకు వచ్చారో, తాను సూచించిన అంశంలో ప్రాధమిక ఆధారాలు ఉన్నాయనే విషయం పరిశీలించ వద్దని చెప్పినా వినక పోవడంతో అంతే పట్టుదలతో పదవి నుండి తప్పించారు. ఈ మొత్తం వ్యవహారంలో మంత్రులు అందరు ప్రేక్షక పాత్రకు పరిమితం కావడం విస్మయం కలిగిస్తుంది. అత్యవసర పరిస్థితి వంటి చీకటి రోజులలోనే ఇందిరా గాంధీతో నేరుగా ఆమె విధానాలు తగవని సున్నితంగా హెచ్చరించిన ...శ్రేయోభిలాషులు' కొందరు ఉన్నారు. కానీ నేడు...గోడమీద పిల్లులు' ఎక్కడ చూసినా కనిపిస్తున్నారు. అటువంటి వారే మన ప్రజాస్వామ్యానికి అసలైన ప్రమాదకారులు అని చెప్పవచ్చు.

## స్పందనను వ్రాయండి

**'అమ్మనుడి'**లో రచనలపై
మీ స్పందనను వ్రాసి పంపండి!
సంపాదకుడు **'అమ్మనుడి',**
జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి,
మాచవరం, విజయవాడ-520 004.

ఇ-మెయిల్ : *editorammanudi@gmail.com*

గుండెలోతుల్లోంచి వచ్చేదీ, మనసు విప్పి చెప్పగలిగేది అమ్మనుడిలోనే

భాషోద్యమ కథానిక

# రాతిలో తడి

సడ్లపల్లె చిదంబరరెడ్డి
9440073636



ఆంధ్ర రాష్ట్రంలో అదొక మారుమూల పల్లె. అందులో ఒక ప్రభుత్వ పాఠశాల. అక్కడ చదివిన ఒక అమ్మాయికి పదో తరగతిలో రాష్ట్ర స్థాయిలోనే అత్యధిక మార్కులొచ్చాయి. ఆ బాలికను అభినందించడానికి స్వయంగా విద్యాశాఖ మంత్రి వస్తున్నట్లు సూచాయగా జిల్లా విద్యాధికారి కార్యాలయం నుంచి వార్త అందింది.

అది తెలుస్తూనే ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అత్యవసర పని వుందంటూ లాంగ్ లీవు పెట్టి వెళ్లిపోయాడు. అతని తర్వాత సీనియర్ ఉపాధ్యాయుడు శాంతయ్య, అతను బడికి రావడం పాఠాలు చెప్పడం తప్ప వేరే ఏదీ పట్టనివాడు. ప్రధానోపాధ్యాయుని బాధ్యతలు స్వీకరించాల్సి వచ్చింది.

ఒక రోజు జిల్లా విద్యాధికారి స్వయంగా బడిని సందర్శించి, మంత్రిగారు వస్తున్న తేదీని, ఆ రోజు జరపాల్సిన సాంస్కృతిక కార్యక్రమాల్ని, చేయాల్సిన ఏర్పాట్లను వివరించాడు.

అంతే కాక ఎక్కువ మార్కులు తెచ్చుకొన్న అమ్మాయి తల్లిదండ్రుల్ని హెడ్మాష్టరే స్వయంగా కలుసుకొని, విషయం వివరించి ఆరోజు సభలో ఎవరితో ఎలా మాట్లాడాలో కొంత తరిఫీదు ఇవ్వాలని హుకుం జారీ చేసి వెళ్లిపోయాడు.

ఆవార్త వింటూనే శాంతయ్య మనస్సు మొద్దుబారి పోయింది. కొంత అసహనానికి లోనై కళ్ళు మూసుకొన్నాడు. క్షణంలో గతమంతా గుర్తుకు రాసాగింది.

మంచి మార్కులు తెచ్చుకొన్న అమ్మాయి పేరు భువన. ఆ బడికి కూతవేటు దూరంలో ఉన్న గుట్టపల్లె ఆమెది. శ్రద్ధగా బడికి రావడము, ఉపాధ్యాయులిచ్చిన ఇంటిపని చేయడము, క్రమశిక్షణ పాటించడంలో ఆమెకు ఆమే సాటి!! ఆ అమ్మాయి ఎంత చక్కగా జవాబులు రాసినా ఇతర సబ్జెక్టుల ఉపాధ్యాయులందరూ... ఇవ్వాల్సిన వాటి కన్నా ఒకటీ అరా మార్కులు తగ్గించి వేసేవారు. కారణం ఆ అమ్మాయి తండ్రిమీద

కార్యక్రమం మొదలౌతూనే మంత్రిగారు మైకందుకొని " తెలివైన పిల్లల్నంతా కార్పొరేటు రాబందులు తన్నుకు పోయి, ర్యాంకుల కోసం నానాగడ్డి తినే కాలంలో ఒక మారుమూల ప్రభుత్వ పాఠశాలలో చదివే అమ్మాయికి రాష్ట్రస్థాయి ర్యాంకు రావడం అసాధ్యం! అటువంటిదాన్ని సుసాధ్యం చేసిన ఉపాధ్యాయబృందానికి ధన్యవాదాలు. వారి కృషిని గురించి ప్రధానోపాధ్యాయుల బాధ్యత వహిస్తున్న తెలుగు తెలుగుపండితులు శాంతయ్య గారు నాలుగు మాటలు మాట్లాడవలసిందిగా కోరుచున్నాను" అని మైకు అతని చేతికి ఇచ్చాడు.

ఆ ప్రాంతంలో ఉన్న చెడ్డపేరే!! అయినా శాంతయ్య ఆ దురాలోచన తన తలలోనికి దూరనిచ్చేవాడు కాదు. అమ్మాయి జవాబులకు తగ్గట్లు వేస్తే అందరికన్నా మొదటి మార్కులు ఆమెకే వచ్చేవి.

సందర్భం వచ్చినప్పుడు, సహ ఉపాధ్యాయ బృందమంతా అతన్ని సూటిపోటి మాటలతో దెప్పి పొడిచేవారు. అందరిలాగా ఉప్పు, కారం తినే మనిషివి అయి ఉండి కొంతయినా రోషంకలిగి, పగా ప్రతీకారమూ తీర్చుకోగలిగిన సమయం వచ్చినప్పుడు కొంతయినా వినియోగించుకోవాలి. సత్యహరిశ్చంద్రుని కాలానికి మూడుతరాలు ముందు పుట్టినట్లు చేతికి ఎముక లేనట్లు ఒక దుర్మార్గుని కడుపులో పుట్టిన పాపానికి ఆ అమ్మాయికి ఒకటి రెండు మార్కులు తక్కువ వేస్తే కొంపలేవీ మునగవు అని వాదించేవారు.

అవును. ఆ అమ్మాయి తండ్రి పరమ దుర్మార్గుడే!! అయినా, అతని కడుపులో పుట్టిన పాపానికి బంగారు వంటి బిడ్డ శిక్షకు గురి కావడం ఏమిటి? తర్కానికి దిగేవాడు. అయినా మనసు పొరల్లో భువన తండ్రి రెడ్డినాయుడు తనకు చేసిన అన్యాయానికి లోలోపలే కుములిపోయేవాడు.

* * *

అప్పటికి దాదాపు ఇరవై యేళ్లకు ముందు అదే ఊరి బడిలో మొదటిసారి శాంతయ్య ఉపాధ్యాయుడిగా చేరాడు. చేరిన కొన్నాళ్లకే పెళ్లి చేసుకొన్నాడు.

ఆ పల్లెలో ఇంటి వసతి, ఇతర సౌకర్యాలూ సరిగా లేవని సహ ఉద్యోగులందరూ అక్కడికి కాస్త దూరంలోని పట్నంలో కాపురాలు పెట్టి, బస్సులు ఆటోలు పట్టుకొని బడికి వచ్చి పోయే వారు. అతను మాత్రం అక్కడే కాపురం పెట్టాడు.

ఆ గ్రామంలోని తల్లిదండ్రులు నెలసరి డబ్బులిస్తామని అదనపు చదువు చెప్పాలని తమ పిల్లల్ని శాంతయ్య ఇంటిదగ్గరకు పంప సాగారు. సాయంత్రం బడి వదిలిన తరువాత, సెలవు దినాల్లో తనదగ్గరకు వచ్చే అందరికీ తనకు తెలిసిన మేర విషయాన్ని బోధిస్తూ చదువు పట్ల ఆసక్తినీ, శ్రద్ధనూ పెంచడానికి ప్రయత్నించాడు కానీ...ఎవరి దగ్గరా డబ్బు అడిగేవాడు కాదు. ఇచ్చినా తీసుకొనేవాడు కాదు. అయినా గ్రామస్తులు బాధ్యతగా తమ పొలాల్లో పండిన ఆకుకూరలూ, కాయగూరలూ ఇతర ఫలసాయాన్ని తోచిన మేర ఇచ్చేవారు.

ఈ విధంగా ప్రశాంతంగా శాంతయ్య బతుకు సాగే సమయంలో పిల్ల నిచ్చిన మామకు ఇద్దరూ ఆడపిల్లలే కావడంతో, వయస్సు మీద పడ్డంతో తనదగ్గర ఉన్నదీ, వారసత్వంగా వచ్చిన ఆస్తుల్నీ అమ్మి పదిలక్షలదాకా...అల్లుడయినా, కుమారుడైనా అతడే అన్నట్లు కానుకగా ఇచ్చాడు.

దాని మీద అతనికి ఆశ లేక పోయినా అత్తింటివారు కానుకగా ఇచ్చింది కాదనక తీసుకొన్నాడు. భార్య పేరిట అక్కడికి దగ్గరలోని కొండగుట్టలకు ఆనుకొని ఉన్న పదిదాకా ఎకరాల బంజరుభూమి అమ్మకానికి వస్తే కొన్నాడు.

ఉలవలుకూడా పండని వట్టి మెట్ట భూమి ఎందుకు కొన్నావని, దానికి బదులు ఏ బ్యాంకులోనో వేస్తే నమ్మకంగా నెలనెలా కొంతయినా వడ్డీ గిట్టుబాటు అవుతుందని అందరూ నిరుత్సాహ పరిచారు. అయితే అందరికీ అతను చిరునవ్వుతో "ఇది పంటలు పండించడానికి కాదు. పూర్వం ఈ చుట్టుపక్కల కొండల్లో పచ్చని చెట్లు ఏపుగా పెరిగి పర్యావరణ ప్రకృతి దృశ్యాలకు పెట్టింది పేరుగా ఉండేదట!! గలగల పారే సెలయేళ్లు, వన్యమృగాలు, కిలకిలారావాల పక్షుల గుంపులతో సంవత్సరం పొడుగునా కార్తులన్నీ ఏవి ఎన్ని పదునుల వానలు కురవాల్నో అన్ని అదనుగా కురిసేవట!! రైతన్నల కన్నుల పండుగగా పంటలుకూడా పండేవట!!

అయితే రాబోయే తరాలు కూడా ఈ భూమండలం మీదే నివసించాల్సి ఉన్నదని, వారికి భూమీ ప్రకృతి అత్యవసరమని మరిచిపోతున్న స్వార్థపరులు అన్నింటినీ ధ్వంసం చేసి నోట్లకట్టలుగా దాచుకొంటున్నారు. అది మంచిపద్ధతి కాదని చెప్పడానికి జవాబుగా ఆ భూమినంతా చదును చేయించి ఈ నేలకు అనుగుణంగా ఏపుగా పెరిగే మొక్కలు నాటి పెద్ద వనంగా తీర్చి దిద్దాలనుకొంటున్నాను"అని సమాధానం చెప్పాడు.

"మంచి పనులకు ఆటంకాలు ఎక్కువ" అన్నట్లు, శాంతయ్యకు పిల్లనిచ్చిన మామకు ఆరోగ్యం చెడిపోయింది. ఆదరా బాదరాగా బడికి సెలవు పెట్టి వెళ్ళి అతన్ని పెద్దాసుపత్రులకు తిప్పినా కోలుకోక కాలమై పోతే కర్మకాండలు ముగించి తిరిగి రావడానికి కొంత సమయం పట్టింది.

వచ్చే సమయానికి అక్కడ పిడుగులాంటి వార్త.

పొరుగూరి రెడ్డినాయుడు శాంతయ్య కొన్న భూమిని ఆక్రమించి అక్కడికి దగ్గర్లోని గుట్టల్లోని రాళ్లను ప్రొక్లెయినర్లతో పెకలించి తెచ్చి కంకరగా మార్చే యంత్రాలు బిగించినాడని!! అతగాడు మనిషిరూపంలో ఉన్న జంతువని!!

అయినా శాంతయ్య భయపడ లేదు. తన దగ్గరకు చదువుకోవడానికి పిల్లల్ని పంపే ఒకరిద్దరు పెద్ద మనుష్యుల్ని వెంటబెట్టుకొని రెడ్డినాయుడున్న చోటుకు వెళ్లి ఆ భూమి తాను కొన్నట్లున్న కాగితాలు చూపాడు.

శాంతయ్యనూ అతని వెంబడీ ఉన్న వారిని రెడ్డినాయుడు మనుష్యులుగా గుర్తించ లేదు. కనీసం వరండానుంచి లోపలికి కూడా రానీక బయటే నిలబెట్టి "ఆ కాగితాలు నాలుక గీక్కోవడానికి కూడా పనికి రావు. నీకు అమ్మిన వారికి ఆ ఆస్థిమీద ఏమాత్రం హక్కూ అధికారాలు లేవు. అసలైన హక్కుదారుల నుండీ కొన్నది నేను. అది నిజమో కాదో కోర్టుకు వెళ్ళి నిరూపించుకో!!అంతే కాక బడిలో పాఠాలు చెప్పుకొనే పంతుళ్ళకు భూములతో పని ఏమి??" అని తీక్షణగా విరుచుకుపడ్డాడు.

చాలా దుర్మార్గంగా, నీచంగా, నిర్మొహమాటంగా అన్న అతని మాటలకు శాంతయ్య దంగయి పోయాడు. నిరాశగా వెనుతిరిగాడు.

ఇంటికి వచ్చాక కొందరు పోలీసు కంప్లైంటు ఇవ్వడమే మార్గం అన్నారు, మరి కొందరు తమకు తెలిసిన రాజకీయ నాయకుని దగ్గరకు వెళ్లి పంచాయితీ పెడదామన్నారు. ఇంకా కొందరు కోర్టుకు వెళ్ళమన్నారు.

కొందరైతే "కోర్టులూ పోలీసు స్టేషనూ తిరగడం అంత సులభంకాదు. అతను అన్ని చోట్లా చక్రం తిప్పగల సమర్థుడు. ఒక వేళ పట్టుదలతో న్యాయస్థానంలో గెలిచినా ఆ దుష్టుడి కళ్లలో పడిన పొలంలో నిన్ను అడుగు పెట్టనీయడు. బాగా ఆలోచించు" అని సలహా కూడా ఇచ్చారు.

అన్ని కోణాల నుంచీ ఆలోచించి మనస్సును ఏమాత్రం ఒత్తిడికి గురిచేయకుండా ఆస్థిని గురించిన ఆలోచనలను అక్కడికక్కడే తుడిచి వేసుకొని వేరే ప్రాంతానికి బదిలీపై వెళ్లి పోయాడు. మరలా ఆ బడికి వస్తానని కలలోనూ అనుకోలేదు.

అయితే ఆ సంవత్సరం బదిలీల్లో అతని మొత్తం సర్వీసు, మరికొన్నిటివల్ల వచ్చిన పాయింట్ల ఆధారంగా తప్పని సరిగా అదే బడికి రావలసి వచ్చింది.

గత్యంతరం లేదు! ఒక ప్రభుత్వోద్యోగిగా పై అధికారుల ఆజ్ఞలను పాటించాల్సిందే కదా! గతం తాలూకు ఎటువంటి ఆక్రోశ అసహనాలూ మనస్సులో దాచుకోక ఒక కార్య నిర్వహణాధికారిగా రెడ్డినాయుడుగారున్న చోటుకు వెళ్లి కర్తవ్యాన్ని వివరించి వచ్చాడు.

ఆరోజు కార్యక్రమం ఘనంగా ఉండాలని, పనిగట్టుకొని "సంస్కృతి, సాంప్రదాయం" అని అదే పనిగా ప్రతి చర్చలోనూ లేవనెత్తే మరో తెలుగు ఉపాధ్యాయున్ని పిలిచి ఏక పాత్రాభినయాలు, నాటికలు, గేయాల వంటివి పిల్లలకు నేర్పించమని పదైదు రోజుల సమయం ఇచ్చాడు. అన్ని రోజులుకూడా అవసరం లేదని రెండు మూడు రోజుల్లోనే హెడ్మాష్టరు ముందు రిహార్సల్ ఏర్పాటు చేశాడు.

అవి అన్నీ సీడీలో సినిమా పాటలు. చెవులు చిల్లులు పడేలా వినవస్తుంటే జిగేల్ మని దుస్తులు మెరుస్తుంటే,రంగుల వెలుగుల మధ్య ఒళ్లు విరుచుకొని వేసే కుప్పిగంతులట!! ఆవూరి భాషలేదు. ఆ ప్రాంతపు సమస్యలేదు, జీవన విధానం లేదు. మొత్తం వ్యాపార బేహారులయిన సినిమావారి మసాలా సాహిత్యం!! వాటిని విని మండిపడ్డాడు.

ఆ ఊరికి ఆనుకొని పారే పెద్ద వాగు నుంచి రాత్రికి రాత్రే రహస్యంగా ఇసుకను దోచి నగరాలకు మోసే ముఠాలను గురించి, కాపుకాసి వారిని పట్టుకొని బుద్ధిచెప్పే రైతన్నలను గురించి, ఇటుకబట్టీల కోసం పచ్చని చెట్లను తెగనరికితే కలిగే అనర్థాల గురించి చిన్న చిన్న నాటికలు, ఏక పాత్రాభినయాలు, గేయాలు ఆ ఊళ్లో అందరూ ప్రతినిత్యం పలికే పదజాలం తోనే తయారు చేసినవి ఇచ్చి ప్రాక్టీసు చేయించమన్నాడు.

కార్యక్రమం జరగాల్సిన రోజు రానే వచ్చింది. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో మంచి మార్కులు వచ్చిన పిల్లలు, వారి తల్లిదండ్రులతో పాఠశాల ఆవరణం అంతా కిక్కిరిసి పోయింది. పోలీసు బలగాలు వచ్చి అందరినీ కూర్చోవాల్సిన చోట సర్దుతున్నారు.

అంతలో మంత్రిగారూ ఇతర విద్యాశాఖ అధికారులూ వేదిక చేరుకొన్నారు.

కార్యక్రమం మొదలౌతూనే మంత్రిగారు మైకందుకొని " తెలివైన పిల్లల్నంతా కార్పొరేటు రాబందులు తన్నుకు పోయి, ర్యాంకుల కోసం నానాగడ్డి తినే కాలంలో ఒక మారుమూల ప్రభుత్వ పాఠశాలలో చదివే అమ్మాయికి రాష్ట్ర స్థాయి ర్యాంకు రావడం అసాధ్యం! అటువంటి దాన్ని సుసాధ్యం చేసిన ఉపాధ్యాయబృందానికి ధన్యవాదాలు. వారి కృషిని గురించి ప్రధానోపాధ్యాయుల బాధ్యత వహిస్తున్న తెలుగు తెలుగు పండితులు శాంతయ్యగారు నాలుగు మాటలు మాట్లాడవలసిందిగా కోరుతున్నాను" అని మైకు అతని చేతికి ఇచ్చాడు.

"పై అధికారులకూ, మాపై నమ్మకముంచి శ్రద్ధగా పిల్లల్ని బడికి పంపే తల్లీతండ్రులకు నమస్కారములు! మీకు తెలియందికాదు. రోజుకు ఇరవై నాలుగ్గంటల సమయం. అందులో బడి నడిచేది ఐదు గంటలు. వాటిలో ఒక్కో ఉపాధ్యాయునికి దక్కేది నలభై నిమిషాల పిరియడు. హాజరీ వేయడం, పితూరీలు వినడానికి పది నిమిషాలు పోతే చివరకు మిగిలేది ఒక అరగంట మాత్రమే!!

ఆ సమయంలో మాకు తెలిసిన నాలుగు ముక్కలు చెప్పడానికి ప్రయనిస్తాము. అందులో మా గొప్పతనం ఏమీ ఉండదు. అలా ఉన్న పక్షంలో మాదగ్గర చదివిన వారంతా రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించాలికదా!! అలా కాక అమ్మాయి భువనకు దక్కిందంటే అది ఆమెను కన్న తల్లీదండ్రుల పెంపకము. వారు నేర్పిన క్రమశిక్షణలే కారణం. తీగ ఎదగడానికి బడి అన్నది ఒక పందిరి వంటిది మాత్రమే! పాదు చేసి నీరు పోసి మంచి ఎరువులు వేసేది తల్లిదండ్రులే!!కాబట్టి మా బడికి ఇంతటి కీర్తి రావడానికి కారకులు భువన గారి అమ్మానాన్నలే!! వారికి నేను పాదాభివందనం చేస్తున్నాను" అన్నాడు వినయంగా. సభ అంతా కరతాళ నాదాలతో మిన్నంటిపోయింది.

మంత్రిగారు లేచి నిలబడి పక్కనే కూర్చున్న అమ్మాయి తల్లిదండ్రుల్ని అభినందించి సభను ఉద్దేశించి మాట్లాడమన్నాడు.

రెడ్డినాయుడు మాట్లాడ్డానికి లేస్తూనే కొందరు అక్కడినుంచి వెళ్లడానికి సిద్ధమయ్యారు. అది గమనించి "ఇక్కడ ఇంతమంది గొప్ప హృదయంకల వారి ముందు నిలబడి మాట్లాడ్డానికి నాకు అర్హత లేదు. దండిగా డబ్బులు పారేస్తే చదువులు వస్తాయనే పొగరుతో మా పెద్దబ్బాయిని నగరంలోని చలువగదుల భారీపాఠశాలలో చేర్పించా. ఆ చదువులు తలకు ఎక్కువ ఇంటికి వస్తాను అంటే నేను ఒప్పుకోలేదు. చివరికి ఒత్తిడిని తట్టుకోలేక బడినుండి వెళ్ళిపోయి ఇప్పటికి రెండు నెలలయ్యింది. ఎక్కడున్నాడో తెలియదు. చెప్పుకోవడానికి సిగ్గయి ఇప్పటిదాకా మనస్సులోనే దాచుకొన్నా!!

ఈ ఆడపిల్లను కూడా పెద్ద చదువులు చదివించాలని కాదు. ఇంటి పద్దులు రాయడానికి అవసరమౌతుందని ఉబుసుపోకకు ఇక్కడ చేర్పించాను. దండిగా డబ్బులూ ఆస్థులూ సంపాదన చేస్తే గొప్పగా బతకవచ్చు అనుకొన్నాను. అందుకే మా ఊళ్లో నేనే అందరికన్నా ధనవంతుడు కావాలనుకొన్నాను. ఎవర్నీ ఎదగనీయ లేదు. నా మాటవినని నాళ్లను వారికే తెలియకుండా సమస్యలు సృష్టించి గ్రామం వదిలేలా చేశాను. దేవుని వంటి ఈ శాంతయ్య సారు గారి భూముల్ని దౌర్జన్యంగా లాక్కొని వారికి తీరని ద్రోహం చేశాను. నేను చేసిన దుర్మార్గం పనికి మీరే తగిన శిక్షవేయండి సార్" అని కన్నీరు కారుస్తూ శాంతయ్య కాళ్లమీద పడ్డాడు.

శిశువు శారీరక వికాసానికి తల్లిపాలు
మానసిక వికాసానికి తల్లి భాష
గుండెలోతుల్లోంచి వచ్చేదీ, మనసు
విప్పి చెప్పగలిగేది అమ్మనుడిలోనే.

అమ్మనుడిపై నెనరు లేనివాడు
కన్నతల్లినీ, పుట్టిన నేలనీ
ప్రేమించలేడు..

# అక్షరం..వారి ఆరాధ్య దైవం..!

పట్నాయకుని వెంకటేశ్వరరావు
9705347880




## సవర జాతి గిరిజనుల విశిష్ట సంస్కృతి ఒడిశా, ఆంధ్రా సరిహద్దుల్లో భాషా గుడులు

భాషకు రూపం అక్షరం. సరస్వతీ నమస్తుభ్యం..అంటూ అక్షరాభ్యాస వేళ గురువు రాయించే 'అ..ఆ'లే మన జీవన గమనానికి , భాషా పాటవానికి తొలి అడుగు. అనంతర కాలంలో మనం అక్షరాన్ని దిద్దినా, ప్రేమించినా ఆరాధించడం అనేది ఓ భావనగానే కొనసాగుతుంటుంది. ఇందుకు భిన్నం శ్రీకాకుళం జిల్లా సరిహద్దులోని ఒడిశా రాష్ట్రం గుణుపురం సమీప మిర్చిగుడ, శ్రీకాకుళం జిల్లా భామిని మండలానికి చెందిన భామిని ప్రాంతాలకు చెందిన సవరజాతి గిరిజనుల తీరు. వారు అక్షరాన్ని ఆరాధిస్తారు. తమ భాషకు రూపమైన 24 అక్షరాలకు గుడికట్టి వాటినే దేవతలుగా పూజించడం విశేషం. విలక్షణం. అక్షరబ్రహ్మగా సాగే ఈ భాషారాధన వెనుక ఆసక్తికర కథనమే ఉంది.

### అరవై ఆరేళ్ల కిందట తొలి అక్షరబ్రహ్మ ఆలయం ...


శ్రీకాకుళం జిల్లా భామిని లోని అక్షరబ్రహ్మ గుడి

ఒడిశాలోని పద్మాపూర్ సమితి దాంబుసారా మిర్చిగుడ వద్ద తొలి అక్షరబ్రహ్మ ఆలయం 1952లో వెలిసింది. దీనికి కారకుడు సవర భాషా పండితుడు మంగయ్యసవర. మంగయ్య వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులుగారి కాలంలోనే సవర భాషా వికాసానికి కృషి చేశారనే వాదనా ఉంది. ఆయన 12 ఏళ్లపాటు పూరీ జగన్నాథునికి తపస్సు చేసి స్వామి ఆశీస్సులతో వారి భాషా లిపిని కనుగొన్నారని కథనం. ఆమేరకు ఆయన సూచనలతో వెతికితే మిర్చిగుడకు సమీపంలో ఉన్న ఓ బండరాయిపై 24 అక్షరాలు కన్పించాయని వాటికి గుడి కట్టారని ప్రచారంలో ఉంది. ఈ గుడిని మంగయ్య కుమారుడు పరిరక్షిస్తున్నారు. మంగయ్య కృషికోసం ఒడిశా గెజిట్‌లో కూడా రాసి ఉండటం విశేషం. ఈ అక్షరాలకు ఆదివాసీ గిరిజనులు నిర్వహించే విత్తనాల పూజ (ఒకల్ తర్జు)రోజు అంటే అక్షర తృతీయ నాడు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. వీటిలో ప్రధాన ఆరాధన అక్షర బ్రహ్మకు,అనంతరం అక్షరాలకు జరుగుతుంటాయి.

### వృత్తాకార గుడిలో..హృదయాకార అక్షర మాలిక

ఈ అక్షరబ్రహ్మగుడి కూడా ప్రత్యేక శైలిలో ఉంటుంది.


అక్షర తృతీయ నాడు జరిపే ప్రత్యేక పూజలు

వృత్తాకారంలో ఉండే గుడిలోపల రాయిపై 24 అక్షరాలుంటాయి. వాటినే గిరిజనులు తాము కొలిచే దేవతల ప్రతిరూపాలుగా భావిస్తారు. అవన్నీ కలిపితే మళ్లీ ఓ హృదయాకారంలో కన్పిస్తాయి. ఈ ముద్రనే అక్షరబ్రహ్మ సాంప్రదాయం పాటించే గిరిజనులు తమ ఇంటి తలుపులపైనా, వస్త్రాలపైన్నా, చివరికి నిత్యం వినియోగించే గ్లాసులు, కంచాలు, చెంబులపైనా ముద్రించుకొని ఎంతో పవిత్రంగా ఆ సామగ్రిని పరిరక్షించుకుంటారు. ఆయా గ్రామాల్లో 'మత్తర్ బనోమ్' అనే సంస్థ అక్షరబ్రహ్మ ప్రచారాన్ని సాగించి పిల్లలకు ఈ భాషను బోధిస్తోంది. ఒడిశాలోని గణంత్రిలో ఈ భాషా ముద్రణ యంత్రం కూడా ఉంది. ఇక్కడే వారి పాఠ్యపుస్తకాలు ముద్రితమవుతాయి.

### ఊతమిచ్చిన గిరిధరగొమాంగో...

అక్షరబ్రహ్మ సంప్రదాయం ముందుకు సాగడానికి ఒడిశా రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, ప్రముఖ డప్పు కళాకారుడు, సాహితీ వేత్త గిరిధరగొమాంగో ఎంతో ఊతమిచ్చారు. ఈ సంప్రదాయంలో కొనసాగు తున్న వారికోసం ఆయన ప్రింటింగ్ ప్రెస్‌లను ఏర్పాటుచేయించి వారు తమ పుస్తకాలు ముద్రించుకునే వెసులుబాటు కల్పించారు. ఇలా ఇప్పుడీ సంస్కృతి శ్రీకాకుళం , విజయనగరం జిల్లాలకు ముఖ్యంగా భామిని, మనుమకొండ, పాలవలస, సీతంపేట, ముత్యాలు, శంభాం, గుమ్మలక్ష్మీపురం, కన్నాయిగూడ ప్రాంతాలకు కూడా వ్యాప్తిచెందుతోంది.

### మద్యం ముట్టరు..మాంసం తినరు..

అక్షరాన్ని ఆరాధించే 'అక్షరబ్రహ్మ ' సంప్రదాయంలో కొనసాగుతున్న గిరిజనులు మద్యం ముట్టరు. మాంసం తినరు. ఆధ్యాత్మిక జీవనానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు వారి మాతృభాషా వ్యాప్తికి కృషిచేస్తుంటారు. అక్షర తృతీయ నాడు ఈ గిరిజనులు 'అక్షరబ్రహ్మకు' ఉత్సవాలు వేడుకగా జరుపుతారు. ఇక ఆ మందిరాల్లో నిత్యం అక్షర ఆరాధన భక్తిశ్రద్ధలతో సాగుతూ ఉంటుంది. ఇలా అక్షరాలకు ఆకృతినిచ్చి పీఠం వేసి పూజచేసే ఈ విశిష్ట సాంప్రదాయం ఇతర వర్గాల వారినీ ఆకట్టుకుంటోంది. భాషా పరిరక్షణ కోసం వారు భక్తి బాట పట్టి అక్షరం కోసం తపిస్తున్న తీరు ఆశ్చర్య పరుస్తోంది. తెలుగు భాషా వికాసానికి కూడా ఆ సవర గిరిజనుల పట్టుదలను స్ఫూర్తిగా తీసుకొని తెలుగు కుటుంబాల వారూ గట్టి సంకల్పం చెప్పుకోవాల్సిన అవసరం ఉంది. తెలుగు రాష్ట్రాల పాలకులు కూడా ఇందుకు తక్షణం నడుంకట్టాల్సిన ఆవశ్యకత ఉంది. పాలనా భాషగా తెలుగు పరిఢవిల్లేలా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

జి. వెంకటేశ్వరరావు
9491457496

# దేవాలయ వాస్తు శాస్త్రంలో ప్రవీణుడు-డా॥ యస్.రమేశన్



డా॥ ఎస్. రమేశన్ టెంపుల్ ఆర్కిటెక్చర్‌లోను, ఎపిగ్రఫీలోను ప్రావీణ్యాన్ని సంపాదించిన ముఖ్యుల్లో ఒకరు. వీరి పరిశోధనలను అంగీకరించిన రీసెర్చ్ డైరెక్టర్ పి.యం. జోషి రమేశన్‌ను ప్రశంసిస్తూ – "వీరి సిద్ధాంత వ్యాసం – దక్షిణ భారతదేశ శాసనాలు, లిపికి ఎంతో దోహదం చేసిందని" కొనియాడారు. వీరు సంస్కృత భాషను క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. ఎపిగ్రఫీలోను, టెంపుల్ ఆర్కిటెక్చర్‌లోను ప్రావీణ్యం సంపాదించారు.

రమేశన్ శ్రీకాకుళం జిల్లా పార్వతీపురంలో సబ్‌కలెక్టరుగా పనిచేస్తున్నప్పుడు వీరి దృష్టి 'ప్రీ అండ్ ప్రొటో హిస్టారిక్ కల్చర్' మీద పడింది. అప్పుడు ప్రముఖ పురాతత్వవేత్త – డా॥ రావిప్రోలు సుబ్రమణ్యం విశాఖ పట్నంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆర్కియాలజిస్టుగా పనిచేస్తుండగా రమేశన్ తరచుగా వారిని కలసి చర్చిస్తుండేవారు. రమేశన్ ఎదుటివారి ఆలోచనలు గ్రహించి వెంటనే స్పందించేవారు. వీరు 'టెంపుల్ అండ్ లెజెండ్స్ ఆఫ్ ఆంధ్రా' అనే చక్కని గ్రంథాన్ని రచించారు.

రమేశన్ దేవాలయ శాసనాల మీద చేసిన పరిశోధన ప్రముఖమైనది. వీరు 1967 లో పూనా విశ్వవిద్యాలయ పురావస్తు శాఖ ఆచార్యులు పి.యం. జోషీని పరిశోధనకు అనుమతించమని కోరినారు. ఆ సమయంలో రమేశన్ 'మధ్య యుగాల దక్కన్ చరిత్ర' కమిటీ సలహాసభ్యునిగా ఉండినారు. అప్పటికి రమేశన్ పురావస్తు మ్యూజియంలో ఉన్న శాసనాలను కాపాడినారని పి.యం. జోషీకి తెలిసింది. రమేశన్ ఆర్కియాలజి శాఖ డైరెక్టర్‌గా పనిచేసినపుడు (1962) ఆం.ప్ర.లోని రాగిరేకుల మీద చెక్కబడిన శాసనాలను గురించిన పుస్తకాన్ని వెలుగులోకి తెచ్చినారు.'ది హిస్టరీ ఆఫ్ మిడీవల్ దెక్కన్' ప్రథమ సంపుటం ముద్రించగా దానిలో 'ది రెడ్డి కింగ్‌డమ్స్' అనే వ్యాసాన్ని వ్రాసినారు. ఆం.ప్ర. ప్రభుత్వం షెర్వాణి ఫెలిసిటేషన్ సంపుటానికి రమేశన్ సభ్యులుగా ఉండి 'ప్రాచీన భారతదేశంలో విదేశాలతో సంబంధాలు' అనే వ్యాసాన్ని శాసనరూప వివరణలతో రచించారు. వీరికి తెలుగు, కన్నడ, తమిళం, గ్రంధీ లిపులలో ప్రావీణ్యం ఉంది. పల్లవుల శాసనాల మీద పరిశోధించి "మహేంద్రవర్మ కుమారుడైన నరసింహవర్మ, మహాబలిపురంలోని తీర దేవాలయాన్ని నిర్మించినట్లు స్పష్టమైనది. ఇదే విధంగా పరాంతకుని మల్లవరం ఫలకాల వల్ల మధ్యయుగంలో తీర ప్రాంతంలో చాళుక్య రాజుల అధికారం ఎంత వరకు ఉండినదనే విషయం బహిర్గతమయింది.

మల్లంపల్లి సోమశేఖర శర్మ, డా॥ రావిప్రోలు సుబ్రమణ్యం సలహాతో 1964లో పురావస్తు శాఖలో శాసనాల ప్రాధాన్యత గల ఒక శాఖను ఏర్పాటు చేశారు. డా॥ నేలటూరి వెంకటరమణయ్య నేతృత్వంలో ఈ శాఖ శాసనాలకు సంబంధించిన అనేక గ్రంథాలను ముద్రించినది. దీనివల్ల తెలుగు మాట్లాడేవారి ప్రాంతాలలోని అన్ని విశ్వవిద్యాలయములు చరిత్ర – పురావస్తు విషయంలో ముందుకు నడిచాయి. అదే విధంగా స్టేట్ ఆర్కైవ్స్ ఉద్ధరణకోసం వీరిద్దరూ కృషి చేశారు.

రమేశన్ సిద్ధాంత వ్యాసం దక్షిణ భారతదేశ శాసనాలకు, చరిత్రకు విలువను చేకూర్చే అంశం. వీరి పరిశోధనాంశం – "హైదరాబాద్ స్టేట్ మ్యూజియంలో ఉన్న – వెలుగులోకి రాని రెండు రాగిరేకుల శాసనములలోని – అంశము. పల్లవుల కాలంలో మహాబలిపురంలోని చిన్న దేవాలయం. మరుగున పడిన పరాంతకుని మల్లవరం శాసనములను గురించి శోధించారు. వీరి సిద్ధాంత వ్యాసం అద్భుతమైనదని పి.యం.జోషి ప్రశంసించారు. వీరి సిద్ధాంతవ్యాసం దక్షిణ భారతదేశ శాసనాల లిపికి ఎంతో దోహదం చేసిందని నేలటూరి వెంకటరమణయ్య అన్నారు.

నాగపూర్ విశ్వవిద్యాలయ పురావస్తుశాఖ ఆచార్యులు అజయమిత్రశాస్త్రి ప్రస్తావిస్తూ "రమేశన్ శాసనములు, సాంస్కృతిక చరిత్ర, పురావస్తు విషయాలలో ప్రావీణ్యం వహించిన వ్యక్తి, ముఖ్యంగా ఆంధ్రదేశ చరిత్ర, పురాతన చరిత్ర విషయాలలో ప్రత్యేక శ్రద్ధ చూపినారని అన్నారు. రమేశన్ తన సహచరఉద్యోగస్తులను కూడ చరిత్ర పరిశోధన పట్ల ఆసక్తిని కలిగించేవారని అజయమిత్రశాస్త్రి అన్నారు.

రమేశన్ వ్రాసిన గ్రంథాలు Copper Plate inscriptions of A.P. Govt Museum, A catalogue of Vijayanagara coins, History of Freedom struggle in Hyderabad - Vol 2, Studies in Deccan History, Later Pallavas and Telugu Choda Period, The Eastern Chalukyas of Vengi, The Temple inscriptions of A.P. Vol 1, The History of Tirumala Temples ...వ్రాశారు. కళింగ గాంగులు క్రీ.శ. 545 సంవత్సరాలనాటి వారని తన పరిశోధనలో తెలియజేశారు. ఇంతటి విద్వత్తుగల వీరికి పురావస్తుశాఖవారు 'Three Grants from Ragole' Epigraphical series - Vol No. 18' సంపుటాన్ని వీరికి అంకితమిచ్చారు. ప్రముఖ శాసన కర్త – ఇంగ్లాండ్‌కు చెందిన డా॥ షీట్ అంతటి ప్రతిభాశాలి అని వీరిని పోల్చినారు. ప్రముఖ పాత్రికేయుడు నార్ల వెంకటేశ్వరరావు వీరి ప్రతిభను మెచ్చుకున్నారు.

రమేశన్ 1981వ సంవత్సరం నవంబరు 30వ తేదీన కన్ను మూశారు. నేటితరం పరిశోధకులు –రమేశన్ చేసిన అపూర్వ కృషిని అధ్యయనం చేసి దేశచరిత్ర పరిశోధనకు కృషి చేస్తారని ఆశిద్దాం!

**భాష లేకపోతే భావం లేదు ; నీ భావాల్ని నీ భాషలో చెప్పడమే సరైనది**

పుస్తక సమీక్ష

# సర్వోత్తమ జీవితం




**సర్వోత్తమ జీవితం :** వ్యాసాలు
రచన: మాదల వీరభద్రరావు ; పుటలు: 354
వెల: రు.350/-, ప్రతులకు: ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం, శ్రీ సర్వోత్తమ భవనం 40-1-69, పటమట, విజయవాడ-520010
ఫోన్ : 0866-2472313.

మహనీయుల జీవిత చరిత్రలు తర్వాతి తరాలకు మార్గ దర్శకాలవుతాయి. ఈ తరం వారికి, గత చారిత్రక విశేషాలు తెలియ నందున, గాడిచెర్ల హరి సర్వోత్తమరావు గ్రంథాలయోద్యమానికి, వయోజన విద్యావ్యాప్తికి సేవ చేసిన నిత్య కృషీవలునిగానే పరిచయం ఉంటుంది. ఆ లోటుని భర్తీ చేయటానికి అన్నట్లు, బహుముఖీనమైన రావుగారి 'సర్వోత్తమ జీవితం' గురించి సమగ్రంగా ఈ పుస్తకంలో రచయిత ఆవిష్కరించారు.

విద్యాధికునిగా, సంపాదకునిగా, విమర్శకునిగా, రచయితగా, అధ్యాపకునిగా, శాసనమండలి సభ్యునిగా, సహకార, వయోజన విద్య, ఆంధ్ర రాష్ట్రోద్యమాలకై అవిరళంగా పాటుపడిన దేశభక్తునిగా, కార్మిక కర్షక బడుగు వర్గాల ఉన్నతికై అహరహం కృషి చేసిన ఉద్యమ శీలిగా రావుగారి జీవితంలోని అన్ని ప్రధాన ఘట్టాలను చక్కగా, సరళమైన భాషలో మన ముందుంచారు రచయిత.

రాజకీయ రంగంలో - స్వరాజ్యపార్టీ నిర్మాణం, హోం రూలు, వందేమాతరం ఉద్యమాలలోను, సైమన్ కమీషన్ బహిష్కరణ, ఉప్పు సత్యాగ్రహం, కాంగ్రెసు కౌన్సిలు పార్టీ నిర్మాణ సమస్యలు, కౌన్సిలు సభ్యునిగాను ఆంధ్ర విశ్వవిద్యాలయం సెనేట్‌సభ్యత్వం, కేంద్ర శాసన సభా సభ్యునిగాను, 1935 లో ఆంధ్ర స్వరాజ్య పార్టీ పునరుద్ధరణ ప్రయత్నాలు, కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీగా కార్యక్రమాలు - యిలా అన్ని రాజకీయ, స్వాతంత్ర్య పోరాట కార్యక్రమాల్లో పాల్గొన్న రావుగారి చరిత్ర ఆదర్శవంతమైంది. 1935 తర్వాత రాజకీయాల కంటె గ్రంథాలయ, ఆంధ్రోద్యమ, వయోజన విద్యా వ్యాప్తి, గ్రామ పంచాయితీలు, సహకార సంస్థలు మొ|| ఇతర ప్రజా సమస్యలలోను, నిర్మాణ కార్యక్రమాలలోను తన జీవితమంతా నిమగ్నం అయ్యారు.

సారస్వత రంగంలో - ప్రధానంగా మాతృభాషలో గ్రంథ ప్రచురణ సాగించాలనే అభిలాషతో, కట్టమంచి రామలింగారెడ్డి, కొమఱ్ఱాజు లక్ష్మణరావు, కాళేశ్వరరావులతోకలసి1906 లో "విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి" స్థాపన చేసి, తాను భాషాంతరీకరించిన 'అబ్రహాం లింకను చరిత్ర' ను (థేయర్స్ రచన) మొదటి పుస్తకంగా వెలువరించారు. 1907లో ఎమ్.ఏ.పాసయి రాజమండ్రిలో ఉపాధ్యాయ శిక్షణ పొందుతూనే రాత్రిపూట పాఠశాలలు నిర్వహించి, 90 మంది వయోజనులకు అక్షరాస్యత కలిగించారు. పత్రికారంగంలో రావుగారి కృషి ఎనలేనిది.

1908 సం||లో 'స్వరాజ్య' పేరుతో తెలుగు వార పత్రికను స్థాపించారు. అందులో దేశభక్తి పై వ్రాసిన తీవ్రమైన సంపాదకీయాల కారణంగా, రావుగారిపై రాజద్రోహం నేరం మోపి మూడు సం||ల కఠిన కారాగార శిక్ష విధించారు. ఆ విధంగా రాష్ట్రం నుండి జైలు శిక్ష అనుభవించిన తొలి రాజకీయ నాయకునిగా చరిత్ర సృష్టించారు. ఆ తర్వాత 'ది నేషనలిస్ట్' (ఆంగ్ల) వారపత్రిక, 'సౌందర్యవల్లి' మాసపత్రిక, మాతృసేవ, కౌమోదకి, గ్రంథాలయ సర్వస్వం, సహకారం, వయోజన విద్యా సమీక్ష - యిలా ఎన్నో పత్రికలను స్థాపించి, నిర్వహించారు. ఆంధ్రపత్రిక తొలి సంపాదకులుగ (1914-1916) పని చేశారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంస్థ అధ్యక్షులుగా రావుగారు 1934 నుండీ 25 సం||లు రాష్ట్ర వ్యాప్తంగా గ్రంథాలయ, వయోజన విద్యావ్యాప్తికై నిరంతరం పాటుపడ్డారు.

రచయితగా - 'విస్మృత సార్వభౌమ కవి - రాయలు' అనే సిద్ధాంత వ్యాసం 1912లో ప్రచురించారు. మహాత్ముని రచనలను తెలుగులోకి అనువదించారు (నీతి ధర్మము, మూర్ఖరాజు కథ ; హైందవ స్వరాజ్యము మొ||) 1913లో శ్రీరామ చరిత్రము (వ్యాఖ్యానం) ప్రచ్ఛన్న పాండవం (5 అంకముల నాటకం - ద్రౌపదీ దేవి చరిత్ర); వోటు (1923), ఆంధ్రజాతీయ వాచకములు, ప్రపంచ చరిత్ర, వయోజన విద్యా ప్రచురణలు - మొ||వి ఎంతగానో ప్రశంసలు పొందాయి. రేడియో ప్రసంగాలు, విమర్శలు, వ్యాసాలు, సమీక్షలు యిలా అనంతంగా వారి కృషి సాగింది. ఆంధ్ర, ఆంగ్లభాషలలో మంచి వక్తగా పేరు పొందారు.

ఈ పుస్తకం కేవలం చరిత్ర అనిపించకుండా, సర్వోత్తమ రావుగారి జీవన ప్రస్థానాన్ని ఉద్యమాలవారీగా అధ్యాయాలుగా వర్గీకరించడంలో అప్పటి ఉద్యమాల గురించిన పూర్తి వివరాలతోపాటు రావుగారి సేవను, వ్యక్తిత్వాన్ని కూడా అర్థం చేసుకునే అవకాశం కలుగుతుంది. రావుగారి జీవిత చరిత్ర వ్రాయటం మహద్భాగ్యంగా భావించి రచయిత చేసిన ప్రయత్నం అభినందనీయం. ఈపుస్తకం మొదటి కూర్పు 1965లో రాగా, ఇప్పుడు వచ్చినది. రెండవ కూర్పు. తొలి ప్రచురణ తర్వాత జరిగిన 'సర్వోత్తమ జీవితం' గ్రంథావిష్కరణ, గాడిచెర్ల శతజయంతుత్సవాలు, గాడిచెర్ల ఫౌండేషన్ గురించిన వివరాలను అనుబంధంగా చేర్చారు. రావుగారి జీవిత విధానం ఈనాటి ప్రజా సేవకులకు, ఈ తరం యువకులకు ప్రబోధకంగా ఉంటుందనడంలో సందేహం లేదు.

350 పుటల ఈ పుస్తకాన్ని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం (విజయవాడ), గాడిచెర్ల ఫౌండేషన్ (కర్నూలు) సంయుక్తంగా ప్రచురించారు. ప్రథమ కూర్పు 1965లో వెలువడగా, ఇప్పుడీ రెండవ కూర్పును 2016లో వెలువరించారు. ఇప్పుడీ కూర్పును కాట్రగడ్డ శారదగారి దివ్య స్మృతికి శ్రద్ధాంజలి ఘటిస్తూ ప్రచురించిన కీ.శే. శారదగారి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు అభినందనలు. కీ.శే. శారదగారి అధ్యయన పరిశోధనారంగాలలో గ్రంథాలయోద్యమం, పౌరగ్రంథాలయాలు ప్రధాన అంశాలు కనుక వారి స్మారక సంపుటిగా దీనిని ప్రచురించారు.

ఎమ్.వి.శాస్త్రి
9441342999

పుస్తకం విడుదల

# సన్నిధానం శర్మ-'ప్రమేయ ఝరి' వ్యాససంకలనం

(ఫొటో రెండవ అట్టపైన చూడండి...)

సాహితీ వ్యాసంగాలు చేసే రచయితలు భాషా దారిద్ర్యం, ఉత్తేజ దారిద్ర్యం లేకుండా చూసుకొని రచనలు చేసినపుడే అవి పది కాలాల పాటు నిలుస్తాయని, ప్రఖ్యాతకవి మానేపల్లి రామక్రిష్ణ చెప్పినట్లు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తి టి.రజని అన్నారు. భాషా లోపం లేకుండా రచయిత తన భావాలను పూరించినపుడే ఆ రచనలు సన్నిధానం నరసింహశర్మలాగా ఉంటాయని తాత్త్వికంగా అన్నారు. దరిద్రుడు అన్నదానం చేస్తే ఎలా ఉంటుంది, ఉత్తేజం లేకుండా రచనలు చేయడం చావుతో సమానమని, సన్నిధానం వారి రచనల్లో ఈ రెండూ పూరింపబడి, చక్కగా వచ్చాయని జస్టిస్ రజని అన్నారు. సన్నిధానం శర్మ రాసిన సాహితీ వ్యాస సంకలాన్ని హైదరాబాద్ స్టడీ సర్కిల్‌లో అక్టోబర్ 11సాయంత్రం లాంఛనంగా ఆవిష్కరించి క్లుప్త ప్రసంగం చేశారు. గౌతమి తదితర గ్రంథాలయాల గూర్చిన వ్యాసం చదువుతుంటే తాను గ్రంథాలయంలో కూర్చుండి చదువుకున్న పూర్వపు రోజులు గుర్తుకు వస్తున్నాయని అన్నారు. తాను సాహిత్య సభల్లో మాట్లాడే అలవాటు లేదని చెబుతూనే చక్కటి ప్రసంగం చేసి సభికులను ఆకట్టుకున్నారు.

సభాధ్యక్షత వహించిన పాలమూరు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అచార్యులు గూడూరు మనోజ మాట్లాడుతూ, రచయిత శర్మ బహుగ్రంథకర్త, రాజమండ్రి గౌతమి గ్రంథాలయంలో గ్రంథపాలకుడిగా పనిచేస్తూనే గ్రంథాధ్యయనం చేసి, అనేక రచనలు చేశారని, అమూల్యమైన పుస్తకాలను, గుజిలీ ప్రతులను సేకరించారని, కశ్మీరీ, పంజాబీ, హర్యానా జానపదాలను సేకరించి తెలుగులోకి అనువాదం చేశారని అన్నారు. యుపి ఘోరక్‌పూర్ గీతాప్రెస్ వారు, వీరు రాసిన నలదమయంతి అనువాద కథను తెలుగులోకి 60 వేల ప్రతులు అచ్చు వేశారని అన్నారు.

ప్రస్తుతం గుజిలీ ప్రతులపై పాండిచ్చేరిలో పరిశోధనలు జరుగుతున్నాయని అన్నారు. వీరు రాసిన వీర పాండ్య కట్ట బహ్మన ఏకపాత్ర నాటకాన్ని, వీరి అనుమతితో గోరేటి వెంకన్న లాంటి ప్రముఖులు, అనుమతి పొంది, తెలంగాణాలో ప్రదర్శించి మెప్పు పొందారని అన్నారు. వీరు ఆరుద్ర, చలసానిల వుత్తరాలను సేకరించి సాహిత్య ప్రయోజనం కల్పించారని అన్నారు.

విశిష్ట అతిథిగా హాజరైన సీనియర్ జర్నలిస్టు పొత్తూరి వేంకటేశ్వర రావు మాట్లాడుతూ, ఆకాలంలో గౌతమి గ్రంథాలయానికి రాని రచయితలే లేరని, నేను కూడా ఈ గ్రంథాలయం ద్వారా ప్రయోజనం పొందానని, ఎక్కడ ఏ పుస్తకంలో ఏముందో చెప్పే ఘనత శర్మ గారిదని అన్నారు. రచయిత లోతైన పరిశోధనతో ఈ సాహితీ వ్యాసాలు రాశాడని, ఈ ప్రమేయఝరి పుస్తకం చెబుతున్నదని కొనియాడారు. కవర్ పేజీ ఆర్థవంతంగా ఉందని అన్నారు. తిరుమలరావు వంటి వాళ్ళు విజ్ఞాన సర్వస్వం లాంటి వారని అన్నారు. 84 ఏళ్ళ వయస్సులో చక్కటి పదప్రయోగాల గూర్చి శర్మ గారి పుస్తకం ద్వారా తెలుసుకున్నట్లు తెలిపారు.

అమ్మనుడి పత్రిక సంపాదకులు డా.సామల రమేష్ బాబు మాట్లాడుతూ, ఒక లక్ష పుస్తకాల మధ్య గడిపిన ఒక గ్రంథపాలకుడు,కవి, రచయిత ఎందుకు కాడని అన్నారు. రచయితలో గొప్ప పరిశోధకుడున్నాడని, ప్రమేయ ఝరిలో చక్కటి వ్యాసాలున్నాయని అన్నారు. వీరి వ్యాసాలలో అతిశయోక్తులు, అలంకారాలుండవని అన్నారు. డా. సినారె, కాళోజీ వంటి సాహితీ వేత్తలతో వీరు చేసిన ఇంటర్వ్యూలు చక్కగా వచ్చాయని అన్నారు.

పుస్తక సమీక్ష చేస్తూ ప్రముఖ సాహిత్య విమర్శకులు డా..ఏ.కె.ప్రభాకర్ ఇది మూడు పాయల ప్రవాహమని, గ్రంథకర్త శర్మ గారి ఇంటర్వ్యూలు, వ్యాసాలు, సమీక్షలు అనర్గళ ప్రవాహ సదృశాలని, ఇది త్రివేణీ సంగమమని అన్నారు. ఇందులో 14 సాహితీ వ్యాసాలు, అయిదుగురు సాహితీ వేత్తల ఇంటర్వ్యూలు, నాలుగు పుస్తక సమీక్షలు ఉన్నాయని అన్నారు. పరిశోధకుడు, సాహిత్య ప్రేమికుడు, జర్నలిస్టు, గ్రంధపాలకుడు, అరుదైన పుస్తక సేకర్తయని ప్రశంసించారు. విస్తృతంగా చదివిన దానిని రక్తగతం చేసుకొని, మౌఖిక పరిశోధనతో చక్కటి వ్యాసాలు రాస్తున్న శర్మ, సంప్రదాయాన్ని ఛేదించుకొని వచ్చిన ఆధునికుడని ప్రశంసించారు. వీరి రచనల్లో నిండుదనం, సమగ్రతలు కనిపిస్తాయని అన్నారు. శర్మగారి వ్యాసాల్లో నిఖార్సయిన సమీక్షకుడు కనిపిస్తాడని అన్నారు. దిగితేగాని లోతు తెలియని సాహిత్య ప్రవాహ ఝరి ఇది, ఇందులోని వ్యాసాలు చదువుతుంటే సమయమే తెలువకుండా పోతుందని అన్నారు.

రచయిత సన్నిధానం నరసింహ శర్మ తన పుస్తకాన్ని ప్రముఖ జానపద విజ్ఞాన సర్వస్వం అయిన ఆచార్య జయధీర్ తిరుమల రావు గారికి అంకితం ఇస్తూ, కొంత ఉద్వేగానికి లోనయ్యారు. తిరుమలరావు గారికి ఎలాంటి ఆడంబరపు వాసనలు లేవని, తన మీద ఉన్న ప్రేమతో స్వీకరిస్తూండటాన్ని గొప్ప యోగ్యతగా ప్రకటించుకుంటున్నానని అన్నారు. నేదునూరి గంగాధరం లాంటి సాహితీ ప్రముఖుల సహకారంతో తాను రాజమండ్రి గౌతమి గ్రంథాలయంలో కాలు పెట్టానని, ఎందరో తనకు సహకరించారని తన ఉద్యోగ జీవితపు తీపి గుర్తుల్నిఈ సందర్భంగా నెమరు వేసుకొన్నారు. ఆచార్య జయధీర్ తిరుమల రావు మాట్లాడుతూ, రచయిత శర్మ తాను రాజమండ్రిలో పనిచేసినపుడు పరిచయమని, రెండున్నర దశాబ్దాల కింద పరిచయమైన ఆయన గతంలో లాగానే ఉన్నారని అన్నారు. సంప్రదాయం, ఆధునికత తెలిసిన సమదృష్టి కలవాడని అన్నారు. జానపద సాహిత్యంలో లోతైన పరిచయం ఉన్నదని, అనువాద సాహిత్య సృజనలో దిట్టయని అన్నారు. నేదునూరి గంగాధరం, మధునాపంతుల లాంటి వారితో సాన్నిహిత్యమున్న పండిత,పామర కవియని అన్నారు. ఆర్కివ్స్ లో అనేక ప్రతులున్నాయని, వాటి మీద పరిశోధనలు జరుగాల్సియుందని అన్నారు. వీరి గుజిలీ ప్రతుల సేకరణ అపూర్వమైనదని అన్నారు. కృష్ణదేవరాయ, వేటపాలెం, గౌతమి గ్రంథాలయాలను కొల్లగొట్టి, విజ్ఞాన సేకరణ చేశాడని, ఆత్మీయత కల హాస్యప్రియుడని అన్నారు. సినీ నటుడు కాకరాల, రచయితలు నిఖిలేశ్వర్, కుప్రా జితేంద్ర, అందెశ్రీ, సంకేపల్లి నాగేంద్రశర్మ, మార్వాడి సుదర్శన్, పర్యావరణ వేత్త రాజేందర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

సంకేపల్లి నాగేంద్రశర్మ, కరీంనగర్,
9441797650.




**యుగకర్త గురజాడ :** వ్యాసాలు
రచన : ప్రొ॥ వెలమల సిమ్మన్న
పుటలు: 148, వెల: రు.160/-
ప్రతులకు: శ్రీమతి వి.పార్వతి, ఎమ్.ఐ.జి.-38, డోర్ నెం. 4-69, ఫ్లాట్ నెం. 401, శ్రీ రమణ రెసిడెన్సీ, లాసన్స్ బే కాలనీ, విశాఖపట్నం-530 027
సెల్ :9440641617



**ఏడు పదులు :**
జన్మదిన ప్రత్యేక సంచిక
కూర్పు : డా॥ కనుపర్తి విజయలక్ష్మి, దీప్తిగోరా
పుటలు: 112, అమూల్యం
ప్రచురణ : సిద్ధార్థ ప్రచురణలు, మండపేట
సెల్ : 9441329404




**తొలి మలితరం తెలుగు కథలు :** వ్యాసాలు
రచన: డా॥ అక్కిరాజు రమాపతిరావు
పుటలు: 388, వెల: రు.250/-
ప్రతులకు : నవోదయ బుక్ హౌస్, కాచీగూడ
ప్రచురణ : బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్, గుంటూరు.
హైదరాబాద్ - ఫోన్ : 040-24652387
విశాలాంధ్ర బుక్ హౌస్ అన్ని శాఖలు.




**స్వాత్మ కథ :** వేయి పున్నముల వేడుక
రచయిత : డా॥అక్కిరాజు రమాపతిరావు
పుటలు: 458, వెల: రు.558 /-
ప్రతులకు: నవోదయ బుక్ హౌస్, కాచీగూడ
హైదరాబాద్ - ఫోన్ : 040-24652387
విశాలాంధ్ర బుక్ హౌస్ అన్ని శాఖలు.




**మహిళ :**దీర్ఘ వ్యాసం, రచన : బి.హనుమారెడ్డి.
పుటలు: 200, వెల: రు.100/-,
ప్రతులకు: అన్ని విశాలాంధ్ర బుక్ హౌస్‌లు,
బి.హనుమారెడ్డి, ప్రకాశం జిల్లా రచయితల సంఘం
రాజా పానగల్ రోడ్
ఒంగోలు - 523002
ఫోన్: 94402 88080




**తెలుగు కోసం :** అనుశీలన
రచన: డా॥ జి.వి. పూర్ణచందు
పుటలు: 374, వెల: రు.300/-
ప్రతులకు : డా॥ జి.వి. పూర్ణచందు
సత్నామ్ టవర్స్, మొదటి అంతస్తు
బకింగ్‌హామ్ పోస్టు ఆఫీసు ఎదుట, గవర్నరుపేట
విజయవాడ-520 002,ఫోన్ :9440172642



**దక్షిణాంధ్ర దారి దీపాలు :**
(తెలుగు మహనీయుల వెలుగు జాడలు)
సంపాదకుడు : డా॥ నాగసూరి వేణుగోపాల్
పుటలు:168, వెల: రు.200/-
ప్రతులకు:గుడిమెట్ల చెన్నయ్య, నెం. 13/53
వాసుకి నగర్, 2వ వీధి, కొడుంగయూర్,
చెన్నై - 600 118, సెల్ : 9790783377




**అమరజీవి బలిదానం:**(పొట్టి శ్రీరాములు పోరాట గాథ), పుటలు:268, వెల: రు.200/-
సంపాదకత్వం : డా॥ నాగసూరి వేణుగోపాల్
ప్రతులకు:ఆం.ప్ర.సృజనాత్మకత సంస్కృతి సమితి
ఘంటసాల సంగీత నృత్య కళాశాల,
దుర్గాపురం, విజయవాడ - 520 003



**అఖిల భారత**
**బలిజ కాపు స్వాతంత్ర్య సమరయోధులు**
రచయిత : బి.పద్మారావు రాయలు
పుటలు:252, వెల: రు.150/-
ప్రతులకు:శ్రీ పుప్పాల శంకర్
రాయల్ క్లబ్ మెంబర్, మధురానగర్
విజయవాడ సెల్ : 9246373774




**జీవన గతులు:**(కథాసంపుటి) పుటలు:170
వెల: రు.99/, రచన : చెన్నూరి సుదర్శన్
ప్రతులకు:చెన్నూరి సుదర్శన్
11-1-21/19, ఫ్లాట్ నెం. 5, రోడ్‌నెం. 1
శ్రీ సాయిలక్ష్మీ శోభా నిలయం
రాంనరేష్‌నగర్, హైదర్‌నగర్, హైదరాబాద్-85
సెల్ : 99440558748




**గీతాంజలి :** కవిత్వం
అనువాదం : శివరామకృష్ణ
పుటలు:140, వెల : 100/-
ప్రతులకు : వి.శివరామకృష్ణారావు, 4238, జనప్రియ మెట్రోపోలిస్, 4వ బ్లాక్, 2వ వింగ్, మోతినగర్, హైదరాబాద్ - 500018, సెల్ : 9441428804




**అమ్మ మనసు (కవిత్వం)**
రచన : డా॥ నూనె అంకమ్మ రావు
పుటలు: 96, వెల: రు.60/-
ప్రతులకు : నూనె శ్రీదేవి, శివప్రసాద్ కాలని
కొత్తడొంక, రాయల్‌ఎన్‌ఫీల్డ్ షోరూమ్ ప్రక్కవీధి
ఒంగోలు - 523 002, ప్రకాశం జిల్లా.
సెల్ : 9397907776

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

# భాషాకోవెలలో 'బాల'దివ్వెలు



అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly) Date of publication : 1st of every month RNI-APTEL / 2015/62362
November 2018 Vol :4, Issue 9 Date of posting : 3rd & 6th of every month Postal Reg NO. TEN/13/2018-20




If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244